www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విపత్తు నిర్వహణ విభాగం ఇక హైడ్రా

- ఇప్పటిదాకా జీహెచ్ఎంసీలో భాగం 13
- ప్రత్యేక వ్యవస్థగా విస్తరించాలని సీఎం నిర్ణయం
- అధిపతిగా డీఐజీ స్థాయి పోలీస్ అధికారి
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాల నుంచి హైడ్రాలో ప్రత్యేక బృందాలు
- విధులు, నిధుల ముసాయిదా తయారీకి ఆదేశం



మంగళవారం | 2-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 94 |

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: ఏకాదశి ఉ. 8.42 తదుపరి ద్వాదశి; నక్షత్రం: కృత్తిక తె. 4.40 తదుపరి రోహిణి; వర్జ్యం: సా.5.03-6.36, దుర్ముహూర్తం: ఉ.8.24-9.16, రా.10.25-11.07, అమృతఘడియలు: రా.2.20-5.53, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విస్తరణకు వేళాయె!

- గవర్నర్ రాధాకృష్ణన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం
- ఒకట్రెండు రోజుల్లో విస్తరణ అని సమాచారం 13
- ఈ నెల 5 లోపే కొత్త మంత్రుల ప్రమాణం స్వీకారం!
- నేడో రేపో ఢిల్లీకి రేవంత్.. ఖర్గే, రాహుల్‌తో భేటీ
- మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ చీఫ్‌పై తుది నిర్ణయం!



గవర్నర్ రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మాట్లాడుకుందాం!

6న కలుద్దాం.. ముఖ్యమంత్రి రేవంత్‌కు ఏపీ సీఎం చంద్రబాబు లేఖ

- విభజన అంశాలపై చర్చించుకుందాం
- పరిష్కారాలు గుర్తిద్దామని ప్రతిపాదన
- తెలంగాణ సీఎం సానుకూల స్పందన
- ప్రజాభవన్‌లో సీఎంల భేటీ ఖరారు
- నేడు అధికారులతో రేవంత్ భేటీ!
- విభజన సమస్యలపై చర్చకు నిర్ణయం

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీకి రంగం సిద్ధమైంది. ఈ నెల 6వ తేదీన హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఈ సమావేశం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై స్వయంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంలో సంబంధిత అంశాలపై ముఖాముఖీ చర్చించుకుందామని ప్రతిపాదించారు. ఇందుకు రేవంత్ కూడా

మిగతా 13వ పేజీలో...



ఖైదీల 'క్షమాభిక్ష'కు ఓకే

- విడుదలకు గవర్నర్ ఆమోదముద్ర 13
- వారికి ఉపాధి చూపాలని సూచన
- 'గవర్నర్ కోటా ఎమ్మెల్సీల'పైనా చర్చ

పన్ను చెల్లింపుదారుల వివరాలివ్వండి!

కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ 12

హైకోర్టులో కేసీఆర్‌కు

ఎదురుదెబ్బ

- విద్యుత్తు కమిషన్‌పై వేసిన పిటిషన్ డిస్మిస్
- కమిషన్ ఏర్పాటుకు హైకోర్టు సమర్థన
- అప్పగించిన అంశాలు విస్తృతమైనవి..
- చైర్మన్ రాజ్యాంగబద్ధ పదవిలో పనిచేశారు
- తన వద్ద ఉన్న విషయాలనే వెల్లడించారు
- పక్షపాతం అనడం కాదు.. నిరూపించాలి
- తీర్పులో స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం



హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తన ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లు, విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంపై ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్‌ను రద్దు చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే పరిధి ప్రభుత్వానికి లేదని, తనకు కమిషన్ ఇచ్చిన నోటీసులు కొట్టేయాలని, కమిషన్ ప్రెస్‌మీట్ పెట్టడం ద్వారా పక్షపాతం చూపించిందంటూ కేసీఆర్ పేర్కొనడాన్ని తప్పుబట్టింది. కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. విద్యుత్తు నియంత్రణ కమిషన్ (ఈఆర్సీ) ఇప్పటికే

మిగతా 12వ పేజీలో...

కేసీఆర్‌కు మరో చాన్స్ ఇద్దామా!

- లేఖ రాసే యోచనలో జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్
- విద్యుత్తు రఘు, కోదండరామ్‌ను క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి కేసీఆర్‌కు అవకాశంపై పరిశీలన 12

కవిత.. మహిళ అని సానుభూతి చూపలేం! 14

బెయిల్ పిటిషన్ తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు

అనుమతుల్లేకుండా నల్లగొండ బీఆర్ఎస్ కార్యాలయం! 12

విచారణకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు

కాంగ్రెస్‌లోకి బండా ప్రకాశ్?

ఫిరాయింపులను ప్రోత్సహించేది మేం టీడీపీ, బీఎస్పీ శాసనసభ పక్షాలను విలీనం చేసుకున్నాం: కేటీఆర్ 12




మట్టి మిద్దె మింగేసింది 14

- వానకు తడిసి కుప్పకూలిన పైకప్పు
- నిద్రలోనే తల్లి, ముగ్గురు చిన్నారుల దుర్మరణం
- స్వల్పగాయాలతో బయటపడ్డ ఇంటిపెద్ద
- నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లలో విషాదం

మేధాపాట్కర్‌కు 5 నెలల జైలు

పరువునష్టం కేసులో కోర్టు తీర్పు

సక్సేనాకు 10 లక్షలు చెల్లించాలి.. 2



జన్యుసవరణ ప్రక్రియకు మనోళ్ల మెరుగు

- జీన్ ఎడిటింగ్‌లో కీలక కాస్-9 ప్రొటీన్
- కొత్త బ్యాక్టీరియా నుంచి సేకరణ
- సీఎస్ఐఆర్-ఐజీఐబీ, ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి పరిశోధకుల ఘనత
- కొత్త చికిత్సతో ఓ బాలుడికి కంటిచూపు

గూగుల్‌పే/ఫోన్‌పే ద్వారా చెల్లింపులకు చెల్లు

- డిస్కమ్‌ల యాప్/వెబ్‌సైట్‌లోనే అవకాశం
- ఆర్‌బీఐ మార్గదర్శకాలతో నిర్ణయం 14

మీరు హిందువులు కాదు!

హిందూధర్మం అహింస, నిర్భీతిని ప్రవచిస్తే.. మీరు హింస, ద్వేషం వ్యాపింపజేస్తున్నారు

- అధికార పక్షానికి 24 గంటలూ అదే పని
- లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు
- హిందూ సమాజాన్నే హింసావాదులంటారా?
- రాహుల్ వ్యాఖ్యలు తీవ్రమైన విషయం: మోదీ
- క్షమాపణలు చెప్పాలని అమిత్‌షా డిమాండ్

ఈ మూడున్నరేళ్లయినా నిజంవైపు ఉండండి

- రాజ్యసభ చైర్మన్‌ను ఉద్దేశించి విపక్ష నేత ఖర్గే
- ఇప్పటిదాకా పక్షపాతం చూపారా?: నడ్డా
- అధికార, విపక్ష నేతల మధ్య వాడీవేడి చర్చ



న్యూఢిల్లీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ వాళ్లు హిందువులే కాదని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. భయాన్ని, విద్వేషాన్ని, అబద్ధాలను వ్యాపింపజేయడం హిందూధర్మం కాదని చెప్పారు. తాము హిందువులమని చెప్పుకొంటున్న వారు నిత్యం హింస, విద్వేష వ్యాప్తికి పాల్పడుతున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీ వీరెవరూ మొత్తం హిందూ సమాజానికి ప్రతినిధులు కాదని స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం మధ్యాహ్నం సభలో రాహుల్‌గాంధీ విపక్ష నేత హోదాలో తొలిసారిగా మాట్లాడారు. సందర్శకుల గ్యాలరీ నుంచి తల్లి సోనియా, సోదరి ప్రియాంక చూస్తుండగా సుదీర్ఘంగా

మిగతా 2వ పేజీలో...

దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాల నిరసన



నీట్.. కమర్షియల్

- ధనవంతుల పిల్లల కోసమే ఈ పరీక్షను రూపొందించారు
- జాతీయ స్థాయి పేరుతో అడ్మిషన్లు కేంద్రీకృతం చేశారు
- లీక్‌పై చర్చకు ఒకరోజును కేటాయించాలి: రాహుల్‌గాంధీ
- రాష్ట్రపతి ప్రసంగం ధన్యవాద తీర్మానంపై చర్చ ఉండగా వేరే అంశానికి సమయం కుదరదన్న రాజ్‌నాథ్, స్పీకర్
- నిరసనగా లోక్‌సభ నుంచి 'ఇండియా' ఎంపీల వాకౌట్

న్యూఢిల్లీ, జూలై 1: మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్ష మొత్తం కమర్షియల్‌గా మారిపోయిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ధనవంతుల పిల్లల కోసమే దాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. ఎగ్జామ్ పేరు(కోచింగ్ నుంచి అక్రమాల వరకు)తో వేల కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయని వ్యాఖ్యానించారు. నీట్ ఎంతమాత్రం ప్రొఫెషనల్ పరీక్ష కాదన్నారు. జాతీయ స్థాయి పరీక్ష పేరుతో మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలను కేంద్రీకృతం చేశారని విమర్శించారు. ఓ విద్యార్థి నీట్‌లో మంచి ర్యాంకు సాధించినా డబ్బు లేకపోతే కాలేజీలో చేరలేని

మిగతా 2వ పేజీలో...

గ్రేస్ మార్కుల 'టాపర్ల'కు 720 రాలే!

విడుదలైన నీట్ రీ-టెస్ట్ ఫలితాలు

మారిన జాబితాతో కౌన్సెలింగ్ 2

25 వేల మంది టీచర్ల బదిలీ!

- వీరిలో కొందరు ఇంకొన్నాళ్ల పాటు పాతచోటనే!
- విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్న దగ్గర ఈ పరిస్థితి
- 10 వేల మంది వరకు ఇలాంటి ఉపాధ్యాయులు!
- రంగారెడ్డి మినహా అన్ని జిల్లాల్లో బదిలీలు పూర్తి

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా 25 వేల మంది ఎస్జీటీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఆదేశాలు జారీ అయ్యాయి. బదిలీ అయిన వారిలో చాలా మంది సోమవారమే కొత్త బడుల్లో చేరిపోయారు. రంగారెడ్డి జిల్లా మినహా రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తయింది. ఈ జిల్లాలో రెండు మూడు రోజుల్లో దీనిని పూర్తి చేయనున్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల్లో భాగంగా ఇప్పటికే పదోన్నతులను పూర్తి చేశారు. స్కూల్ అసిస్టెంట్ల (ఎస్ఏ) బదిలీలను కూడా ముగించారు. కాగా బదిలీ అయిన వారిలో కొందరు కొత్త స్కూల్‌లో జాయిన్ కావడానికి కొంత సమయం ఆగాల్సి ఉంటుంది. రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ పోస్టులు ఉండాలనే ఉద్దేశంతో హేతుబద్ధీకరణ విధానాన్ని అమలు పరుస్తున్న

మిగతా 12వ పేజీలో...



జాబ్ క్యాలెండర్ రెండు వారాల్లో!

షెడ్యూలు ప్రకారం పరీక్షలు.. పకడ్బందీగా కొలువుల భర్తీ

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు శుభవార్త..! ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు వారాల్లో జాబ్ క్యాలెండర్ విడుదల చేసేందుకు సిద్ధమైంది. సర్కారీ కొలువులను పకడ్బందీగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని, జాబ్ క్యాలెండర్ విడుదలకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే అధికారులు ప్రాథమిక నివేదికను అందజేయగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. దీంతో.. అధికారులు జాబ్ క్యాలెండర్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారని, రెండు వారాల్లో విడుదల చేయనున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ), తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు, ఇతర నియామక బోర్డులకు సంబంధించిన షెడ్యూళ్లతో.. జాబ్ క్యాలెండర్ విడుదలయ్యాక.. అధికారులు ఆ వివరాలను

మిగతా 12వ పేజీలో...

ఆహా.. ఒకటో తారీఖు

- నాలుగున్నరేళ్ల తర్వాత ఏపీలో ఒకటినే జీతాలు, పింఛన్లు
- 90 శాతం పైగా ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ
- 50% మంది ప్రభుత్వ పెన్షనర్లకూ అందిన పింఛన్లు
- 61లక్షల మందికి వివిధ సామాజిక పెన్షన్లు పంపిణీ
- మూణ్నెల్ల బకాయిలతో కలిపి.. రూ.7,000 అందజేత
- పెనుమాకలో స్వయంగా అందజేసిన ఏపీ సీఎం బాబు



శ్రీకాకుళంలో పింఛనుతో వృద్ధురాలు

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులు, పెన్షనర్లు, సామాజిక పింఛన్లు అందుకునేవారికి సోమవారం పండుగ రోజయ్యింది! నాలుగున్నరేళ్లుగా 'అమ్మో.. ఒకటో తారీఖు' అనుకున్నవారంతా.. సోమవారం 'ఆహా.. ఒకటో తారీఖు' అనుకున్నారు. తర్వాత ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఒకటో తేదీనే వారి ఖాతాల్లో జమయ్యాయి! చంద్రబాబు సర్కారు పెంచిన పింఛను పాతబకాయిలతో సహా అందడంతో అవ్వాతాతల ముఖాలు వెలిగిపోయాయి. ఉద్యోగుల్లో 90% మందికి పైగా జీతాలు

మిగతా 3వ పేజీలో...

శభాష్.. ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి

» సకాలంలో పన్నులు చెల్లిస్తూ నవభారత నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.. కేంద్ర ఆర్థిక శాఖ ప్రశంస

» వరుసగా మూడో ఏడాది కేంద్రం నుంచి అభినందన

హైదరాబాద్, జూలై 1: తెలుగు మీడియా రంగంలో తనదైన ముద్ర వేసుకున్న 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'.. పన్నుల చెల్లింపులో మరోసారి తన క్రమశిక్షణను, నిబద్ధతను చాటుకుంది. కేంద్ర ఆర్థిక శాఖ నుంచి వరుసగా మూడో ఏడాది అందుకున్న ప్రశంసాపత్రమే ఇందుకు నిదర్శనం. మీడియాను, పరపతిని అడ్డుపెట్టుకుని పన్నులు ఎగ్గొట్టాలని చూస్తున్నవారున్న ఈ రోజుల్లో పారదర్శకంగా పన్నులు చెల్లిస్తూ.. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' తన కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తిస్తోంది. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో సకాలంలో, సక్రమంగా ఐటీ రిటర్న్స్ ఫైల్ చేసి, జీఎస్టీ చెల్లించి కేంద్ర ఆర్థిక శాఖ నుంచి అభినందనలు అందుకుంది. తాజాగా.. జీఎస్టీ రిజిస్ట్రేషన్ నంబర్ 36AAHCA3752H1ZPను కలిగిన 'ఆమోద బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్'ను అభినందిస్తూ కేంద్ర ఆర్థిక శాఖ 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రశంసా పత్రాన్ని పంపింది. సక్రమంగా ఆదాయపు పన్ను చెల్లిస్తూ నవ భారత నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషిస్తున్న 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'ని సీబీఐసీ ఛైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ ఈ ప్రశంసాపత్రంలో అభినందించారు.

నీట్.. కమర్షియల్

(మొదటి పేజీ తరువాయి)



దర్యాప్తు సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని పార్లమెంటు ఆవరణలో విపక్ష ఎంపీల నిరసన

పరిస్థితి ఉందన్నారు. సోమవారం లోక్‌సభ ప్రారంభం కాగానే, రాహుల్ నీట్ పేపర్ అంశాన్ని లేవనెత్తారు. నీట్ ప్రశ్నపత్రం లీకైన వ్యవహారంపై చర్చకు ప్రత్యేకంగా ఒకరోజును కేటాయించాలని డిమాండ్ చేశారు. "నీట్ పేపర్ లీక్ ప్రభావం లక్షలాది మంది విద్యార్థులపై పడింది. ఇది చాలా ముఖ్యమైన అంశం. పార్లమెంట్‌లో దీనిపై చర్చించడం ద్వారా విద్యార్థులకు సానుకూల సంకేతాలిద్దాం. అందువల్ల చర్చకు అనుమతించండి" అని కోరారు. దీనిపై రక్షణ మంత్రి, లోక్‌సభ డిప్యూటీ లీడర్ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ముగిసేవరకు వేరే అంశంపై చర్చ కుదరని చెప్పారు. అలాగైతే ధన్యవాద తీర్మానంపై చర్చ ముగిసిన తర్వాతనైనా సమయం ఇవ్వాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. దీనిపై స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ.. ధన్యవాద తీర్మానం సందర్భంగా వేరే అంశంపై చర్చ సంప్రదాయం లోక్‌సభలో లేదన్నారు. ఇదే సమయంలో, ధన్యవాద తీర్మానంపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చర్చను ప్రారంభించడంతో విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. ఇదిలా ఉండగా, విపక్ష నేతల గొంతు నొక్కడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం మానుకోవాలని ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. టీఎంసీ, ఆప్ ఎంపీలు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. అవినీతి ఆరోపణలతో బెంగాల్‌లో అరెస్టు చేసిన ముగ్గురు మంత్రులను వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. కేజ్రీవాల్ పోస్టర్లను ప్రదర్శించారు.

గ్రేస్ మార్కుల 'టాపర్ల'కు 720 మార్కులు రాలే!

విడుదలైన నీట్ రీ-టెస్ట్ ఫలితాలు.. వాటి ఆధారంగా ర్యాంకుల సవరణ

న్యూఢిల్లీ, జూలై 1: ఈ ఏడాది మేలో నిర్వహించిన నీట్ పరీక్షలో.. గ్రేస్ మార్కుల కారణంగా 720కి 720 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచినవారికి.. రీ-టెస్ట్‌లో ఆ మార్కులు రాలేదు! 1563 మందికి ఇచ్చిన గ్రేస్ మార్కులను రద్దు చేసి.. వారికోసం ప్రత్యేకంగా జూన్ 23న మళ్లీ పరీక్ష పెట్టిన జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం ఆ రీ-టెస్ట్ ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల ఆధారంగా.. నీట్-యూజీ 2024 అభ్యర్థులందరి ర్యాంకులను కూడా సవరించినట్టు తెలిపింది. గ్రేస్ మార్కుల కారణంగా.. అప్పట్లో ఆరుగురు టాపర్లుగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆ మార్కులను ఉపసంహరించుకోవడంతో టాపర్ల సంఖ్య 67 నుంచి 61కి తగ్గిపోయింది. ఆ ఆరుగురిలో ఐదుగురే రీ-టెస్ట్‌కు హాజరయ్యారు. మళ్లీ పెట్టిన పరీక్షలో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయనే విషయాన్ని ఎన్‌టీఏ వెల్లడించలేదుగానీ.. ఆ ఐదుగురిలో ఏ ఒక్కరికీ 720 మార్కులు రాలేదని విశ్వసనీయ సమాచారం. కాగా.. సవరించిన ర్యాంకుల ఆధారంగానే కౌన్సెలింగ్ జరగనుంది. ఇదిలా ఉండగా, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షల ఫలితాలు సోమవారం వెల్లడయ్యాయి.

వెంకయ్య నాయుడికి మోదీ జన్మదిన శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు ప్రధాని మోదీ సోమవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "వెంకయ్యనాయుడు గారికి 75వ జన్మదిన శుభాకాంక్షలు. ఆయన దీర్ఘాయుష్షుతో ఆరోగ్యంగా జీవించాలని ప్రార్థిస్తున్నాను. ఈ విశిష్టమైన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన గురించి ఒక వ్యాసం రాశాను. వెంకయ్యనాయుడి జీవనం, సేవ, దేశ నిర్మాణం పట్ల నిబద్ధతపై కొన్ని అభిప్రాయాలను ఆ వ్యాసంలో ప్రస్తావించాను"అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు. వెంకయ్యనాయుడుకు ప్రజాసేవ పట్ల ఉన్న అంకితభావం, నిబద్ధతను కొనియాడారు.

దొంగతనం చేస్తున్నప్పుడు చూసిందని 9 ఏళ్ల బాలికను చంపిన 16 ఏళ్ల బాలుడు

» తర్వాత కర్పూరం బిళ్లలు చల్లి దహనం.. గురుగ్రామ్‌లో ఘటన

గురుగ్రామ్, జూలై 1: దొంగతనం చేస్తున్నప్పుడు చూసిందని ఓ 9 ఏళ్ల బాలికను 16 ఏళ్ల బాలుడు దారుణంగా హత్య చేశాడు. హరియాణాలోని గురుగ్రామ్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న 4వ తరగతి చదువుతోన్న బాలిక, 10వ తరగతి అభ్యసించే నిందితుడి కుటుంబాలు మంచి సయోధ్యతో ఉండేవి. సోమవారం బాలిక తల్లి కుమారుడితో కలిసి నిందితుడి ఇంటికి వెళ్లింది. ఇది గమనించిన నిందితుడు వెంటనే బాలిక ఇంటికి వెళ్లాడు. ఇంట్లో బాలిక ఒక్కతే ఉండటాన్ని చూసి ఆమెకు హోంవర్క్‌లో సహాయం చేస్తానని అక్కడే కూర్చున్నాడు. బాలిక మూత్రవిసర్జనకు వెళ్లిన సమయంలో నగలు దొంగిలించాడు. ఇది బాలిక గమనించి కేకలు వేసే సరికి ఆమె గొంతునులిమి హత్య చేశాడు. అనంతరం కర్పూరం బిళ్లలు ఆమెపై చల్లి తగులబెట్టాడు. బాలిక తల్లి ఇంటికొచ్చి తలుపు కొట్టినా ఎవరూ తీయలేదు. తలుపులు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి బాలిక మృతదేహం సగం కాలిన స్థితిలో కనిపించింది. నిందితుడు ఓ మూలన కూర్చుని ఉన్నాడు. పోలీసుల అతడిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 20వేల అప్పుందని అది తీర్చేందుకే దొంగతనం చేశానని బాలుడు తెలిపాడు.

జలపాతం ప్రమాదంలో చిన్నారుల మృతదేహాలు లభ్యం

పుణే, జూలై 1: మహారాష్ట్రలోని లోనావాల ప్రాంతంలో జలపాతంలో పడి ఓ కుటుంబం కొట్టుకుపోయిన ఘటనలో మరో ఇద్దరు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. వారిని మరియా అన్సారీ(9), అద్నాన్ అన్సారీ(4)గా సహాయక బృందాలు గుర్తించాయి. జలపాతాన్ని సందర్శించేందుకు వెళ్లి.. ఆదివారం ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రమాదవశాత్తు అందులో పడి గల్లంతైన సంగతి తెలిసిందే. ఓ మహిళ(36), మరో ఇద్దరు మైనర్ బాలికల మృతదేహాలు కొద్ది గంటల్లోనే వెలికితీశారు. ఇద్దరు చిన్నారుల కోసం సోమవారం గాలింపు చర్యలు చేపట్టిన సహాయక బృందాలకు ఉదయం మరియా, సాయంత్రం అద్నాన్ మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు తెలిపారు.

ఆస్ట్రేలియా స్టూడెంట్ వీసా చార్జీలు రెట్టింపు

న్యూఢిల్లీ, జూలై 1: తమ దేశంలో వలసలు నిరోధించేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇతర దేశాల నుంచి ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆ దేశం వెళ్లే విద్యార్థులు చెల్లించాల్సిన స్టూడెంట్ వీసా ఫీజును దాదాపు రెండింతలు పెంచింది. గతంలో 473 అమెరికన్ డాలర్లుగా ఉన్న ఫీజును 1068 డాలర్లు చేసింది. జూలై 1వ తేదీ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అక్కడ తాత్కాలికంగా గ్రాడ్యుయేట్ చేసే వారు, విజిటర్, మారిటైమ్ క్రూ వీసాలతో ఉన్నవారు కూడా విద్యార్థి వీసాకు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులుగా పేర్కొంది. వేలాది మంది భారతీయ విద్యార్థులపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్య కోసం వెళ్తున్న విద్యార్థులలో భారత్ రెండో స్థానంలో ఉంది.

మీరు హిందువులు కాదు!

(మొదటి పేజీ తరువాయి)

గంటా 40 నిమిషాలపాటు ప్రసంగించారు. ఆయన మాట్లాడటానికి లేవగానే బీజేపీ సభ్యులు జైశ్రీరాం అని, విపక్ష సభ్యులు జైసంవిధాన్ అని పోటాపోటీ నినాదాలు చేశారు. ప్రసంగంలో భాగంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సభలో తీవ్ర దుమారం చెలరేగింది. మొత్తం అధికారపక్షం లేచి నిలబడింది. స్వయంగా ప్రధాని మోదీ రెండుసార్లు, మధ్యలో ఐదుగురు మంత్రులు ఒక్కోసారి రాహుల్ ప్రసంగానికి అడ్డుపడ్డారు. అయితే, రాహుల్ ఎక్కడా తగ్గకుండా తన ప్రసంగ ధాటిని కొనసాగించారు. ధైర్యం గురించి అన్ని మతాలు చెప్పాయని, ఖురాన్ కూడా నిర్భీతిని ప్రబోధించిందని, దువా(ఆశీస్సుల) కోసం లేచే చేతిలో కనిపించేది అభయ ముద్రేనని రాహుల్ గాంధీ చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ సభలో శివుడు, జీసస్, గురునానక్ చిత్రాలను ప్రదర్శించారు. హిందూత్వం, ఇస్లాం, సిక్కు, క్రైస్తవం, బౌద్ధ, జైన మతాలు నిర్భీతిని ప్రబోధించాయని గుర్తు చేశారు. వీళ్లందరూ భయపడొద్దు.. భయపెట్టొద్దు అని చెప్పారన్నారు. పరమ శివుడు కూడా ఎవరికీ భయపడొద్దు, ఎవర్నీ భయపెట్టొద్దని అభయ హస్తాన్ని చూపుతున్నాడని, అహింసను ప్రబోధిస్తున్నాడని దేవుడి చిత్రాన్ని చూపిస్తూ అన్నారు.

మీరు హిందువులే కాదు..

తమను హిందువులుగా చెప్పుకొనే వాళ్లు 24 గంటలూ విద్వేషాన్ని, హింసను, అబద్ధాలను వ్యాపింపజేయడమే పనిగా పెట్టుకున్నారని బీజేపీ సభ్యుల వైపు వేలు పెట్టి చూపిస్తూ రాహుల్ అన్నారు. బీజేపీ సభ్యులు ఆగ్రహంతో లేచి నిలబడగానే మీరు హిందువులే కాదు అని మరింత గట్టిగా చెప్పారు. సత్యానికి కట్టుబడి ఉండాలని, వెనక్కి తగ్గొద్దని, సత్యం మాట్లాడటానికి భయపడొద్దని హిందూమతంలో రాసి ఉందన్నారు. ఈ సందర్భంగానే ప్రధాని మోదీ జోక్యం చేసుకున్నారు. "ఇది చాలా తీవ్రమైన విషయం.




రాహుల్ ప్రసంగంపై అభ్యంతరం చెప్తున్న బీజేపీ ఎంపీలు

మొత్తం హిందువులను హింసావాదులనడం తీవ్రమైన విషయం" అన్నారు. దానికి రాహుల్ బదులిస్తూ, "బీజేపీ, మోదీయే మొత్తం హిందూ సమాజం కాదు. ఆరెస్సెస్ మొత్తం హిందూ సమాజం కాదు. హిందూత్వాన్ని బీజేపీకి కాంట్రాక్టు రాసివ్వలేదు" అన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా దేవుళ్ల పటాలను సభలో చూపించడం మీద అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించడానికి అనుమతి లేదని చెప్పారు. బీజేపీ మైనారిటీలను బెదిరిస్తోందని, ముస్లిములు, సిక్కులు, క్రైస్తవులకు




వ్యతిరేకంగా విద్వేషాన్ని, హింసను ప్రేరేపిస్తోందని రాహుల్ ఆరోపించారు. సభలో తాను మాట్లాడేటప్పుడు మోదీ ఎందుకు సీరియస్‌గా ఉంటారని రాహుల్‌గాంధీ ప్రశ్నించగా, విపక్ష నేతను సీరియస్‌గా తీసుకుంటామని, ఆ పదవిని గౌరవించడం రాజ్యాంగం తనకు నేర్పిందని మోదీ అన్నారు. కాగా, మణిపూర్‌ను అంతర్యుద్ధం స్థాయికి తీసుకెళ్లిన మోదీ ఇంతవరకు ఆ రాష్ట్రాన్ని సందర్శించలేదని రాహుల్ అన్నారు. అగ్నివీర్ పథకంతో సైనికులను వాడుకొని వదిలేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. భారత్ అనే భావన మీద, రాజ్యాంగం మీద బీజేపీ పూర్తి స్థాయిలో ఒక పద్ధతి ప్రకారం దాడి చేస్తోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. చాలామంది విపక్ష నేతల మీద వ్యక్తిగత దాడికి పాల్పడ్డారని, కొందరు ఇప్పటికీ జైళ్లలో ఉన్నారని పరోక్షంగా కేజ్రీవాల్ అరెస్టును ప్రస్తావిస్తూ చెప్పారు.

అవసరమైతే మోదీ పాదాలకు నమస్కరిస్తా



సభలో రాహుల్‌కు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు మధ్య కూడా సంవాదం జరిగింది. స్పీకర్ తనతో కరచాలనం చేసినపుడు నిటారుగా నిలబడ్డారని, మోదీతో కరచాలనం చేసినపుడు పూర్తిగా తల వంచారని రాహుల్ ప్రస్తావించారు. దాంతో బీజేపీ సభ్యులు భగ్గుమన్నారు. సభాపతి మీదే రాహుల్‌గాంధీ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అమిత్‌షా మండిపడ్డారు. ప్రధాని సభా నాయకుడని, పెద్దలు నేర్పిన విలువలను అనుసరించి, వయసులో తనకన్నా పెద్దవాడైన మోదీకి తలవంచానని స్పీకర్ బదులిచ్చారు. అవసరమైతే పాదాలకు కూడా నమస్కరిస్తానన్నారు. రాహుల్‌గాంధీ స్పీకర్ అభిప్రాయాన్ని గౌరవిస్తున్నా అంటూనే సభలో స్పీకర్ కన్నా ఎవరూ పెద్ద కాదని గుర్తు చేయదలచుకున్నానని చెప్పారు. మొత్తం విపక్షం తరపున స్పీకర్‌కు తల వంచుతున్నానని అన్నారు. అదే సమయంలో స్పీకర్ ఎవరి ముందూ తలవంచరాదని విజ్ఞప్తి చేశారు.

లోకం తీరు



రాహుల్ క్షమాపణ చెప్పాలి: షా

లోక్‌సభలో రాహుల్ ప్రసంగంపై అమిత్‌షా ఎదురుదాడికి దిగారు. కోట్ల మంది తాము హిందువులమని గర్వంగా భావిస్తుంటే రాహుల్‌గాంధీ వాళ్లనందర్నీ హింసావాదులని అంటున్నారని ఆరోపించారు. ఎమర్జెన్సీ విధించిన, 1984లో ఢిల్లీలో సిక్కులను ఊచకోత కోసిన కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన రాహుల్‌కు అహింస గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. రాహుల్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలన్నారు. మరోవైపు, ముఖ్యమైన స్థానాల్లో ఉన్నవారు హిందూత్వను హింసతో ముడి పెట్టడం దురదృష్టకరమని ఆరెస్సెస్ ప్రచార విభాగం అధిపతి సునీల్ అంబేద్కర్ అన్నారు. వివేకానందుడి హిందూత్వ అయినా, గాంధీ హిందూత్వ అయినా సుహృద్భావాన్ని, సోదరభావాన్ని సూచిస్తాయని చెప్పారు.

మైకులు ఆఫ్ చేయడానికి స్పీకర్ వద్ద స్విచ్ ఉండదు

న్యూఢిల్లీ, జూలై 1: లోక్‌సభలో శుక్రవారం తమ నేత రాహుల్‌గాంధీ మైకును స్పీకర్ ఆపేశారని కాంగ్రెస్ సభ్యులు చేసిన ఆరోపణను సభాపతి ఓం బిర్లా తోసిపుచ్చారు. స్పీకర్ వద్ద అలాంటి స్విచ్ ఉండదని స్పష్టం చేశారు. తనపై కాంగ్రెస్ ఎంపీలు చేసిన ఆరోపణపై ఆయన సోమవారం సభలో తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇది సభాపతి గౌరవానికి సంబంధించిన అంశమని.. సభ దీనిపై చర్చించాలని కోరారు. 'సభాపతి ఆదేశాల మేరకు మైక్ నియంత్రణ జరుగుతుంది తప్ప మైకు స్విచ్ దగ్గర ఉండదు. కాంగ్రెస్ ఎంపీసురేశ్ సైతం ప్యానెల్ ఛైర్‌పర్సన్‌గా సభను నడుపుతున్నారు. మైక్ స్విచ్ సభాపతి వద్ద ఉంటుందా ఆయన చెప్పాలి' అని నేరుగా ఆయన్నే అడిగారు. ఇదిలా ఉండగా, ఎంపీలు ప్రమాణం చేసేటప్పుడు రాజ్యాంగం పేర్కొన్న నిర్దిష్ట ఫార్మాట్‌లోనే చేయాలని ఓం బిర్లా సూచించారు. దానికి అదనపు పదాలు జోడించడం రాజ్యాంగం గౌరవాన్ని తగ్గిస్తుందని స్పష్టం చేశారు.

మూడున్నరేళ్లయినా నిజం వైపు ఉండండి

రాజ్యసభ చైర్మన్‌ను కోరిన ఖర్గే.. సభాపతిపై ఆరోపణలు సరికాదు: నడ్డా



న్యూఢిల్లీ, జూలై 1: రాజ్యసభలో అధికార, విపక్ష నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. నీట్‌లో అవకతవకలు, పార్లమెంటు ఆవరణలోని విగ్రహాల తరలింపు, ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ ప్రసంగాలు, ఆరెస్సెస్ తదితర అంశాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సభల్లో మోదీ విద్వేషపూరిత ప్రసంగాలు చేశారన్నారు. ఆరెస్సెస్ సిద్ధాంతాలపైనా ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యూనివర్సిటీలు, ఎన్‌సీఈఆర్‌టీతో పాటు ఇతర విద్యాసంస్థల్లో ఉప కులపతులు, ప్రొఫెసర్ల నియామకాల్లో ఆరెస్సెస్ ప్రమేయం ఉంటున్నదని, ఆ సంస్థ సిద్ధాంతాలు దేశానికి ప్రమాదకరమని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ధన్‌ఖడ్ మండిపడ్డారు. "ఆరెస్సెస్ దేశ అభివృద్ధికి కృషి చేస్తోంది. దేశ ప్రగతి కోసం శ్రమిస్తున్న ఎంతోమంది గొప్పవారు అందులో ఉన్నారు. అదేమైనా నేరమా?" అని ప్రశ్నించారు. ప్రధాని ప్రసంగాలపై, ఆరెస్సెస్‌పై ఖర్గే చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని జేపీ నడ్డా కోరగా.. తొలగిస్తున్నట్టు ధన్‌ఖడ్ ప్రకటించారు. పదేళ్ల పాలన కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని ఎన్నికల సమయంలో మోదీ చెప్పారన్న ఖర్గే.. మూడోసారి అధికారంలోకి రాగానే పేపర్ లీక్‌లు, ఉగ్రదాడులు, రైలు ప్రమాదం, విమానాశ్రయంలో టెర్మినల్ కూలడం, వంతెనలు కూలడం లాంటి అనేక ఘటనలు జరిగాయని ఎద్దేవా చేశారు. ఖర్గే వ్యాఖ్యలపై జేపీ నడ్డా మండిపడ్డారు. రాబోయే మూడు, మూడున్నరేళ్ల కాలంలో (ధన్‌ఖడ్ పదవీ కాలం ముగిసే సమయం) అయినా నిజం పక్షాన నిలవాలంటూ ఖర్గే వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన ధన్‌ఖడ్ తానెప్పుడూ సత్యం వైపే ఉంటానన్నారు. నడ్డా మాట్లాడుతూ.. రాబోయే మూడున్నరేళ్లయినా నిష్పక్షపాతంగా ఉండాలని ఖర్గే వ్యాఖ్యానించారని, అంటే గడిచిన 18 నెలలు ఛైర్మన్ పక్షపాతంగా వ్యవహరించారని ఆరోపించినట్లేనన్నారు. ఇది తీవ్రమైన ఆరోపణ అని, దీన్ని తేలిగ్గా తీసుకోవడానికి లేదని అన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఇలాంటి మాటలు మాట్లాడడం సరికాదని, ఛైర్మన్‌పై ఆరోపణలను అనుమతించే ప్రసక్తే లేదని అన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదైన మూడేళ్లలో న్యాయం

సుప్రీం స్థాయిలో పరిష్కారం.. నేరాలకు అడ్డుకట్ట.. విపక్షాలది అనవసర రాద్ధాంతం.. చర్చలకు సిద్ధం

» కొత్త చట్టాల కింద గ్వాలియర్‌లో తొలి కేసు

» మీడియాతో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

న్యూఢిల్లీ, జూలై 1: కొత్త నేర న్యాయ చట్టాల కింద.. సుప్రీం కోర్టు స్థాయిలో ఎఫ్ఐఆర్ నమోదైన మూడేళ్లలో అన్ని కేసుల్లో న్యాయం లభిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 90% కేసుల్లో దోషులు ఎవరో తేలి.. శిక్షలు పడతాయని, భవిష్యత్తులో దారుణాలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సుదీర్ఘ నిరీక్షణలకు అవకాశం లేకుండా, న్యాయ ప్రక్రియకు కాల పరిమితిని నిర్దేశించామన్నారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మూడు నుంచి నాలుగేళ్లలో పూర్తి సాంకేతికతతో ప్రపంచంలో మనదే అత్యాధునిక నేర న్యాయ వ్యవస్థ అవుతుందని తెలిపారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన పది నిమిషాలకు.. ఆదివారం అర్ధరాత్రి 12.10కు మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో ద్విచక్ర వాహన చోరీపై తొలి కేసు నమోదైనట్లు అమిత్ షా చెప్పారు. ఢిల్లీలోని వీధి వ్యాపారిపై మొదటి కేసు నమోదైనట్లు వచ్చిన వార్తలను పోలీసులు ఖండించారని తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాల్లో శిక్షకు ప్రాధాన్యం ఉందని, తాము మాత్రం న్యాయానికి పెద్దపీట వేశామని, జీరో ఎఫ్ఐఆర్, ఈ-ఎఫ్ఐఆర్, ఎలక్ట్రానిక్, డిజిటల్ సాక్ష్యాల ద్వారా ఫిర్యాదు నమోదును సులభతరం చేశామని వివరించారు. "మహిళలు, పిల్లలపై నేరాలకు సంబంధించిన అధ్యాయాన్ని చేర్చడం, ఏడు రోజుల్లో విచారణ నివేదికను ఫైల్ చేయాలనే నిబంధన ద్వారా కొత్త చట్టాలను మరింత సమర్థంగా తీసుకొచ్చాం. వ్యవస్థీకృత నేరాలు, ఉగ్రవాద చర్యలు, మూక దాడులకు నిర్వచనం ఇచ్చాం. మూక దాడుల నిరోధానికి ప్రత్యేక నిబంధన తీసుకొచ్చాం. లైంగిక దాడుల ఉదంతాల్లో బాధితులరాలి ఇంటి వద్దనే, సంరక్షకుల సమక్షంలో మహిళా పోలీసు ద్వారా వాంగ్మూలం నమోదుకు అవకాశం ఉంటుంది" అని అమిత్ షా తెలిపారు. కొత్త చట్టాల్లో పోలీసులకు మరిన్ని అధికారాలను ఇవ్వలేదని స్పష్టం చేశారు. రిమాండ్ వ్యవధి 15 రోజులు మాత్రమే ఉంటుందన్నారు. కాగా, కొత్త క్రిమినల్ చట్టాలపై సందేహాలు ఉంటే నివృత్తి చేయడానికి పోలీసు పరిశోధన, అభివృద్ధి సంస్థ కంట్రోల్ రూంను నెలకొల్పింది. న్యూఢిల్లీలోని బీపీఆర్‌డీ ప్రధాన కార్యాలయంలో ఇది ఏర్పాటైంది.



ఏ చట్టాలపైనా ఇంతగా చర్చ జరగలేదు..

తమను పార్లమెంటు నుంచి బహిష్కరించి, ఎలాంటి చర్చ లేకుండా కొత్త నేర చట్టాలను తీసుకొచ్చారన్న విపక్షాల ఆరోపణలను అమిత్ షా కొట్టిపారేశారు. చరిత్రలో ఏ చట్టాలపైనా జరగనంత చర్చ వీటిపై సాగిందన్నారు. లోక్‌సభలో 9 గంటలు, రాజ్యసభలో 6 గంటలు చర్చించారని, 118 సార్లు తాను స్వయంగా పాల్గొన్నట్లు చెప్పుకొచ్చారు. 30 గంటలకు పైగా సంప్రదింపులు జరిగాయన్నారు. విపక్షాలది అనవసర రాద్ధాంతమని, ఇంకా అనుమానాలున్న నాయకులతో సమావేశానికి సిద్ధమని ప్రకటించారు. అభిప్రాయాలు చెప్పాలని ఎంపీలకూ లేఖ రాసిన సంగతి గుర్తుచేశారు.

మేధాపాట్కర్‌కు 5 నెలల జైలు

» పరువునష్టం కేసులో ఢిల్లీ కోర్టు తీర్పు



న్యూఢిల్లీ, జూలై 1: నర్మదా బచావో ఆందోళన ఉద్యమకారిణి, సామాజిక కార్యకర్త మేధాపాట్కర్‌కు ఢిల్లీలోని ఓ కోర్టు 5 నెలల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న వీకే సక్సేనా 24 సంవత్సరాల క్రితం ఆమెపై దాఖలు చేసిన పరువునష్టం కేసులో కోర్టు సోమవారం ఈ తీర్పు ఇచ్చింది. దీంతోపాటు సక్సేనాకు జరిగిన పరువు నష్టానికిగాను 10 లక్షల రూపాయలను ఆమె చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మెట్రోపాటన్ కోర్టు మేజిస్ట్రేట్ రాఘవ్ శర్మ ఈ ఏడాది మే నెలలోనే ఈ కేసులో మేధాపాట్కర్‌ను దోషిగా తేల్చారు. సక్సేనాపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఆయనకు పరువు నష్టం కలిగించడమే కాకుండా, ఆయనపై ప్రతికూల భావనలు రేకెత్తించేలా ఉన్నాయని కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం మేధాపాట్కర్ వయసు 69 సంవత్సరాలు. ఆమె వయసు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆమెకు కఠిన కారాగార శిక్ష విధించడం లేదని, కేవలం సాధారణ జైలుశిక్ష విధిస్తున్నామని మేజిస్ట్రేట్ తెలిపారు. కాగా, బెయిల్ కోసం మేధాపాట్కర్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగే వరకు ఆమెకు ఉపశమనం కలిగించేందుకు శిక్షను ఈనెల 30వ తేదీ వరకు నిలిపివేశారు.

ప్రధాని మోదీ కూడా అంతరిక్షంలోకి వెళ్లొచ్చు..

» గగన్‌యాన్‌పై ఇంటర్వ్యూలో ఇస్రో చైర్మన్



న్యూఢిల్లీ, జూలై 1: భారత్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మానవ మిషన్ 'గగన్‌యాన్' కార్యరూపం దాలిస్తే ప్రధాని మోదీ కూడా అంతరిక్షంలోకి వెళ్లవచ్చని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ అన్నారు. గగన్‌యాన్ మిషన్‌పై ఆయన ఓ జాతీయ చానెల్‌కు సోమవారం ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా 'ప్రధాని మోదీ అంతరిక్షంలోకి వెళ్లే అవకాశం ఉందా..?' అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. ఆ శక్తిసామర్థ్యాలను సాధిస్తే అది మనందరికీ ఎంతో గర్వకారణమేనని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యపడదని, దానికి ఎంతో శిక్షణ అవసరమని చెప్పారు. "ప్రధాని మోదీకి కచ్చితంగా ఎన్నో కీలక బాధ్యతలు ఉంటాయి. ప్రముఖులను అంతరిక్షంలోకి పంపించడం ప్రస్తుత దశలో సాధ్యపడదు. ఎందుకంటే ఎంతో నైపుణ్యం అవసరమైన ఈ కార్యక్రమంలో భాగం కావాలంటే నెలల తరబడి శిక్షణ పొందాల్సి ఉంటుంది" సోమనాథ్ పేర్కొన్నారు. గగన్‌యాన్ మిషన్‌లో భాగంగా ముగ్గురు వ్యోమగాములను 400 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి పంపి వారిని తిరిగి సురక్షితంగా భూమిపైకి తీసుకురావాలని ఇస్రో భావిస్తోంది. కాగా, ఈ ఏడాది ఆగస్టులో ఫాల్కన్-9 రాకెట్ ద్వారా జీశాట్-20 ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తున్నామని సోమనాథ్ చెప్పారు.

జన్యుసవరణ ప్రక్రియకు మనోళ్ల మెరుగు

హైదరాబాద్ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాస్9.. జన్యుసవరణ ప్రక్రియలో వాడే అత్యంత కీలకమైన ప్రొటీన్ ఇది! ఇప్పటిదాకా శాస్త్రజ్ఞులు దీన్ని 'స్ట్రెప్టోకోకస్ ప్యోజీన్స్' అనే బ్యాక్టీరియా నుంచే తీసుకుంటున్నారు. అలా కాకుండా.. మనదేశానికి చెందిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జీనోమిక్స్ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ (సీఎస్ఐఆర్-ఐజీఐబీ) శాస్త్రజ్ఞులు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి (ఎల్వీపీఈఐ) వైద్యులు కలిసి 'ఫ్రాన్సిసెల్లా నోవిసిడా' అనే బ్యాక్టీరియమ్ నుంచి సేకరించారు. జన్యువ్యాధుల నిర్ధారణలో, వాటికి సమర్థంగా చికిత్స చేయడంలో ఈ కొత్త ప్రొటీన్ చాలా మెరుగ్గా పనిచేస్తుందని ఎల్వీపీఐఈ వైద్యులు వివరించారు. రకరకాల జన్యువ్యాధుల చికిత్సలో కీలకపాత్ర పోషిస్తుందని వెల్లడించారు. చిన్నవయసు నుంచే కంటిచూపును తగ్గించే 'లేబర్స్ కంజెనిటల్ అమరోసిస్ టైప్ 2(ఎల్‌సీఏ-2)' అనే జన్యుసమస్యతో బాధపడే చిన్నారికి ఈ కొత్త విధానం ద్వారా చికిత్స అందించిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు.. అతడి కంటిచూపును సమర్థంగా మెరుగుపరిచారు. కంటిలో సాధారణ ప్రొటీన్ ఉత్పత్తికి అంతరాయం కలిగించే ఒక జన్యు పరివర్తన వల్ల ఈ సమస్య వస్తుందని వారు వివరించారు. దీన్ని గుర్తించిన అనంతరం.. డాక్టర్ దేబోజ్యోతి చక్రవర్తి ఆధ్వర్యంలోని వైద్య బృందం.. కొత్త కాస్9 ప్రొటీన్ ద్వారా జన్యుసవరణ చేసి, ఆ బాలుడి దృష్టిలోపాన్ని సరిచేసినట్లు వెల్లడించారు. రోగి చర్మకణాల నుంచి సేకరించిన మూలకణాలను రీ ప్రోగ్రామ్ చేయడం ద్వారా అతడి సమస్యను పరిష్కరించి, దోష నివారణ చేసినట్లు చెప్పారు. వారి అధ్యయన ఫలితం నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది.

రాజకీయేతర అంశాలతో 'ప్రత్యేక హోదా'!

ఆర్థిక సంఘానికి ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సభ్యురాలు ఆషిమా గోయల్ సూచన



న్యూఢిల్లీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): బిహార్, ఏపీ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కల్పించే అంశాన్ని రాజకీయేతర అంశాల ఆధారంగానే నిర్ణయించాలని ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సభ్యురాలు ఆషిమా గోయల్ సూచించారు. తక్కువ జనసాంద్రత ఉన్న కొండ ప్రాంతాలు, బలహీనమైన సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి అంశాల ఆధారంగా ప్రత్యేక హోదా ప్రమాణాలు నిర్ణయించబడ్డాయని ఆమె తెలిపారు. ఏపీ, బిహార్‌కు ఈ ప్రమాణాలు వర్తించవని ఆషిమా సోమవారం పీటీఐ వార్త సంస్థకు తెలిపారు. ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాల్లో కేంద్ర ప్రాయోజిత పథకానికి అవసరమైన నిధుల్లో 90%, సాధారణ కేటగిరి రాష్ట్రాలకు 60 శాతం కేంద్రం సమకూరుస్తుందని, మిగిలిన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ఆమె అన్నారు. 14వ ఆర్థిక సంఘం ఇక నుంచి రాష్ట్రాలకు కొత్తగా ప్రత్యేకహోదా ఇవ్వకూడదని స్పష్టం చేసిందని తెలిపారు

తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

న్యూఢిల్లీ, జూలై 1: వ్యాపారులు, వాణిజ్య సంస్థలకు ఊరటనిస్తూ చమురు గ్యాస్ కంపెనీలు వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాయి. దేశవ్యాప్తంగా 19 కేజీల సిలిండర్ ధరను సరాసరిన రూ. 30 మేర తగ్గిస్తూ సోమవారం నిర్ణయం తీసుకున్నాయి. తగ్గిన ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నాయి. సవరించిన రేట్లతో ఢిల్లీలో రూ.1646, ముంబైలో రూ.1598, చెన్నైలో రూ.1756, కోల్‌కతాలో రూ.1787 మేర వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు ఉన్నాయి. రెండు నెలలుగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. జూన్ 1న రూ. 69 మేర తగ్గగా, మే 1న రూ. 19 మేర



ప్రజల వద్దే 7,581 కోట్ల విలువైన రూ. 2 వేల నోట్లు

ముంబై, జూలై 1: రద్దయిన రూ.2 వేల నోట్లలో దాదాపు 97.87% బ్యాంకులకు చేరగా.. ఇంకా రూ.7,581 కోట్ల విలువైన నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని ఆర్బీఐ సోమవారం తెలిపింది. 2023 మే 19న చలామణిలో నుంచి 2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటికీ రూ.3.56 లక్షల కోట్ల విలువైన 2 వేల నోట్లు వాడుకలో ఉండగా.. ఈ ఏడాది జూన్ 28 నాటికి అందులో రూ.7,581 కోట్లు తగ్గిందని తాజాగా పేర్కొంది. గతేడాది అక్టోబరు 7వ తేదీ వరకు 2 వేల నోట్లను అన్ని బ్యాంకుల్లో మార్చుకునేందుకు అవకాశం కల్పించారు. అదే నెల 9 తర్వాత కూడా ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో 2 వేల నోట్లను మార్చుకొనే వెసులుబాటు ఇచ్చారు.

మంత్రి నిమ్మల వినయం

వృద్ధుల కాళ్లు కడిగి పింఛన్ అందజేత

యలమంచిలి, జూలై 1: ఏపీ జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు... వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి పళ్లెంలో వాళ్ల కాళ్లు కడిగి మరీ పెంచిన పింఛన్ సొమ్మును అందజేశారు. వాళ్లు వద్దని వారిస్తున్నా.. 'ఏం ఫర్వాలేదమ్మా.. నేను మీ మనవడిలాంటి వాడిని' అంటూ వృద్ధుల కాళ్లు కడిగారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా అడవిపాలెం, కొంతేరు, కాజ గ్రామాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉదయం 6 గంటలకే ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారులకు పెంచిన పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ.. దివ్యాంగులు, వృద్ధులకు ఎంతచేసినా రుణం తీర్చుకోలేమన్నారు. చెప్పిన మాట ప్రకారం విడతల వారీగా కాకుండా ఒకేసారి పెన్షన్ పెంచుతూ సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మానవత్వం చాటుకున్నారన్నారు. కోటి విలువ చేసే రెండు ఎకరాల సాగులో శ్రమించి, ప్రకృతి కరుణిస్తే ఏడాదికి 40 వేలు ఆదాయం మాత్రమే వస్తుందని, తమ ప్రభుత్వంలో వృద్ధులు, వితంతువులకు ఏడాదికి రూ.48 వేలు పెన్షన్‌గా ఇస్తున్నారని అన్నారు. చంద్రబాబు ద్వారా రెండు ఎకరాల ఆస్తి అందుకున్నట్లేనని వ్యాఖ్యానించారు. తొలుత ఆయా గ్రామాలకు చేరుకున్న మంత్రికి మహిళలు హారతులు పట్టారు.



అడవిపాలెంలో వృద్ధురాలి కాళ్లు కడుగుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

అమాత్యుడి సతీమణి అతి

- తన కాన్వాయ్‌లో రాలేదని ఎస్‌ఐపై ఆగ్రహం
- నడిరోడ్డుపై జనం చూస్తుండగానే ఓవరాక్షన్
- పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఏపీ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భార్య అనుచిత తీరు



ఎస్‌ఐపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భార్య హరిత

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆమె.. మంత్రి లేదా చట్టసభ సభ్యురాలు కాదు. కనీసం ప్రజాప్రతినిధి కూడా కాదు. జరుగుతున్నది ప్రభుత్వ కార్యక్రమం. మంత్రి భార్యగా ఓ ప్రైవేటు వ్యక్తిగా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారంతే. ఆమె వస్తున్నారని పోలీసులు ఎలాంటి ప్రొటోకాల్ పాటించాల్సిన అవసరం లేదు. అయినాసరే తమ కాన్వాయ్‌లో ఎస్‌ఐ రాలేదంటూ అమాత్యుడి సతీమణి అతి చేశారు. నడిరోడ్డు మీద స్థానిక ప్రజలు చూస్తుండగానే ఎస్‌ఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి భార్య హరిత వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వైసీపీ నేతలకు, వీళ్లకు తేడా ఏంటని ప్రజలు విమర్శిస్తున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లెలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి రాంప్రసాద్‌రెడ్డి భార్య హరిత హాజరయ్యారు. ఆ సమయంలో అక్కడ సీఐతో పాటు ముగ్గురు సిబ్బంది విధుల్లో ఉన్నారు. తమ కాన్వాయ్‌లో చిన్నమండెం ఎస్‌ఐ రమేశ్‌బాబు రాకపోవడంతో అతని గురించి ఆరాతీశారు. ఆపై మండిపడ్డారు. దీంతో సీఐ ఫోన్ చేసి ఎస్‌ఐను అక్కడికి రప్పించారు. ఆయన సాధారణ దుస్తుల్లో రావడంతో యూనిఫాం వేసుకుని రావాలని సీఐ సూచించినట్లు తెలుస్తోంది. దీంతో సమీపంలో వాహనంలో ఉన్న యూనిఫాం వేసుకుని ఎస్‌ఐ మళ్లీ వచ్చారు. ఈ సందర్భంగా ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

చెడ్డపేరు తెస్తే ఉపేక్షించం

మంత్రి సతీమణి తీరుపై చంద్రబాబు అసంతృప్తి

రాంప్రసాద్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన సీఎం

రవాణా శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి సతీమణి పోలీసులతో వ్యవహరించిన తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రి సతీమణి హరిత స్థానిక ఎస్‌ఐతో మాట్లాడిన తీరును ఆయన తప్పుబట్టారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడి వివరణ కోరారు. 'అధికారులు, ఉద్యోగుల పట్ల అంతా గౌరవంగా మసలుకోవాలి. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఏ స్థాయి వారు వ్యవహరించినా ఉపేక్షించేది లేదు. ఇలాంటి వైఖరిని సహించేది లేదు' అని ఆయన మంత్రికి స్పష్టం చేశారు. జరిగిన సంఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకొంటానని ముఖ్యమంత్రికి చెప్పారు.

ఆలయాలు వాణిజ్య సంస్థలు కాదు

- ఉజ్జయిని మహంకాళి గుడి నిర్వాహకులపై హైకోర్టు ఆక్షేపణ

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలను వాణిజ్య దృక్కోణంలో నిర్వహించదరాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. కొన్ని ఆలయాల నిర్వాహకులు, అధికారులు ఖర్చుల పేరు చెప్పి ఆదాయమే పరమావధి అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారని తీవ్రంగా తప్పుబట్టింది. ఆలయాల నిర్వహణ ప్రభుత్వాల బాధ్యత అని, కానీ వ్యయాలను రాబట్టుకోవాలనే పేరుతో వాటిని వాణిజ్య సంస్థల్లా తయారు చేస్తున్నారని ఆక్షేపించింది. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయ నిర్వాహకుల పనితనం చూసిన తర్వాత ఆలయాలు వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయా? అన్న అనుమానం కలుగుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ ఆలయానికి చీరెలు, జాకెట్లు, కొబ్బరికాయలు సేకరించేందుకు ఎస్. నవీన్‌కుమార్ అనే వ్యక్తికి టెండర్ ఉంది. కొవిడ్‌వల్ల నష్టపోయిన కాలానికిగాను అందరు కాంట్రాక్టర్లకు 292 రోజుల పాటు లీజు గడువు పొడిగించాలని దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి 2021లో నోటిఫికేషన్ జారీచేశారు. అయితే దీనిని పట్టించుకోకుండా మహంకాళి ఆలయ ఈవో కొత్త టెండర్‌కు నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో లీజు గడువు పొడిగించాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది.

చిత్కుల్ చెరువులో చేపల మృతిపై నోటీసులు

పటాన్‌చెరువు పరిధిలోని చిత్కుల్ చెరువులో టన్నుల కొద్దీ చేపలు చనిపోవడంపై పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు నోటీసులు జారీచేస్తూ విచారణను ఈనెల 16కు వాయిదా వేసింది. మరోవైపు జంతులపై క్రూరత్వ నిరోధక చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయడంలేదని అందిన లేఖను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

హైకోర్టు సీనియర్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా చిరంజీవి

హైకోర్టు సీనియర్ అధికారుల సంఘం అధ్యక్షుడిగా 2024-26 కాలానికిగాను బీఎస్ చిరంజీవి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కే శైలేషీ, కార్యదర్శిగా ఎన్ రాజ్‌గోపాల్, సంయుక్త కార్యదర్శిగా ఆర్ కార్తికేయన్, కోశాధికారిగా వీ హరిప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా టీ శ్రీనివాస్, టీ కృష్ణకుమార్, వోస్సిం, చంద్రశేఖర్‌రావు, టీ తిరుమలదేవి, పీ పద్మనాభరెడ్డి, వీ కవిత, నాగభూషం తదితరులు ఎన్నికయ్యారు.

ఆహా.. ఒకటో తారీఖు

(మొదటి పేజీ తరువాయి)

అందుకోగా.. పెన్షనర్లలో 50% మందికి పింఛన్లు అందాయి. కొన్నిజిల్లాల్లో దాదాపు 100 శాతం జీతాలు జమ కాగా.. మరికొన్ని జిల్లాల్లో బ్యాంకుల్లో ప్రాసెసింగ్‌లో ఉన్నాయి. వారందరికీ మంగళవారం నాటికి జీతాలు, పెన్షన్లు పూర్తిస్థాయిలో అందుతాయని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే.. సామాజిక పింఛన్లు కూడా 61 లక్షల (94.75 శాతం) మందికి అందాయి. సోమవారం తెలతెలవారుతుండగానే.. సచివాలయ సిబ్బంది తలుపుతట్టి మరీ వారికి పింఛన్లు అందించారు. మూడు నెలల బకాయి రూ.3 వేలు.. ఈ నెల పింఛను రూ.4 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు ఇచ్చారు. ఇక.. ఈ ఒక్క నెలలోనే పేదలకు పెన్షన్ల కింద ఇస్తున్నది రూ.4,408 కోట్లని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. సామాజిక పింఛన్ల లబ్ధిదారులకు ఇకపై ఏడాదికి రూ.33,100 కోట్లు ఖర్చు చేయబోతున్నామని ప్రకటించారు. సోమవారం ఉదయం మంగళగిరి నియోజకవర్గం పెనుమాక ఎస్టీ కాలనీలో ఆయన స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. పిఠాపురంలో జరిగిన పింఛన్ల పంపిణీ ప్రక్రియలో పాల్గొన్నారు. కాగా.. ఏపీలో గత ఐదేళ్లు అధికారంలో ఉన్న జగన్ సర్కారు ఈ స్థాయిలో ఒకటో తేదీనే జీతాలు ఇవ్వలేదు! జీతాలు, పెన్షన్లు పూర్తిస్థాయిలో పడాలంటే నెలలో మూడోవారం వచ్చేది. ఈఎంఐలు, బిల్లులు చెల్లించాల్సిన ఉద్యోగులు అప్పులు తెచ్చి తిప్పలు పడేవారు. పెన్షనర్లు కూడా ఆస్పత్రి ఖర్చులు, మందులు, ఇతర ఖర్చులకు సకాలంలో డబ్బులందక ఇబ్బందులు పడ్డారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి నెలలోనే ఉద్యోగులకు జీతాలు దాదాపు పూర్తిస్థాయిలో, పెన్షన్లు సగానికి పైగా అందడంతో వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



పెన్షన్ అందజేసేందుకు రాములు నాయక్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న చంద్రబాబు

పరదాలు కడితే షాక్ ట్రీట్‌మెంటే

అధికారులకు చంద్రబాబు హెచ్చరిక

ప్రజావేదిక కార్యక్రమంలో చంద్రబాబు, లోకేశ్ నడుమ సరదా సంభాషణ సాగింది. అధికారులు కుదురుకునేందుకు ఇంకా టైమ్ పడుతుందనుకుంటా సర్.. ఇంకా పరదాలు కడుతున్నారని లోకేశ్ అనగానే.. లేదు సెట్ అయ్యారని సీఎం బదులిచ్చారు. కొంత మంది ఇంకా పరదాలు కట్టడం మానుకోలేదని.. బతిమిలాడి తీయిస్తున్నామని లోకేశ్ చెప్పారు. అలాంటివి పునరావృతమైతే పరదాలు కట్టిన వారిని సస్పెండ్ చేయడం తప్ప వేరే మార్గం ఉండదని చంద్రబాబు హెచ్చరించారు. పరదాలు కట్టాలన్న ఆలోచన వస్తే షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. అధికారులు పాతరోజులు మరచిపోయి కొత్త పాలనకు అందరూ అలవాటుపడాలని.. చెప్పిన ప్రకారం నడచుకోకపోతే మళ్లీ 1995 నాటి సీఎంను చూస్తారని స్పష్టం చేశారు.

నిరుపేద ఇంటికి అనుకోని అతిథి!

మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గం పెనుమాక ఎస్టీ కాలనీలో అదో గుర్రపు పాక వంటి పూరి గుడిసె. దాని యజమాని బాణావత్ పాములు అలియాస్ రాములు నాయక్. సోమవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో సీఎం చంద్రబాబు ఆ గుడిసెకు వచ్చారు. ఓ సీఎం అనుకోని అతిథిగా రావడంతో నాయక్ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేవు. నాయక్, భార్య సీత, కుమార్తె ఇస్లావత్ సాయి ఆయనకు పాదాభివందనం చేశారు. చంద్రబాబు గుడిసె లోపలికి వెళ్లి ఓ కుక్కి మంచంలో కూర్చున్నారు. తనకో వైపు సాయి, ఇంకోవైపు ఆమె కుమారుడు కల్యాణ్‌ను కూర్చోబెట్టుకున్నారు. మరో మంచంలో నాయక్, సీత, ఇంకో మనవడు పవన్ కూర్చున్నారు. చంద్రబాబు వారిని పరిచయం చేసుకుంటూ సచివాలయ ఉద్యోగితో పింఛన్ పంపిణీకి వారి నుంచి వేలిముద్రలను తీయించారు. నాయక్‌కు వృద్ధాప్య పెన్షన్ కింద రూ.7వేలు, సీతకు వ్యవసాయ కూలీపెన్షన్ రూ.5వేలు, వారి కుమార్తె ఇస్లావత్ సాయికి వితంతు పెన్షన్ కింద రూ.4 వేలను స్వయంగా అందజేశారు. అనంతరం నాయక్ భార్య స్టీలు గ్లాసులో టీ ఇవ్వగా ఆయన తాగారు. ఇల్లు కట్టించి సాయం చేయాలని నాయక్ కోరగా.. సీఎం తక్షణమే స్పందించారు. ప్రధాని ఆవాస్ యోజన పథకం కింద రూ.లక్షా 80 వేలు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఇంటి నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

మా దేవుడు మీరే మాస్టారూ!

- బదిలీపై వెళ్తున్న టీచర్లను వెళ్లొద్దని బతిమాలిన విద్యార్థులు

చేర్యాల, జూలై 1 : "సార్.. మీరు ఎక్కడికీ వెళ్లొద్దు. మాతోనే ఉండాలి. మమ్మల్ని మీ సొంత పిల్లల్లా చూసుకుంటూ పాఠాలు చెప్పారు. చదువు విలువ నేర్పించారు. మీరే మాకు పాఠాలు చెప్పాలి. మీరు లేని బడికి ఇక మేమూ రాబోము" అంటూ విద్యార్థులు కన్నీరుమున్నీరుగా విలపించిన ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎంపీపీఎస్)లో జరిగింది. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సందిటి సులోచన, ఉపాధ్యాయులు రాజయ్య, బుచ్చయ్య, ఇంద్రసేనారెడ్డి, భాస్కర్, కామిడి రత్నమాల తదితరులు ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో భాగంగా ఇతర పాఠశాలలకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించగా విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా తరలివచ్చారు. ఇక నుంచి తమ అభిమాన ఉపాధ్యాయులు పాఠశాలకు రారన్న విషయాన్ని గ్రహించిన విద్యార్థులంతా వారిని పట్టుకొని బోరున విలపించారు. "మీరు వెళ్లొద్దు సార్" అంటూ బతిమిలాడారు. చిన్నారుల రోదనలకు చలించిన ఉపాధ్యాయులు కన్నీటి భాష్పాలు రాల్చారు. దాంతో ఎనిమిదేళ్లుగా పెనవేసుకున్న గురుశిష్యుల అనుబంధం అక్కడ వెల్లివిరిసింది. అనంతరం... వృత్తిగత జీవితంలో బదిలీలు తప్పవని, తాము అందుబాటులోనే ఉంటామని, ఎప్పుడు అవసరపడినా పాఠాలు చెబుతామని పిల్లలకు ధైర్యం చెప్పారు. ఏపీఎస్ చైర్మన్ తోట్ల రాజేశ్వరి తదితరులు ఉపాధ్యాయులను సత్కరించారు.

గాంధీ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

- దీక్ష చేస్తున్న మోతీలాల్‌కు మద్దతుగా విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష నేతల రాక
- బీఆర్‌ఎస్ నేతలు పల్లా, రాకేశ్‌రెడ్డి అరెస్టు

అడ్డగుట్ట/తార్నాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి గాంధీ ఆస్పత్రిలో నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్న ఓయూ నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాల నేతల రాకతో సోమవారం ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. గ్రూప్-2 పోస్టులు పెంచాలని, మెగా డీఎస్సీ నిర్వహించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలనే డిమాండ్లతో దీక్ష చేస్తున్న మోతీలాల్‌కు మద్దతు పలికేందుకు భారీగా విద్యార్థి నేతలు తరలివచ్చారు. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. అదే సమయంలో బీఆర్‌ఎస్ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎనుగుల రాకేశ్‌రెడ్డి గాంధీకి రావడంతో మరింత గందరగోళం ఏర్పడింది. ఆస్పత్రిలోకి వెళ్లనివ్వాలంటూ పోలీసులతో పల్లా వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలోనే కొందరు విద్యార్థి నేతలు రోడ్డుపై బైఠాయించారు. దీంతో వారిపై పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేశారు. ఇటు పల్లాను అరెస్టు చేసి చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌కు, రాకేశ్‌రెడ్డిని బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరికొందరు విద్యార్థి నేతలతో పాటు బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారావుయాదవ్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్లకు తరలించారు.



గాంధీ ఆస్పత్రిలోకి దూసుకొస్తున్న విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

ఓయూలో ర్యాలీ.. అరెస్టులు

మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా నిరుద్యోగులు, విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన లైబ్రరీ నుంచి గాంధీ ఆస్పత్రి వరకు భారీ ర్యాలీ తలపెట్టగా.. పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఆర్ట్స్ కాలేజీ వద్ద ఓయూ పోలీసులు వారిని అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎమ్మెల్సీలుగా సి.రామచంద్రయ్య, హరిప్రసాద్

- పవన్ రాజకీయ కార్యదర్శికి అవకాశం
- నేడు నేతల నామినేషన్ల దాఖలు

అమరావతి, జులై 1(ఆంధ్రజ్యోతి): ఏపీ శాసన మండలిలో ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు టీడీపీ కూటమి తమ అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్యకు, జనసేన నుంచి పిడుగు హరి ప్రసాద్‌కు అవకాశం కల్పించారు. హరిప్రసాద్ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు రాజకీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ నుంచి ఎమ్మెల్సీలుగా గెలుపొందిన సి.రామచంద్రయ్య, మహ్మద్ ఇక్బాల్ టీడీపీలో చేరడంతో ఈ రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. వీరిలో రామచంద్రయ్యపై అనర్హత వేటు పడటంతో ఖాళీ ఏర్పడింది. ఇక్బాల్ తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి టీడీపీలోకి వచ్చారు. ఎమ్మెల్యే కోటా స్థానాలు కావడంతో ఈ రెండు సీట్లు కూటమి గెలుచుకోవడం ఖాయమే. ఇందులో ఒకటి జనసేనకు ఇవ్వడంతో ఇక్బాల్‌కు అవకాశం దక్కలేదు. ఆయనకు భవిష్యత్తులో మరో అవకాశం ఇస్తారని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఈ ఇద్దరు అభ్యర్థులు మంగళవారం ఆఖరి రోజు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. రామచంద్రయ్య గతంలో మంత్రిగా, ఎంపీగా పనిచేశారు. ఆయన స్వస్థలం కడప జిల్లా మైదుకూరు. ఏలూరుకు చెందిన హరిప్రసాద్ లా చదివి పాతికేళ్ల పాటు మీడియా రంగంలో పనిచేశారు. జనసేన పార్టీ మీడియా విభాగం అధిపతిగా, పార్టీ అధ్యక్షునికి రాజకీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించాలి

- వామపక్ష పార్టీల డిమాండ్
- జూలై 5న నిరసనలకు పిలుపు

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బొగ్గు గనుల వేలంపాటను రద్దు చేయాలని, బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. తెలంగాణ రాష్ట్ర వామపక్ష పార్టీల సమావేశం సోమవారం హైదరాబాద్ ఎంబీ భవన్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశాన్ని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు రమ అధ్యక్షతన నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య డీజీ నరసింహారావు, సీపీఐ నుంచి ఈటీ నరసింహ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలంపాటలకు నిరసనగా జూలై 5న అన్ని జిల్లాల కలెక్టరేట్లు, హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అద్భుత ఛాంపియన్లు

టీమిండియా మరో సువర్ణాధ్యాయానికి తెరతీసింది. కదనరంగంలో కసిగా పోరాడితే అందలం ఎలా దక్కుతుందో నిరూపించింది. నాటి కపిల్ డెవిల్స్, ధోనీ సేన సాధించిన విజయాలను మరిపిస్తూ ప్రపంచ కప్పును ఒడిసిపట్టుకుంది. తుది పోరులో దక్షిణాఫ్రికాను ఓడించి రెండో పర్యాయం టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈ చారిత్రక సందర్భమే టీ20 ఆటనుంచి కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాలకు ఘన వీడ్కోలును కూడా ఇచ్చింది.

ఆటలో గెలుపోటములు సహజం. సరిగ్గా ఏడునెలల క్రితం మన దేశంలోనే జరిగిన వన్డే ప్రపంచకప్‌లో భారత్ రన్నరప్‌గా నిలిచింది. అజేయమైన ఆటతీరుతో ఫైనల్ చేరి, కప్పుపై ఎన్నో కలలు పెట్టుకున్న రోహిత్‌సేన ఆ టోర్నీ తుదిపోరులో ఓడడం కోట్లాది భారతీయుల హృదయాలను కలచివేసింది. ఆస్ట్రేలియా చేతిలో పరాజయం మన ఆటగాళ్లను ఎంతో మనోవేదనకు గురిచేసింది. ఇది వారిలో మరింత కసిని పెంచింది. అవసరాలకనుగుణంగా వ్యూహాల్లో మార్పులు చేసుకొని ముందుకు సాగేలా చేసింది. గోడకు కొట్టిన బంతిలా ఎగసి, ఆ తరువాత ఏడు నెలల్లోనే జరిగిన ఈ పొట్టికప్పు విశ్వసమరంలో జట్టు అద్భుత ప్రదర్శన కనబరచింది. తమకు ఎదురే లేదనుకున్న ఆస్ట్రేలియన్లను, డిఫెండింగ్ ఛాంపియన్ ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. ఓటమన్నదే లేకుండా వరుస విజయాలతో ఫైనల్‌కు దూసుకొచ్చినా, ఏమరుపాటుకు అవకాశమివ్వలేదు. కలిసికట్టుగా కదం తొక్కి రెండో టైటిల్‌తో క్రికెట్‌లో నవచరిత్రను ఆవిష్కృతం చేసింది. సమర్థమైన నాయకుడిగా ముందుండి నడిపించిన రోహిత్ శర్మ జట్టు విజయంలో ఆటగాడిగానూ కీలకపాత్ర పోషించాడు. కొన్ని మ్యాచుల్లో భారీస్థాయిలో పరుగులు రాబట్టి గెలుపు బాట వేశాడు. ఈ విజయంతో భారత్‌కు ఐసీసీ ట్రోఫీలు అందించిన దిగ్గజాలు కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీ సరసన నిలిచిన రోహిత్, తన పదిహేడేళ్ల టీ20 కెరీర్‌ను అద్వితీయంగా ముగించాడు. ప్రపంచ క్రికెట్‌లో కింగ్‌గా నీరాజనాలందుకుంటున్న విరాట్ కోహ్లీ ఈ టోర్నీలో వరుస మ్యాచుల్లో విఫలమైనా, ఆఖరి ఆటలో అత్యుత్తమంగా రాణించాడు. ఫైనల్‌కు ముందు ఏడు మ్యాచుల్లో 75 పరుగులే చేసిన కోహ్లీ అసలైన సమరంలో 76 పరుగులు సాధించి తన విలువేంటో చాటిచెప్పాడు. తన చివరి పోరులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకొని తన 14 ఏళ్ల టీ20 కెరీర్‌కు సగర్వంగా ముగింపు పలికాడు. ఘోర రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలతో బయటపడిన రిషభ్ పంత్, ఈ టోర్నమెంట్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. మునుపటి స్థాయిలో బ్యాటింగ్‌లో, కీపింగ్‌లో నైపుణ్యాన్ని చాటుకొన్నాడు. మన బౌలర్లను ప్రతిభ గురించి ఎంత చెప్పినా తక్కువే. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా ముందుండి బౌలింగ్‌ను నడిపించాడు. అవసరమనుకున్న ప్రతిసారీ వికెట్ పడగొట్టి ప్రస్తుత తరంలో ప్రపంచంలోనే అత్యుత్తమ పేసర్‌గా తన పేరును సార్థకం చేసుకున్నాడు. యువ పేసర్ అర్షదీప్ సింగ్ 17 వికెట్లతో టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్ల వీరునిగా నిలిచాడు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ బంతితో మాయాజాలం చేశాడు. పేలవమైన ఫామ్‌తో ప్రపంచకప్‌నకు ముందు అనేక విమర్శలు ఎదుర్కొన్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తన ఆటతోనే సమాధానమిచ్చాడు. హార్దిక్‌కు దీటుగా అక్షర్ పటేల్ బంతి, బ్యాటుతో విజృంభించిన తీరు ప్రశంసనీయం. ఇలా.. ప్రతి ఆటగాడు బాధ్యతాయుతంగా ఆడి జట్టును విశ్వవిజేతగా నిలిపారు. పదిహేడేళ్ల క్రితం వెస్టిండీస్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో రాహుల్ ద్రవిడ్ కెప్టెన్సీలో భారత జట్టు తొలిరౌండ్లోనే వెనుదిరగడంతో నాడు అతను తలదించుకున్న పరిస్థితి. కానీ, ఇప్పుడు అదే విండీస్ గడ్డపై గురువు స్థానంలో జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టి తలెత్తుకున్న తీరు సర్వదా ప్రశంసనీయం. మూడేళ్లు జట్టు వెంటే ఉండి మార్గదర్శనం చేసిన తనకు ఇప్పుడు శిష్యులు ప్రపంచకప్‌ను అందించారు. ఎన్నడూ తన భావాలను బయటకు కనిపించనీయని ద్రవిడ్ కూడా చిన్నపిల్లాడిలా గంతులేస్తూ జట్టుతో కలిసి సంబరాలు చేసుకున్నాడు. జట్టు చీఫ్‌కోచ్ హోదాలో ఆఖరిరోజును చిరస్మరణీయం చేసుకున్నాడు.

విజేత భారత్‌కే గాకుండా అఫ్ఘానిస్తాన్, అమెరికా జట్లకు ఈ ప్రపంచకప్ ప్రత్యేకంగా గుర్తుండిపోతుంది. ఆట ఆడటమే కష్టంగా ఉన్న తమ దేశంలో పాలకులను ఒప్పించి, ఎన్నో సవాళ్లను అధిగమించి, ఒక్కో మెట్టు ఎక్కుతూ విశ్వసమరంలో సెమీఫైనల్ దాకా చేరిన అఫ్ఘానిస్తాన్ ఆటగాళ్ల ప్రయాణం స్ఫూర్తిదాయకం. ఆతిథ్య జట్టు హోదాలో టోర్నీలో అడుగుపెట్టిన అమెరికా, అంచనాలకు మించిన ఆటతీరుతో సూపర్–8 దశకు చేరి పిట్టకొంచెం కూత ఘనం అన్న సామెతను గుర్తుచేసింది. అపజయమన్నదే లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా ప్రదర్శననూ తక్కువ చేయలేం. మెగా టోర్నీలో తొలిసారి ఫైనల్ చేరిన సఫారీ జట్టు కప్పుకోసం తుదికంటా పోరాడిన తీరు అమోఘం.

భారత్ సాధించిన ఈ అమోఘ విజయాన్ని ఆస్వాదిస్తూనే నవతరం ఆటగాళ్లు మున్ముందు ప్రతిష్ఠాత్మక సిరీస్‌లకు సన్నద్ధం కావాలి. రోహిత్, కోహ్లీ, జడేజాలాంటి గొప్ప ఆటగాళ్ల వారసత్వాన్ని కొనసాగిస్తూ ముందుకు సాగాలి.

మరోమారు చూస్తాం 'స్మార్ట్ పాలన'!

విభజనానంతర ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు రెండవ పర్యాయం బాధ్యతలు స్వీకరించిననాడు తనను కలిసిన అఖిలభారత సర్వీస్ అధికారులతో జరిపిన క్లుప్త సమావేశంలో గత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనపై సున్నితంగా స్పందిస్తూ, తనదైన శైలిలో విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పనిచేసిన కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో సహా పలువురు నిబద్ధతకలవారి సమర్థతను, నిజాయితీని దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వ పాలన సాగిందని ఆయన అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రోజులనాటి ఆయన 'స్మార్ట్ (SMART) పాలన' (సింపుల్, మోరల్, అకౌంటబుల్, రెస్పాన్సివ్, ట్రాన్స్‌పరెంట్) గురించి తెలిసిన కొందరికి మాత్రమే ఆయన సద్విమర్శలు సులభంగా అర్థం అవుతాయి.

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్) సంస్థలో తొమ్మిది సంవత్సరాలు ఫ్యాకల్టీ సభ్యుడిగా, అదనపు డైరెక్టర్‌గా పనిచేసిన నాకు, సరిగ్గా అదే తొమ్మిది సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడి 'స్మార్ట్ పాలన'ను, దాని పట్ల ఆయనకు ఉండే అసాధారణమైన ఆసక్తిని, విషయ సామర్థ్యాన్ని, నిబద్ధతను సమీపంగా పరిశీలించే అవకాశం కలిగింది. అప్పటి ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ (డీజీ) పీవీఆర్‌కే ప్రసాద్, అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) ఊర్మిళా సుబ్బారావు, తదితర అధికారుల తోడ్పాటుతో, తనదైన దార్శనికతతో, అనాథగా ఉన్న ఐఏఎ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్)ను మాజీముఖ్యమంత్రి చెన్నారెడ్డి మరణానంతరం డాక్టర్ ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌గా పేరుమార్చి, ప్రపంచ 'మానవ అభివృద్ధి, శిక్షణా కేంద్రాల'లో అగ్రస్థానంలో నిలిపిన ఘనత చంద్రబాబునాయుడుదే!

ప్రభుత్వ ఉద్యోగుల వ్యవస్థీకృత శిక్షణ, తద్వారా వారి పనితీరు, సామర్థ్యం పెంపుదలకు సంబంధించి జాతీయ శిక్షణా విధానం (నేషనల్ ట్రైనింగ్ పాలసీ—ఎన్‌టీపీ) మార్గదర్శకాలకు అనుగుణంగా చంద్రబాబు నాయుడు విలువైన సమయాన్ని కేటాయించారు. ఒకసారి, నేను ఏడీజీ (అప్పటికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేషనే అది) ఊర్మిళా సుబ్బారావు, 1996 సంవత్సరాంతంలో, ఇన్‌స్టిట్యూట్ సందర్శనకు వచ్చిన 'ఓడీఏ' (డీఎఫ్ఐడీ) ప్రతినిధివర్గంతో సీఎం చంద్రబాబునాయుడిని కలిసినప్పుడు ఆయన ముఖ్యమైన ఒక విషయాన్ని ప్రస్తావించారు. 'ఐఏఏ'ను సుపరిపాలన కేంద్రంగా, తత్సంబంధమైన జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ విధానాలను గుర్తించే సంస్థగా అభివృద్ధి చేయడానికి నిధులు సమకూర్చమని



akbar

> ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు చొరవతో రూపుదిద్దుకున్న ఓఎంఆర్ ఫార్మాట్ ఆధారిత 'శిక్షణ అవసరాల విశ్లేషణ' అనతికాలంలో, బృహత్తరమైన 'స్టేట్ ట్రైనింగ్ ఇనిషియేటివ్' (ఎస్‌టిఐ)కు మార్గం సుగమం చేసింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థను ఒక విశిష్టమైన 'కెపాసిటీ, కాపబిలిటీ బిల్డింగ్' అభివృద్ధి సంస్థగా మార్చి వేసింది.

అడిగారు. ప్రతినిధివర్గం సూచనప్రాయంగా అంగీకరించి, తక్షణ ప్రతిపాదనలు ఇవ్వమని కోరారు. ఊర్మిళాసుబ్బారావు ప్రారంభ ప్రతిపాదనను తయారు చేశారు. ఆ ప్రాథమిక ప్రతిపాదన, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనలు, సలహాలతో మార్పులు చేర్పులు జరిగి 2001లో 'సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)' స్థాపనకు దారితీసింది. ఎంసీఆర్‌హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్ విశాలమైన ప్రాంగణంలో, డిపార్ట్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ (డీఎఫ్ఐడీ), ప్రపంచ బ్యాంక్ సంయుక్త ఆర్థిక సహకారంతో రూపుదిద్దుకున్న భవన సముదాయాన్ని నాటి బ్రిటన్ ప్రధానమంత్రి టోనీ బ్లేర్ ప్రారంభించి, క్యాంపస్ ఆవరణలో చాలా సమయం గడిపి, చంద్రబాబునాయుడుతో ఇన్‌స్టిట్యూట్ అతిథిగృహంలో కాసేపు ద్వైపాక్షిక సమావేశమయ్యారు.

సీఎం చంద్రబాబునాయుడుతో, నేను ఏడీజీ ఊర్మిళాసుబ్బారావు జరిపిన మరో సమావేశంలో ఏడీజీ సూచనను సూత్రప్రాయంగా ఆయన అంగీకరించారు. ఉన్నతోద్యోగుల నుంచి జూనియర్ అసిస్టెంట్ల దాకా ఉన్న సుమారు ఐదు లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులందరి 'శిక్షణ అవసరాల విశ్లేషణ (Training Needs Analysis)' కోసం ఓఎంఆర్ (ఆప్టికల్ మార్క్ రీడర్) షీట్ల ద్వారా విషయ సేకరణ జరిపి, జాతీయ శిక్షణా విధానానికి (NTP) అనుగుణంగా, '(టీఎఫ్ఏ) Training For All' (ప్రతి ఉద్యోగికీ శిక్షణ విధానాన్ని) అమలు చేయాలని నిర్ణయించారు.

అలా ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు చొరవతో రూపుదిద్దుకున్న ఓఎంఆర్ ఫార్మాట్ ఆధారిత 'శిక్షణ అవసరాల విశ్లేషణ' అనతికాలంలో, బృహత్తరమైన 'స్టేట్ ట్రైనింగ్ ఇనిషియేటివ్' (ఎస్‌టిఐ)కు మార్గం సుగమం చేసింది. ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌ను ఒక విశిష్టమైన 'కెపాసిటీ, కాపబిలిటీ బిల్డింగ్' అభివృద్ధి సంస్థగా మార్చివేసింది. ప్రతి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగికి కనీసం 60 గంటల శిక్షణను అందించే సామర్థ్యాలను సమకూర్చే దిశగా, రాష్ట్ర ప్రభుత్వ మానవ వనరుల అవసరాలను తీర్చడానికీ, మానవ వనరులను అభివృద్ధి చేసే బాధ్యతను డాక్టర్ ఎంసీఆర్‌హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌కు అప్పగించారు.

ఇన్‌స్టిట్యూట్ శిక్షణ గదులు, వీడియో కాన్ఫరెన్స్ హాల్, మూడంతస్తుల బిల్డింగ్ కాంప్లెక్స్ విస్తరణ, ప్రపంచ స్థాయి ఆడిటోరియం, అతిథి గృహాలు, హాస్టల్ సదుపాయాలు, మైక్రోసాఫ్ట్ ఐటీ అకాడమీ లాంటి సౌకర్యాల కల్పన చేసి, సంస్థను 'స్టేట్ ఆఫ్ ఆర్ట్' స్థాయికి తెచ్చారు. అప్పటికీ, ఇప్పటికీ, బహుశా ఎప్పటికీ చంద్రబాబు నాయుడు, డీజీ పీవీఆర్‌కే ప్రసాద్, ఏడీజీ ఊర్మిళా సుబ్బారావుల ముద్ర ఆ సంస్థ మీద స్పష్టంగా కనిపిస్తుంది.

'స్టేట్ ట్రైనింగ్ ఇనిషియేటివ్' ప్రారంభించిన తొలినాళ్లలో, దానిని శాస్త్రీయంగా అమలుపరచడానికి, 'శిక్షణా నైపుణ్యం, ఉన్నత స్థాయి శ్రేణి అర్హతలున్న ఒక ప్రధాన శిక్షకుని (మాస్టర్ ట్రయినర్)' కోసం ఎంసీఆర్‌హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్ ప్రయత్నాలు చేసింది. అప్పట్లో, బ్రిటన్ 'థేమ్స్ వ్యాలీ యూనివర్శిటీ'లో శిక్షణ పొంది, అలాంటి అర్హతలు కలిగివున్న వారు, భారతదేశం మొత్తంలో కేవలం 8 మంది మాస్టర్ ట్రయినర్లు మాత్రమే ఉండేవారు. వారందరిలో, ఇండియన్ నావల్ స్టోర్స్ మేనేజ్‌మెంట్ సర్వీస్‌లో సీనియర్ స్థాయి ఉద్యోగిగా, అప్పటిదాకా కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక శిక్షణా సంస్థ 'ఐఎస్‌టీఎం'లో డిప్యుటేషన్ మీద పనిచేస్తున్న, 'టాప్ ర్యాంకర్ మాస్టర్ ట్రైనర్' ఎంపీ సేథి సేవలను ఎంసీఆర్‌హెచ్ఆర్డీ ఉపయోగించుకోవడానికి డీజీ పీవీఆర్‌కే ప్రసాద్ ప్రతిపాదనలను పంపించారు. ఆ ప్రతిపాదన సాఫల్యం కావడంలో జాప్యం కలిగితే, పీవీఆర్‌కే అభ్యర్థన మేరకు, నాటి రక్షణ మంత్రి మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్‌తో సీఎం చంద్రబాబునాయుడు స్వయంగా ఫోన్లో మాట్లాడారు. ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ స్థాయిలో ఆయన చేరిక, ఇన్‌స్టిట్యూట్ శిక్షణా సామర్థ్యతను ఆకాశమే హద్దుగా చేసింది.

ఉద్యోగుల శిక్షణను ప్రాధాన్యతా అంశంగా గుర్తించిన చంద్రబాబునాయుడు అది సఫలం కావడానికి, వివిధ శాఖాధిపతుల, సీనియర్ ఐఏఎస్ అధికారుల నిబద్ధతను కాంక్షిస్తూ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు, నేను, సేథి ఉమ్మడిగా డిజైన్ చేసినదే మూడురోజుల వర్క్‌షాప్ మాడ్యూల్ 'ఓరియంటేషన్ టు మేనేజ్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ (ఓఎంఓటీ)'. సీఎం చంద్రబాబునాయుడు, డీజీ పీవీఆర్‌కే ప్రసాద్ కనుసన్నులలో నిర్వహించిన 15–16 వర్క్‌షాపులకు సుమారు 200 ఐఏఎస్, ఐపీఎస్, నాన్—కాడర్ అధికారులు హాజరయ్యారు.

హార్వార్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన మేనేజ్‌మెంట్ నిపుణుడు, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత కొయంబత్తూర్ కృష్ణారావు ప్రహ్లద్ (సీకే ప్రహ్లద్) అప్పట్లో డాక్టర్ ఎంసీఆర్‌హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించినప్పుడు చంద్రబాబునాయుడు చేసిన ఐటీ రంగ అభివృద్ధిని, ప్రోత్సాహకాలను, పరిపాలనలో టెక్నాలజీ, ఇ–గవర్నెన్స్ వినియోగాన్ని, ప్రజాసేవలను మెరుగుపర్చడాన్ని, ఆర్థిక అభివృద్ధితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడాన్ని అభినందిస్తూ, ప్రసంశల వర్షం కురిపించారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కూడా చంద్రబాబునాయుడు, అదే విధానాన్ని మరింత వేగవంతం చేస్తూ, 25 సంవత్సరాల క్రితం ఆయన చొరవతో రూపుదిద్దుకున్న సంస్కరణలను వర్తమాన అవసరాలకు అనుగుణంగా పునఃపరిశీలించి అమలుచేస్తే మంచిదేమో!

▪ వనం జ్వాలానరసింహారావు

రాజకీయాల్లో అందరివాడు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ తనకంటూ ప్రత్యేకముద్ర వేసుకున్న నాయకుడు ధర్మపురి శ్రీనివాస్. అనారోగ్య కారణాలకు గుండెపోటు తోడై 76 ఏళ్ల వయస్సులోనే ప్రాణాలు కోల్పోయారు. ఐదు దశాబ్దాలుగా తెలుగు నేలపైన వివిధ హోదాల్లో జన బాహుళ్యానికి ఆయన సేవలందించారు. సమకాలీన రాజకీయాలకు ప్రతీకగా, నవయువ నాయకులకు స్ఫూర్తిగా నిలచిన శ్రీనివాస్‌ను రాజకీయ శ్రేణులు ఆప్యాయంగా 'శీనన్న' అని పిలుచుకుంటారు.

అది 1989 నవంబర్ నెల. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరుగుతున్న వేళ. ధర్మపురి శ్రీనివాస్ నిజామాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా జోరైన ఎన్నికల ప్రచారంలో ఉన్నారు. తొలిసారి నేను ఆయనను ఎన్నికల ప్రచారంలో కలుసుకుని పరిచయం చేసుకున్నాను. శ్రీనివాస్ నన్ను ఎగాదిగా చూసి 'ఏమిటి చూస్తే చిన్న పిల్లాడిలా ఉన్నావ్. (నాకు అప్పుడు 18 ఏళ్లు) పెద్ద పత్రిక (ఈనాడు) విలేఖరినని చెబుతున్నావు' అనేశారు. నేను విద్యార్థి దశలోనే జర్నలిజంలోకి అడుగుపెట్టడంతో ధర్మపురి శ్రీనివాస్‌ను మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై, మంత్రిగా పనిచేసినప్పటి నుంచి నిశితంగా పరిశీలించే అవకాశం వచ్చింది. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై ముగ్గురు ముఖ్యమంత్రులు — మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డిల కేబినెట్లలో శ్రీనివాస్ మంత్రిగా కొనసాగారు.



> ధర్మాగ్రహాన్ని ప్రదర్శించే డీఎస్ కుల మతాలకు అతీతంగా నాయకులెందరినో ప్రోత్సహించారు. డీఎస్‌ను నమ్ముకున్న నేతలు ఎందరో తమ జీవితాలను నల్లేరుపై బండి నడకలా సాఫీగా మార్చుకున్నారు. వివాదాలకు దూరంగా, ప్రజాసేవయే పరమావధిగా ఆయన ముందుకు వెళ్లారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీ నాయకులు సైతం మెచ్చేలా తనను తాను నిరూపించుకున్నారు.

అనూహ్యంగా తన శిష్యుడైన సతీష్ పవార్ పార్టీ మారి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయడంతో 1994 అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీనివాస్ ఓడిపోయారు. 1994—99 మధ్య తనకు తానుగా రూపాంతరం చెంది, 1999 అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీనివాస్ విజయం సాధించారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక ఆయన జీవితాన్ని సమూలంగా మార్చివేసింది. 42 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి శ్రీనివాస్ ప్రత్యేక తెలంగాణ కోసం గళం వినిపించారు. ప్రజల్లో ప్రత్యేక రాష్ట్రం పట్ల ఆసక్తి, ఆశలు రేపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బలపడుతున్న వేళ కాంగ్రెస్ అధిష్ఠానం అనూహ్యంగా తెలంగాణకు చెందిన వెనుకబడిన తరగతుల నేత ధర్మపురి శ్రీనివాస్‌ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షునిగా నియమించింది. 'ప్రజా ప్రస్థానం' పేరిట వందల కిలోమీటర్ల పాదయాత్రతో నాటి కాంగ్రెస్ శాసన సభాపక్ష నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, పీసీసీ చీఫ్‌గా ధర్మపురి శ్రీనివాస్ ద్వయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించింది. అప్పటివరకు శీనన్నగా చిరపరిచితుడైన శ్రీనివాస్‌ను పార్టీ శ్రేణులు, మీడియా కలిసి 'వైఎస్' తరహాలో 'డీఎస్'గా మార్చివేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేతలుగా వైఎస్, డీఎస్ చరిత్రలో నిలిచిపోయారు.

2004 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్‌తోపాటు డీఎస్ కూడా ముఖ్యమంత్రి పదవిని అధిరోహించాలని ఆయన అభిమానులు అభిలాషించారు. కానీ సహజంగానే కాంగ్రెస్ అధిష్ఠానం వైఎస్ వైపే మొగ్గు చూపింది. అనూహ్యంగా 2009 సార్వత్రిక ఎన్నికల్లో డీఎస్ ఓటమిపాలు కావడంతో ఆయన సీఎం పదవి ఆశలకు తాత్కాలికంగా తెరపడినట్లు అయింది. రెండోసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో, తర్వాత 2010లో ఉప ఎన్నిక రావడంతో మళ్లీ ముఖ్యమంత్రి పదవిపై డీఎస్ అనుచరులకు ఆశలు చిగురించాయి. ప్రత్యేక తెలంగాణ వాదం కోసం నిజామాబాద్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికకు దారి తీసిన ఎండల లక్ష్మీనారాయణ బీజేపీ ఎమ్మెల్యేగా మళ్లీ గెలిచారు. కాబోయే ముఖ్యమంత్రిగా అవకాశమున్న డీఎస్ కంటే ప్రజలు తెలంగాణ వాదానికి పట్టం కట్టారు. దాంతో డీఎస్ ప్రత్యేక తెలంగాణ కోసం అహర్నిశలు శ్రమించి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. 2004 సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమ పార్టీ టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్), కాంగ్రెస్‌ల మధ్య పొత్తు కుదిరేలా కృషి చేసిన డీఎస్ మాటకు కాంగ్రెస్ అధిష్ఠానం సానుకూలంగానే స్పందించింది. హైదరాబాద్‌తో కూడిన సంపూర్ణ తెలంగాణ రాష్ట్రం సిద్ధించడంతో డీఎస్ ఎమ్మెల్సీగా ఎన్నికై తెలంగాణ శాసనమండలిలో తొలి ప్రతిపక్ష నాయకునిగా సేవలందించారు. ఎమ్మెల్సీగా రెండోసారి ఎన్నికకు కొందరు కాంగ్రెస్ పార్టీ నేతలు సహకరించకపోవడంతో డీఎస్ నాటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆహ్వానం మేరకు పార్టీ మారిపోయారు.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగాన్ని మానుకుని విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్‌లో ఉన్న ధర్మపురి శ్రీనివాస్ క్రియాశీలక రాజకీయాల్లో చేరిపోయారు. తన సమకాలికులు, సీనియర్‌లతో పోల్చుకుంటే ధర్మపురి శ్రీనివాస్ తన రాజకీయ జీవితంలో అత్యంత ప్రతిభతో 'ఆక్సిలరీ ప్రమోషన్లు' పొందారనే చెప్పాలి. మాతృభాష తెలుగుతోపాటు ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషల్లో అనర్గళంగా మాట్లాడే శ్రీనివాస్ సమర్థుడైన నాయకునిగా పేరు తెచ్చుకున్నారు. తనలో ఉన్న బ్యూరోక్రాటిక్, పొలిటికల్ రెండు కోణాలతో సక్సెస్‌ఫుల్ రాజకీయ నేతగా గుర్తింపు పొందారు.

ధర్మాగ్రహాన్ని ప్రదర్శించే డీఎస్ కుల మతాలకు అతీతంగా నాయకులెందరినో ప్రోత్సహించారు. డీఎస్‌ను నమ్ముకున్న నేతలు ఎందరో తమ జీవితాలను నల్లేరుపై బండి నడకలా సాఫీగా మార్చుకున్నారు. నక్సలిజం ప్రాబల్యం ఉధృతంగా ఉన్న ఆ రోజుల్లో కేబినెట్ మంత్రిగా పనిచేసిన శ్రీనివాస్ తన సహచరులు ఎందరో నక్సలైట్లకు సాఫ్ట్ టార్గెట్లుగా మారినా, తాను అజాతశత్రువుగా ఉండిపోయారు. వివాదాలకు దూరంగా, ప్రజాసేవయే పరమావధిగా ఆయన ముందుకు వెళ్లారు. ప్రత్యర్థి రాజకీయ పార్టీ నాయకులు సైతం మెచ్చేలా తనను తాను నిరూపించుకున్నారు. తన అనుచరులను సర్పంచ్, మున్సిపల్ కౌన్సిలర్ పదవుల నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిపించుకున్నారు. డీఎస్‌లో ఉన్న మరో గొప్పతనం — ఆయన ఎంతటి కరడుగట్టిన తెలంగాణవాదో అంతటి ప్రాంతీయ విద్వేషాలు లేని విశాల హృదయుడుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆయన్ను మనస్ఫూర్తిగా అభిమానిస్తారు. వెనుకబడిన తరగతుల నాయకుడిగా పేరున్న ఆయన అన్ని వర్గాలను సమదృష్టితోనే చూశారు, ప్రోత్సహించారు. డీఎస్ అనుచర గణంలో కుల మత ప్రాంతాలకు అతీతంగా ఎంతో మంది రాజకీయంగా ఎదిగారు.

అభివృద్ధి పనుల్లోనే కాకుండా పార్టీ పటిష్ఠత విషయంలోనూ డీఎస్ ఆలోచనాధోరణి చిరస్మరణీయంగా మిగిలిపోతుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో డీఎస్ భూమికను లోతుగా విశ్లేషించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక సందర్భంలో డీఎస్ గురించి మాట్లాడుతూ కమ్యూనికేషన్ సాధనాలు అందుబాటులో ఉంటే డీఎస్‌ను మించిన కమ్యూనికేటర్, పొలిటికల్ లీడర్ దేశంలోనే లేడని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అగ్రనేత, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ డీఎస్‌పై ఉన్న అభిమానంతో ఆయన నియోజకవర్గం నిజామాబాద్‌లో విస్తృతంగా పర్యటించారు. డీఎస్ రాజకీయ వారసత్వాన్ని తమ తమ సైద్ధాంతికదారుల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు ఆయన తనయులు ఇద్దరూ బీజేపీ ఎంపీ అరవింద్ ధర్మపురి, కాంగ్రెస్ మాజీ మేయర్ సంజయ్ ధర్మపురి కృషి చేస్తున్నారు. తెలుగు రాజకీయాల్లో అందరివాడుగా ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) ఎప్పటికీ నిలచిపోతారు.

○ నరేందర్ పుల్లూరు
ఆంగ్ల పాత్రికేయుడు,
ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత

సంపూర్ణ మద్య నిషేధానికి వినతి

గౌరవనీయులైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి,

మద్యం మహమ్మారి సగటు తెలంగాణ పౌరుల ఆర్థిక, శారీరక, సామాజిక పరిస్థితులపై కలుగజేస్తున్న దుష్ప్రభావాన్ని గురించి మీ వంటి పరిణితి కలిగిన, ప్రజాక్షేమం పట్ల స్పృహ ఉన్న నాయకులకు ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థికపరంగా కానీ, ఆచరణ సాధ్యాసాధ్యాల దృష్ట్యాగానీ, సామాజికపరంగా గానీ, సంపూర్ణ మద్యనిషేధం అత్యంత కష్టతరమైన, సంక్లిష్టమైన ప్రక్రియే గానీ, అసాధ్యమైనది మాత్రం కాదు.

సాధారణంగా, ఈ నిర్ణయానికి ఆటంకం కల్పించేవి ఆర్థికపరమైన అసౌకర్యం, పక్కరాష్ట్రాల నుంచి స్మగ్లింగ్ బెడద, మద్యం సంస్కృతికి బానిసలైన వారి నుంచి, పారిశ్రామికవేత్తల నుంచి ఎదురవ్వబోయే వ్యతిరేకత మొదలైనవి. కానీ, మద్యనిషేధం వల్ల పెరగబోయే సగటు ఉత్పాదకత, స్థూల జాతీయోత్పత్తి, వైద్యరంగానికి కేటాయింపుల్లో వెసులుబాటు, సామాజిక క్రమశిక్షణ, పెరగబోయే జీవనప్రమాణాలు, మెరుగవ్వబోయే శాంతిభద్రతలు, తగ్గబోయే నేరాలు—రోడ్డు ప్రమాదాలు, పొదుపు మొత్తంలో వృద్ధి, దాని ద్వారా ఉత్పాదకరంగాల్లో పెట్టుబళ్ళ పెంపు వంటి సానుకూల అంశాలుంటాయి. అనితరసాధ్యమైన చర్యను చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణకు వచ్చే జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు, దానిద్వారా ఒనగూడే ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనాలు మొదలైన వాటితో పోల్చుకుంటే ఊహాజనితమైన— అడ్డంకులన్నీ సునాయాసంగా అధిగమించగలిగినవి. మద్యనిషేధం ద్వారా చేకూరే ప్రయోజనాలను శాస్త్రీయంగా మదింపు చేసి వాటి ఆర్థిక ప్రయోజనాలను అంకెలుగా మార్చితే, ఆరు నెలల నుంచి సంవత్సర కాలంలో రాష్ట్ర ఖజానా కోల్పోయిన ఎక్సైజ్ ఆదాయాని కంటే అధిక రాబడి పొందవచ్చు. ఆరంభదశలో స్వల్పకాలిక వెసులుబాటు కోసం 'మద్యనిషేధ ముఖ్యమంత్రి నిధి' ఏర్పాటు చేస్తే, సహృదయుల నుంచి ఇబ్బడిముబ్బడిగా విరాళాలు వస్తాయి. ఈ ప్రతిపాదనను సామాజిక మాధ్యమాల్లో చర్చకు పెడితే, ఆచరణయోగ్యమైన ఉపాయాలు, ప్రణాళికలు కోకొల్లలుగా వస్తాయి. కావలసిందల్లా తెగింపు, చిత్తశుద్ధి. అవి మీలో పుష్కలంగా ఉన్నాయి.

మీరు ఈ విషయంలో నడుం బిగిస్తే, ఈ మహాయజ్ఞంలో నిస్వార్థంగా పాలుపంచుకుని సలహా, సహాయ, సహకారాలను అందించడానికి నేను, భావితరాల క్షేమం కోసం తపనపడే నాలాంటి వేలాదిమంది పౌరులు, సంఘసేవకులు, మేధావులు, సాంప్రదాయిక కాంగ్రెస్ వాదులు మీ వెన్నంటే ఉంటారు. ఇలాంటి సమూలమైన మార్పుకు శ్రీకారం చుడితే, మీరు కోట్లాది తెలంగాణా మహిళల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.

———పల్లపోతు కృష్ణబాలాజీ, ఎస్‌బిఐ విశ్రాంత ఉన్నతాధికారి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ముకుళిత భారత్, వికసిత ఇండియా!

2024 ఎన్నికలు ఇండియా, భారత్‌ల మధ్య జరిగినట్లయింది. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని మొత్తంగా రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన అవసరాన్ని ముందుకు తెస్తూ 'ఇండియా' కూటమి ఎన్నికలకు వెళ్లింది. వికసిత భారత్, సబ్ కా సాత్ – సబ్ కా వికాస్ లక్ష్యాలున్నా వాటిని పక్కకు నెట్టివేస్తూ మైనారిటీలను బూచిగా చూపించి, మెజారిటీలను ఆకర్షించే ప్రయత్నం చేసింది 'భారత్'. అది ఆశించిన ఫలితాలనే కాదు, అవసరమైన ఫలితాలనైనా సాధించలేకపోయింది. 'ఇండియా' కూడా అవసరమైన ఫలితాలను సాధించలేకపోయినా, నిలువరించగలిగే ఫలితాలను సాధించగలిగింది.

భారత్, ఇండియాల వెనుక రెండు ప్రతీకాత్మక భావజాలాలు ఈ ఎన్నికల్లో పనిచేశాయి. గెలుపు ఓటములు ఆ భావజాలాలవే. పాలకపక్షానికి భారత్ అనే మాటమీద అంత మమకారం ఎందుకు? అది ఎప్పుడు బయటపడింది? ఎందుకు ఆమోదం పొందలేకపోతోంది? మరోమారు సమాధానం వెతుక్కోవలసిన ప్రశ్నలివి.

ఇండియా కూటమి జూలై 2023లో ఏర్పడితే అదే సంవత్సరం సెప్టెంబర్‌లో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ఇండియా అనడం మానేసి భారత్ అని పిలవాలని మొదట పిలుపునిచ్చారు. తరువాత రెండు రోజులకు ఢిల్లీలో జరిగిన జి–20 సమ్మిట్ సందర్భంగా వేసిన ఆహ్వానపత్రంలో మొదటిసారి 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ముద్రించడమే కాదు, ఇండియాకు బదులు భారత్ అని రాసి ఉన్న నామఫలకాన్ని ముందుంచుకుని ప్రధాని ప్రసంగించి ఆశ్చర్యపరిచారు. ఎందుకు అనే ప్రశ్నకు సమాధానంగా విదేశీయులు పెట్టిన ఇండియా కన్నా దేశీయమైన భారత్ సముచితం అన్నారు. విదేశీయులు అంటే బ్రిటిష్ వారనే అర్థం తెస్తూ మనం వలసభావనలు వదులుకోవలసిన (decolonize) అవసరం ఉందన్నారు.

ఇండియా అనే మాటను ఆంగ్లేయులు విరివిగా వాడిన మాట నిజమే కానీ మొదట వాడింది పారశీకులు, గ్రీకులూ. సింధును పారశీకులు హిందు అని ఉచ్చరిస్తే, గ్రీకులు ఇండస్ అన్నారు. గ్రీకులు ఇండస్‌కు తూర్పున ఉన్నదాన్ని ఇండియా అని క్రీస్తు పూర్వం నుంచీ అంటుంటే, సింధుకు తూర్పున ఉన్నది హిందూస్థాన్ అని మధ్యయుగాల నుంచి వాడుకలోకి వచ్చింది. హిందు అనే మాటకు మతపరమైన అర్థ వ్యుత్పత్తి మన ప్రాచీన గ్రంథాలలో లేదు. ఆర్యులకంటే ముందు నుంచీ హిందూ పదం ఉన్నదనీ, సంస్కృతీకరణలో అది సింధు అయిందనే వితండవాదం చేశాడు సావర్కర్. దీనికి ఏ ఆధారాలూ లేవు.

భారత్ అనే మాట భరతుడు అనే రాజు పేరిట వచ్చిందంటారని అందరికీ తెలుసు. ఎవరీ భరతుడు? శకుంతల, దుష్యంతుల కుమారుడితోపాటు అనేకమంది భరతులున్నారు. ఒకానొక రిషభుడి కుమారుడు భరతుడనీ, అతని పేరిటే భరతవర్షం వచ్చిందంటుంది విష్ణుపురాణం. వీళ్లెవరూ చారిత్రక వ్యక్తులు కాదు. ఇవి చిన్నపిల్లలకు చెప్పటానికి సరిపోయే కథలు. కాగా, అసలు సంగతి అది కాదు. తొలినాటి ఆర్యగణాల్లో పంచగణాలుగా ప్రసిద్ధిచెందిన వాటిలో పురులు ఒకటి. దీని శాఖల్లో ఒకటి భరతులు. భరత తెగకు చెందింది కురు వంశం. ఈ వంశానికి చెందిన దాయాదులు కౌరవ పాండవులు. వాళ్ల కథే భారతం.

ఇది అట్లా ఉంచితే, భరత వర్షం మీద పరిశోధన చేసిన జెఎన్‌యూ ప్రొఫెసర్ బిడి చటోపాధ్యాయ ఇండియా, భరతవర్షం వంటి మాటలకు చరిత్ర పొడవునా ఒకే భౌగోళిక స్వరూపం లేదంటారు. భరతవర్షం 'జన' అనే చిన్న పరిపాలనా భాగంగా మొదలై కొంచెం పెద్దదైన జనపదంగా, ఆ తరువాత దిశ్‌గా విస్తరించిందంటారు. ఈ దశలో అది ఉత్తరాపథంలో కొంత ప్రాంతానికి మాత్రమే పరిమితమైన భూభాగం అని అన్నారు. ఇందులో దక్షిణం ఎంతమాత్రమూ భాగం కాదు. ఏ పురాణం ఎప్పుడు క్రోడీకరింపబడిందో చెప్పడం కష్టం కానీ స్థూలంగా క్రీ.శ. 5, 6 శతాబ్దాల్లో క్రోడీకరింపబడిన విష్ణుపురాణం భరతవర్ష వర్ణన చేస్తూ వసుంధర (ప్రపంచం)లో ఉన్న ఏడుభాగాల్లో జంబూద్వీపం (భారత ఉపఖండం) ఒకటనీ, అందులో ఉన్న తొమ్మిది విభాగాల్లో భరతవర్షం ఒకటనీ అంటూ అది సముద్రానికి ఉత్తరాన, హిమాలయాలకు దక్షిణాన ఉన్నది అని చెప్పింది. అప్పటికే చంద్రగుప్తమౌర్యుడూ, సముద్రగుప్తుడూ దేశంలో అత్యధికభాగాన్ని జయించి పాలించారు కాబట్టి విష్ణుపురాణానికి ఈ అవగాహన రావడంలో ఆశ్చర్యం లేదు. అయితే భౌగోళిక అవగాహన వేరు భావనాత్మక అవగాహన వేరు. ఒక వ్యక్తి తనను కోసల రాజ్య పౌరుణ్ణనో, మగధ రాజ్య నివాసిననో చెప్పుకున్నాడు కానీ, ఏ దశలోనూ తను భరతఖండానికి చెందినవాణ్ణని చెప్పుకున్న ఆధారాల్లేవంటారు ఆచార్య చటోపాధ్యాయ.

విదేశీయులనీ, ఇతరులనీ, దురాక్రమణదారులనీ పేర్లు పెట్టబడినవారు ప్రవేశించక మునుపే భరత ఖండం అనే భౌగోళిక స్వరూపం ఉందని చెప్పడం 'భారత్' లక్ష్యం. వారిని మినహాయించి లేక ద్వితీయశ్రేణి పౌరులుగా దేశాన్ని రూపొందించాలనుకున్నపుడు వారు లేనప్పటి పేరే ఆదర్శమౌతుంది.

> విదేశీయులనీ, ఇతరులనీ దురాక్రమణదారులనీ పేర్లు పెట్టబడినవారు ప్రవేశించక మునుపే భరత ఖండం అనే భౌగోళిక స్వరూపం ఉందని చెప్పడం 'భారత్' లక్ష్యం. వారిని మినహాయించి లేక ద్వితీయశ్రేణి పౌరులుగా దేశాన్ని రూపొందించాలనుకున్నపుడు వారు లేనప్పటి పేరే ఆదర్శమౌతుంది. భారత్ అనడం వెనుక ఉన్న భావనలో ఏమి ఉంది, ఎవరు లేరు అనేవి కీలక ప్రశ్నలు.




భారత్ అనడం వెనుక ఉన్న భావనలో ఏమి ఉంది, ఎవరు లేరు అనేవి కీలక ప్రశ్నలు. వీటికి సమాధానాలు 2020లో యుజిసి రూపొందించిన Learning Outcomes Based Curriculum Frameworkలో భాగంగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు నిర్దేశించి సిలబస్‌లో ప్రవేశపెట్టిన Idea of Bharath (భారత్ అనే భావన) అనే పేపర్‌లో దొరుకుతాయి. ఇప్పుడిది జాతీయ విద్యావిధానం 2020లో భాగం. ఇది మొత్తం బీఏ చరిత్రకు పరిచయాత్మక అంశంగా మొదటి పేపర్‌గా నిర్ణయించబడింది. దీని సిలబస్‌లో భరత వర్షం, స్థల కాల భావనలు, వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, జైన బౌద్ధ వాఙ్మయం, లిపి పరిణామం, జ్ఞాన సంప్రదాయాలు, శౌర్యం (Indian valour), విద్యావిధానం, నైతికత, సామాజిక విలువలు, వసుధైక కుటుంబకం, శాస్త్రసాంకేతిక అభివృద్ధి, ఆయుర్వేదం, ప్రకృతివైద్యం, ఆర్థికభావనలు— భూమి, పరిశ్రమలు, వ్యాపారం, సముద్ర వాణిజ్యం మొదలైన అంశాలున్నాయి. ఇవన్నీ ప్రాచీన భారతదేశానికి సంబంధించినవే. ఇవి తప్పక అధ్యయనం చెయ్యవలసిన అంశాలనడంలో సందేహం లేదు. అయితే ఇది మాత్రమే భారత్ భావన ఎట్లా అవుతుందీ? దీనిలోకి మధ్యయుగాలనాటి అపారమైన పర్షియన్ సాహిత్యం, మదర్సాలు, యునానీ వైద్యం, యుద్ధతంత్రం, కొనసాగిన శాస్త్రసాంకేతిక అభివృద్ధి, అన్నిటినీ మించి భక్తి ఉద్యమంలోని సంస్కరణ భావాలు, సూఫీ తత్వం, ఉర్దూ భాష, వెల్లివిరిసిన దక్షిణ భారత, ఇతర ప్రాంతీయ భాషా సాహిత్యాలు, ఇక ఆధునిక యుగానికొస్తే పాశ్చాత్య విద్య, సాంఘిక మత సంస్కరణోద్యమాలు, జాతీయభావ చైతన్యం, ప్రజాస్వామిక లౌకిక భావనలూ ఇవన్నీ కలిస్తే కానీ భారత్ భావన ఏర్పడదు కదా! 1947 దాకా జరిగిన పరిణామాల సారాంశంతో వైవిధ్యాన్ని భారతదేశ ఆత్మగా ప్రతిష్ఠిస్తూ రూపొందించాల్సిన భారత్ భావన ఈ పేపర్‌లో కేవలం హిందు భావనగా మిగిలింది.

ఇండియాను తొలగించి భారత్‌ను వెలిగించడం వెనుక ఉద్దేశ్యం ఇదే కావొచ్చు. భారత్ అంటే తొలినాళ్ల దేశమేననే సంకేతమివ్వడం కావొచ్చు. తరువాత ప్రవేశించిన జాతులు, మతాలు భారత్‌లో భాగం కాదని చెప్పడం కావొచ్చు. అది ఒక అధికసంఖ్యాకవాద వ్యక్తీకరణ కావొచ్చు. లేక భారతీయులందరూ హిందువులేనని చెప్పడం కావొచ్చు. దేశమంటే మనుషులు కాదు, మట్టి మాత్రమే అనడం కావొచ్చు.

భారత్ భావన ఇంతవరకే పరిమితం కాలేదు. అధికరణాల్ని అధిగమించి కశ్మీర్ సరస్సులో వికసించగల కమలం అయింది. మైనారిటీలుగా హిందువులు ఇతర దేశాల్లో తింటున్న దెబ్బలకు సీఏఏతో దెబ్బకు దెబ్బ తీయగల వస్తాద్‌ను అంది. అర్హమై దేశాలకు పైగా కోవిడ్ టీకాను అందించిన ఆధునిక ధన్వంతరిగా మారింది. చంద్రుడిపై అంతరిక్షనౌకను దింపగల వ్యోమ అగ్రగామి. దేశ ఆర్థికవ్యవస్థను ఐదు ట్రిలియన్ డాలర్ల సంపదను దాటించగల బిగ్ బుల్. ఒకవైపు మనుస్మృతిని పాటిస్తూనే ఇతర మతాలకు మాత్రం ఉమ్మడి పౌరస్మృతిని తీసుకురాగల న్యాయసింహం. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోగల మహాబలి. విశ్వగురు.

ఈ మొత్తం భావజాలాన్ని ఎన్నికల ఫలితాలు ఒక్క కుదుపుకు లోనుచేశాయి. ఎన్నికల్లో సాధారణ మెజారిటీ సాధించలేకపోయినా ఎన్డీఏ కూటమిలో బీజేపీ భాగస్వామ్యం 82 శాతం ఉంది. అనేక ప్రయోజనాలు ఆశించి కూటమిలో ఉన్న తెలుగుదేశం, జనతాదళ్‌లు బీజేపీ మౌలిక భావజాల వ్యాప్తిని అరికట్టగలవా, అసలా ఉద్దేశ్యం వాటికి ఉన్నదా? వాటికీ బీజేపీకి మధ్య సాగే ఇచ్చిపుచ్చుకునే బంతులాటలో అవి రాజ్యాంగ స్ఫూర్తిని జారవిడుస్తాయేమోనని అనుమానం. ఎందుకంటే ఈ సంవత్సరం నుంచి ఎన్‌సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో ఇండియాను తొలగించి భారత్ అని రాయనున్నట్టు గతంలోనే ప్రకటించారు. దేశానికి పాఠ్యపుస్తకం రాజ్యాంగం కదా! అందు నుంచి తొలగించే అవకాశం ఇప్పుడు లేకపోవచ్చు కానీ, ఈ ప్రతీకాత్మక అడుగును ఇండియా ఎదుర్కొనవలసి ఉంటుంది. ఈ దేశం గర్భస్థ పిండంగా ఉన్నప్పటి పేరు భారత్. సర్వాంగాలూ సంతరించుకుని పూర్ణశిశువుగా జననం పొందినపుడు ప్రామాణిక గ్రంథంలో 'ఇండియా దట్ ఈజ్ భారత్' అనే పేరును నమోదు చేశారు. అది ఇండెలిబుల్ ఇంక్‌తో రాయబడింది. దాన్ని చెరిపితే దేశం చెదిరిపోతుంది.

• కొప్పర్తి వెంకటరమణమూర్తి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
మంగళవారం 2 జూలై 2024



అద్దె భవనంలో అరకొరవసతుల మధ్య నడుస్తున్న మహబూబాబాద్ ప్రభుత్వ ఐటీఐ

- ఉమ్మడి జిల్లాలో ఆరు ఐటీఐ ప్రాంగణాలు
- పదేళ్లుగా రాని రా మెటీరియల్ డబ్బులు
- పాత యంత్రాలతోనే విద్యార్థుల కుస్తీ
- సిబ్బంది కొరతతో అరకొర శిక్షణ
- శిథిలావస్థలో భవనాలు, వర్క్‌షెడ్లు
- కాంగ్రెస్ సర్కారూ పట్టించుకోవడం లేదని అభిప్రాయాలు



పూర్తిగా పాతబడి పోయిన వరంగల్ ఐటీఐ భవనం

అవస్థల మధ్య అంతంతమాత్రంగా!

కనీస వసతుల్లేక అధ్వానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలు


శిథిలావస్థలో ఉన్న ఫిట్టర్, మెషినిస్టు తరగతి గదులు

పాతబడిన భవనాలు.. ఎగిరిపోయి, కూలడానికి సిద్ధంగా ఉన్న రేకుల కప్పులు.. వాటిలో పాత కాలం నాటి యంత్రాలు.. కనిపించని కనీస వసతులు.. ఇవీ ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)ల్లో కనిపిస్తున్న దుర్భర పరిస్థితులు. అయిదారు దశాబ్దాల క్రితం నిర్మించిన పాత భవనాలు కావడంతో అధ్వానంగా.. చూడడానికి డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. విద్యార్థులకు వివిధ వృత్తుల్లో సాంకేతిక శిక్షణనిచ్చి ఉపాధి కల్పించడానికి ఉద్దేశించిన ఉమ్మడిజిల్లాలో నిర్మించిన ఆరు ఐటీఐలు మారుతున్న కాలానికి అనుగుణంగా లేకపోవడం, నిధులు లేమి, ఫలితంగా రా మెటీరియల్ సరఫరా లేకపోవడం, టెక్నికల్ స్టాఫ్ సరిపడా లేకపోవడం పెద్ద సమస్యగా మారాయి. ఫలితంగా సరైన శిక్షణ పొందలేక.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి, ఉద్యోగావకాశాలను అంది అందిపుచ్చుకోవడంలో విద్యార్థులు వెనుకబడుతున్నారన్న వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం ఓ వైపు వృత్తి విద్యను ప్రోత్సహించాలని చెబుతూనే మరో వైపు అదే వృత్తి విద్యను నేర్పే ఐటీఐలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు ఎలాంటి నిధులు రాకపోవడంతో ఐటీఐ ప్రాంగణాల నిర్వహణ పూర్తిగా డీలా పడిపోయిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడు నెలలైనా ఏ మాత్రం పట్టింపు లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాలు : 7 లో..

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

ప్రజా ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి : గ్రీవెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య


బాధితురాలి నుంచి ఫిర్యాదు స్వీకరించి సమస్య వింటున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూలై 1 : వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చే బాధిత ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 165 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఎక్కువ సమస్యలు రెవెన్యూకి సంబంధించినవి 26రాగా, మునిసిపల్ కార్పొరేషన్‌కు సంబంధించినవి 19ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులు పెండింగ్ పెట్టొద్దని త్వరితగతిన పరి ష్కరిస్తే ప్రభుత్వంపై బాధితులకు నమ్మకం పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, పరకాల, హను మకొండ ఆర్డీవోలు నారాయణ, వెంకటేష్, వివిధ డిపార్ట్‌మెంట్‌ల అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు.

- జిల్లాలో విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేందుకు కృషి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రణీత్‌గౌడ్, బాషబోయిన సంతోష్‌ల ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.
- జిల్లాలోని అన్ని వర్గాల పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎంసీపీఐ(యూ) నాయకులు కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందజేశారు. ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి నీలం రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున, తదితర నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

నూతన చట్టాలతో సత్వర న్యాయం

- కేసుల విచారణలో జాప్యం ఉండదు
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- నూతన చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూలై 1 : నూతన చట్టాలతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని, కేసుల విషయంలో జాప్యం ఉండదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సోమవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులకు సోమవారం నుంచి అమలవుతున్న నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన చట్టాల అమలు తీరుపై కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నిపుణుల కమిటీ సుదీర్ఘంగా చర్చించి బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో నూతన చట్టాలకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. సోమవారం నుంచి నూతన చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. నూతన చట్టాల అమలుతో కేసుల విచారణలో జాప్యం ఉండదని, పారదర్శకంగా విచారణ ఉంటుందని అంబర్ కిషోర్ ఝా తెలిపారు. నేరం చేసిన వారు కేసుల నుంచి తప్పించుకోలేరని ఆయన అన్నారు. నేరం ఎక్కడ జరిగినా బాధితులు ఏ స్టేషన్‌లోనైనా ఫిర్యాదు చేయవచ్చన్నారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని విచారణ చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు మూడు రోజుల్లో సంబంధిత స్టేషన్‌కు వెళ్లి సంతకం చేసి ఎఫ్ఐఆర్ పొందవచ్చన్నారు. గత నెలాఖరు వరకు పాత చట్టాల ప్రకారంగా నమోదైన కేసుల విచారణ నూతన చట్టాల ఆధారంగా జరుగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో 50శాతం మహిళలు, పిల్లలపై జరుగుతున్నవేనన్నారు. వీటిని నియంత్రించేందుకు నూతన చట్టాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కఠిన శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. నూతన చట్టాలపై అన్ని వర్గాలకు అవగాహన కల్పించనున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే కమిషనరేట్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రతీరోజు పోలీస్ స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌వోలు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. ఏదైనా సమస్య ఉన్నప్పుడు బాధితులు 87126 85070 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి ఆయా స్టేషన్‌ల సిబ్బంది న్యాయం చేయడం జరుగుతుందన్నారు. స్టేషన్‌లలో న్యాయం జరగకుంటే ఏసీపీని కలువాలని అక్కడ న్యాయం జరగకుంటే నేరుగా తనను కలువవచ్చని అంబర్ కిషోర్ ఝా వివరించారు. అవగాహన కార్యక్రమంలో ఏసీపీలు జితెందర్‌రెడ్డి, డేవిడ్‌రాజ్, సీఐలు పుల్యాల కిషన్, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రికి పూలమొక్కను అందిస్తున్న మంత్రి, మేయర్

సీఎంను కలిసిన మంత్రి సురేఖ, మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 1 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో జిల్లా ప్రజలకు భరోసా కల్పించినందుకుగాను రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ నగర కమిషనర్ గుండు సుధారాణి సోమవారం హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సంయుక్తంగా పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అత్యంత వేగంగా పురోగమిస్తున్న వరంగల్ నగర ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధవహించి నగర పురోగతిపై కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయాలని వారు సీఎంకు విజ్ఞప్తి చేశారు. వరంగల్ నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు తన పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు తాను మరో మారు వరంగల్ పర్యటనకు వస్తానని సీఎం తెలిపారు. వరంగల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

పాలన మారినా..

కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులే

- దరఖాస్తులు తీసుకోవడానికే పరిమితమైన గత ప్రభుత్వం
- రేవంత్ సర్కారులోనూ జాప్యంపై విమర్శలు
- జిల్లాలో 5 వేలకుపైగా దరఖాస్తులు



జిల్లాలో పెడింగ్ దరఖాస్తులు 5,580

కొత్త రేషన్ కార్డు కోసం హనుమకొండ జిల్లాలో 5580 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కలిపి కార్డుల కోసం ఈ దరఖాస్తులు అందాయని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్డుల జారీకి నిర్ణయం తీసుకుంటే వీటన్నిటికి మోక్షం కలగనుంది. జిల్లాలో ప్రస్తుతం ఎఫ్ఎస్‌సీ, అంత్యోదయ, అన్నపూర్ణ విభాగాల్లో మొత్తంగా 2,28,143 రేషన్ కార్డులున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ చెబుతోంది. జిల్లాలోని 414 రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు 4259.244 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందిస్తున్నారు.

హనుమకొండ సిటీ, జూలై 1 : పేదోడి బతుకుతో ముడిపడి ఉన్న రేషన్ కార్డు (ఆహార భద్రత కార్డు)విషయంలో పాలకులు పట్టింపులేనితనంతో వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్ పాలన ముగిసింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. ఇక కొత్త రేషన్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్ల చేరికల జారీ ఇట్టే జరిగిపోతుందని నిరుపేద వర్గాలు సంబురపడ్డాయి. తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెరపడి ఇక రేపో, మాపో కార్డు 'చేతి'కి అందినట్టేనని భావించాయి. కానీ ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో ఎంపీ ఎన్నికల కోడ్ పేద ప్రజల ఆశలకు అడ్డుపడింది. హమ్మయ్య ఎన్నికలు ముగిశాయి....ఇక కార్డు వచ్చినట్లే అనుకున్న ప్రజల సహనానికి ప్రభుత్వం పరీక్ష పెడుతోంది. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కార్డుల జారీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాలయాపన చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తొమ్మిదేళ్లల్లో ఒక్కటంటే ఒక్కటీ జారీ కాని వైనం


బీఆర్ఎస్ పాలనలో ఒక్కటంటే ఒక్కటి కూడా కొత్త రేషన్ కార్డు జారీ కాలేదు. ప్రజల నుంచి పలుమార్లు దరఖాస్తులు కోరిన నాటి ప్రభుత్వం అక్కడికే పరిమితమైంది. కనీసం కుటుంబ సభ్యుల పేర్లను అదనంగా చేర్చుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. ఇలా తొమ్మిదేళ్లు నిరుపేద ప్రజలు కొత్త రేషన్ కార్డు లేక అసహనానికి లోనయ్యారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇదిగో...అదిగో అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కాలయాపన చేస్తుండడంతో పాలన మారినా కార్డు ఇంకెప్పుడు తమకు అందుతుందంటూ పేదలు ప్రశ్నిస్తున్నారు.

బియ్యమేనా? సరుకులిస్తారా?

కొత్త రేషన్ కార్డుల జారీ ఎప్పుడు...? అనే ప్రశ్నతో పాటు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందుతాయా అనే సందేహాలు నిరుపేద ప్రజలను తొలిచివేస్తున్నాయి. అంతే కాదు గతంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 'అమ్మహస్తం' పథకం పేరిట రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు మొత్తం తొమ్మిది సరుకులను అందించారు. అందులో బియ్యం, చక్కెర, నూనె, పప్పులు తదితర నిత్యావసర సరుకులుండేవి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా ఈ తరహాలో అందచేస్తుందా..? లేదంటే ఇప్పటిలా బియ్యంతోనే సరిపెడుతుందా అన్న సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. సన్న బియ్యం సరఫరాలో వెనుకంజ వేసిన గత ప్రభుత్వం వలే కాకుండా రేషన్ కార్డుదారులకు సన్న బియ్యాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందచేయాలనే విజ్ఞప్తులు నిరుపేద వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా రేషన్ కార్డు ముడిపడి ఉండడంతో కొత్త కార్డులను వెంటనే జారీ చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

రైతన్నకు మద్దతుగా..

వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు పెంచిన కేంద్రం



వివరాలు : 7 లో..

విరమణ తర్వాత కుటుంబంపై శ్రద్ధవహించాలి


సత్కార కార్యక్రమంలో కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 1 : ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబంతో పాటు పిల్లల చదువులు, భవిష్యత్తుపై శ్రద్ధవహించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గ్రేటర్ పరిధిలో సుదీర్ఘ కాలం పాటు వివిధ హోదాల్లో పని చేసి ఉద్యోగ విరమణ పొందుతున్న ఐదుగురికి సోమవారం సాయంత్రం బల్దియా కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా మాట్లాడుతూ ఉద్యోగులు పని సమయంలో కుటుంబాన్ని సైతం పట్టించుకోకుండా ప్రజల కోసం పని చేస్తారన్నారు. కొందరు కుటుంబాలకు దూరంగా ఉంటారని అలాంటి వారు ఎప్పటికీ ప్రజల్లో గుర్తుండిపోతారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారు శేషజీవితం సంతోషంగా గడపాలని అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, డిప్యూటీ సిటీ ప్లానర్ సీహెచ్ ప్రకాశ్ రెడ్డి, పీహెచ్ వర్కర్లు ఎస్. సుశీల, ఎం. సులోచన, హెల్పర్ ఎన్. లింగయ్యలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, ఈఈలు సంజయ్ కుమార్, శ్రీనివాస్, రాజయ్య, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌లతో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు, జాక్ నాయకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో కూలీ హత్య

- బండరాయితో తలపై మోది హతమార్చిన వైనం
- వరంగల్ నగరంలో ఘటన


వీరభద్రాచారి (ఫైల్)

మట్టెవాడ, జూలై 1: కూలి పనులు చేసుకునే ఓ వ్యక్తి గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హత్యకు గురైన సంఘటన వరంగల్ నగరంలోని బట్టల బజార్ రోడ్డు ఆదివారం అర్ధరాత్రి జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ ఎల్లంబజార్ ప్రాంతంలో పూసల వీరభద్రాచారి(52)కి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఉప్పరి మేస్త్రీ వద్ద కూలీగా పనిచేసే వీరభద్రాచారి ఆదివారం రాత్రి 9.30 గంటలకు ఇంట్లో చికెన్ ఇచ్చి పని ఉందని చెప్పి బయటికి వెళ్లాడు. ఆ తర్వాత అర్ధరాత్రి 2.30 గంటలకు వరంగల్ బట్టల బజార్ వేంకటేశ్వర స్వామి దేవాలయం పక్క వీధిలో వీరభద్రాచారి తలపై గుర్తు తెలియని వ్యక్తులు బండరాయితో కొట్టి హతమార్చగా.. రక్తపు మడుగులో పడి ఉన్న అతడిని గుర్తించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. అయితే తన పనులు తాను చేసుకుంటూ ఎవరితో ఎలాంటి విబేధాలకు వెళ్లని వీరభద్రాచారిని ఇలా హతమార్చడం దారుణమని స్థానికులు పేర్కొంటున్నారు. మట్టెవాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. వీరభద్రాచారి భార్య రాధిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

బట్టల బజార్ రోడ్‌లో పూసల వీరభద్రాచారి హత్య జరిగిన ప్రాంతాన్ని సోమవారం ఉదయం వరంగల్ ఏసీపీ నంది రాంనాయక్ పరిశీలించారు. స్థానికంగా కార్మికులతో మాట్లాడారు. హత్య జరిగిన ప్రాంతంలో క్లూస్ టీం కొన్ని ఆధారాలు సేకరించగా.. మట్టెవాడ పోలీసు స్టేషన్ ఎస్ఐలు నవీన్‌కుమార్, లచ్చయ్య, సిబ్బంది వరంగల్ బట్టలబజార్, రామన్నపేట, ఎల్లంబజార్ ప్రాంతాల్లో సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

బీఎన్ఎస్ 103(1) సెక్షన్ కేసు నమోదు

నేరాల నియంత్రణ, వేగంగా శిక్షలు పడేలా కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి కొత్త చట్టాలను అమలులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇవి అమలులోకి వచ్చిన తొలిరోజే వరంగల్ పోలీసు సబ్ డివిజన్‌లోని మట్టెవాడ పోలీసు స్టేషన్ లో బీఎన్ఎస్ 103(1) సెక్షన్ కింద హత్య కేసు నమోదైంది.

డాక్టర్లు చిత్తశుద్ధితో పని చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు


కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

వరంగల్ మెడికల్, జూలై 1 : విధి నిర్వహణలో డాక్టర్లు చిత్తశుద్ధితో పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. డాక్టర్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం డీఎంహెచ్‌వో కాన్ఫరెన్స్ హాలులో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా చేపట్టిన వివిధ చర్యల వల్ల మాతృ మర ణాల రేటు, శిశు మరణాల సంఖ్య చాలా తగ్గిందన్నారు. డాక్టర్లు తమ పరిధిలోని సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలతో సమన్వయంతో పనిచేయాలన్నారు. డాక్టర్ బిసి.రాయ్‌ని ఆదర్శంగా తీసుకొని జాతి నిర్మాణంలో తమవంతు పాత్ర పోషించాలని అన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓను, ప్రోగ్రాం అధికారులను, డాక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ యాకూబ్‌పాషా, డాక్టర్లు ఉమాశ్రీ, ఇఫ్తికర్ అహ్మద్, హిమబిందు, స్పందన, నాగరాజు, శ్రీనివాస్, ప్రహసిత్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా కిడ్స్ అథ్లెటిక్స్ ఎంపికలు

జిల్లా వ్యాప్తంగా 240 బాలబాలికల హాజరు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 1 : వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో వరంగల్ జిల్లా స్థాయి బాలబాలికల (కిడ్స్) అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. సోమవారం జేఎన్ఎస్ లోని సింథటిక్‌ట్రాక్‌పై అండర్ 8, 10, 12 బాలబాలికల విభాగాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి (కిడ్స్) అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపికలో వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ మండల కేంద్రాల నుంచి 240 బాలబాలికలు పాల్గొనడం జరిగిందన్నారు.

ఇక్కడ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన 15 మంది బాల బాలికల ను ఈ నెల 7న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలోని గోపీచంద్ అకాడమిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కిడ్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, పైన్ విద్యా సంస్థల ఛైర్మన్ మూగల కుమార్‌యాదవ్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, నాగరాజు, పీఈటీలు కృష్ణమూర్తి, మహేందర్, శ్రీలత, శ్రీనాథ్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి

చిందు కళాకారులకు ఇందిరమ్మ ఇళ్లు

గడ్డం సమ్మయ్యకు అభినందన సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

దేవరుప్పుల, జూలై 1: అర్హులైన చిందు కళాకారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యకు స్వగ్రామంలో అభినందన సభ జరుగగా శ్రీహరితో పాటు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ సమ్మయ్య తాతల కాలం నుంచి చిందు వృత్తితోనే జీవనం సాగించేవారని, సమ్మయ్య కూడా అదే వృత్తిని కొనసాగిస్తూ కళలను పదిమందికి ఉపయోగపడే విధంగా కృషి చేశారని అన్నారు. ఆయన కృషికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి పద్మశ్రీ ఇచ్చారని గుర్తు చేశారు.

చిందు కళాకారులతో పాటు మాదిగ ఉపకులాలకు ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ సమ్మయ్య పద్మశ్రీ అవార్డు పొందడం పాలకుర్తికే గర్వకారణమన్నారు. సమ్మయ్య కుటుంబంతో పాటు చిందు కళాకారులను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకునే విధంగా తాను కృషి చేస్తానన్నారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ చాకలి అయిలమ్మ, దొడ్డి కొమురయ్య రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన గడ్డలో సమ్మయ్య జన్మించడం, చిందు కళలకు ఆజ్యం పోయడం, పద్మశ్రీ ఆవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ సమ్మయ్య పద్మశ్రీ పొందడం తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ప్రభుత్వం తరుపున సమ్మయ్యతో పాటు చిందు కళాకారులను ప్రభుత్వం ఆదుకునే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా వారు సమ్మయ్యను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గడ్డం మోహన్‌రావు, వంశీధర్‌రెడ్డి, శివకుమార్, రాంబాబు, నల్ల శ్రీరామ్, పులిగిళ్ల సుధాకర్, కందగట్ల సత్తయ్య, గడ్డం వెంకన్న, ఒగ్గు రవి, అందె భాస్కర్, రాజ్‌కుమార్‌నాయక్, గుర్రం సీతారామ్, లక్ష్మీనారాయణ నాయక్, మాచర్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


సమ్మయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి

సీపీఆర్‌పై పోస్టల్ కవర్ విడుదల

డాక్టర్ రామక శ్రీనివాస్ కృషితో రూపకల్పన



డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పోస్టల్ కవర్‌ను విడుదల చేస్తున్న పోస్టుమాస్టర్ జనరల్ శ్రీలత

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని చారిత్రాత్మకమైన పోస్టాఫీసులో సీపీఆర్ ప్రక్రియ పోస్టల్ కవర్‌ను హైదరాబాద్ జోన్ పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత విడుదల చేశారు. అకస్మాత్తుగా గుండె పోటు వచ్చిన అత్యవసర సమయంలో చేయాల్సిన ప్రథమ చికిత్స కార్డియో పల్మనరీ పునరుజ్జీవనం (సీపీఆర్)పై గత రెండు దశాబ్దాలుగా కృషి చేస్తున్న హనుమకొండకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ రామక శ్రీనివాస్ తపాలశాఖ సహకారంతో ఈ పోస్టల్ కవర్‌ను తయారు చేయించారు. సీపీఆర్‌పై తగిన ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ పోస్టల్ కవర్‌ను తపాలా శాఖ విడుదల చేసింది. ఈ సందర్భంగా పోస్టు మాస్టర్ జనరల్ శ్రీలత మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ చాలా కాలంగా సీపీఆర్ పట్ల అవగాహన కల్పించేందుకు చేస్తున్న కృషిని కొనియాడారు. మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ జీవన్ కుమార్ డాక్టర్ శ్రీనివాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ఆయన పొందిన పురస్కారాలను, సేవాభావాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌తో పాటు సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ సుబ్రమణ్యం, పోస్టల్ యూనియన్ నాయుడు సీహెచ్ ప్రతాపరెడ్డి, సీనియర్ మెడికల్ రిప్రజెంటేటివ్, మెడికల్ కౌన్సిలర్ పి భరత్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ (రిటైర్డ్) వి. రామచంద్రారెడ్డి ఇతర పోస్టాసు సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

కేయూ క్యాంపస్, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచి రాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్. నరేందర్‌లు సోమవారం తెలిపారు. డీబారైన వారిలో సికింద్రాబాద్ యూనివర్సిటీ పీజీ కళాశాల ఓయూలో ఇద్దరూ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మరో ఇద్దరూ ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జాతీయ స్థాయి ప్రేరణ శిక్షణకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక


అక్షయ్‌రామ్ వర్ష

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రేరణ శిక్షణకు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు డీఈవో డాక్టర్ ఎండి. అబ్దుల్ హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 4 నుంచి 10వ తేదీ వరకు గుజరాత్‌లోని వాదన నగర్‌లో నిర్వహిస్తున్న అఖిల భారత ప్రేరణ శిక్షణకు పంథిని జడ్పీహెచ్ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న కర్ర కంటి అక్షయ్‌రామ్, కాజీపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గండి వర్ష ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్

ఏటూరునాగారం రూరల్, జూలై1: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ కార్యక్రమం జరిగింది. వివిధ సమస్యలతో వచ్చిన గిరిజనుల వద్ద నుంచి పీవో చిత్రా మిశ్రా వినతులు స్వీకరించారు. మొత్తం 66 మంది గిరిజనుల తమ సమస్యల ను పీవోకు విన్నవించారు. గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో సీట్ కేటాయించాలని కన్నాయి గూడెం మండలం చింతగూడెం గ్రామానికి చెందిన చింత రుషి వినతి పత్రం అందించారు. సీఆర్‌టీగా ఉద్యోగావకాశం కల్పించాలని మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తుమ్మి భాగ్య కోరారు. అనారోగ్యా కారణాల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఐటీడీఏ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని వెంకటాపురం మండలానికి చెందిన వర్షిణి విజ్ఞప్తి చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంగా ఉద్యోగావకాశం కల్పించాలని తాడ్వాయికి చెందిన దుగ్గిరాల శ్రీలేఖ వినతి పత్రం అందించారు. సర్వే నంబర్ 141, 142లోని భూమికి పట్టాలివ్వాలని ఏటూరునాగారం మండలం రొయ్యూర్ గ్రామానికి చెందిన తాటి నీలాద్రి కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో దామోదరస్వామి, ఎస్.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా మధుసూదన్ బాధ్యతల స్వీకరణ


మధుసూదన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

హనుమకొండ టౌన్, జూలై 1 : ఎన్పీడీసీఎల్ ఇంచార్జి డైరెక్టర్ (ఆపరేషన్)గా మధుసూదన్ సోమవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన వి. మోహన్‌రావు జూన్ 30 న పదవి విరమణ పొందడంతో హెచ్ఆర్‌డి సీజీయంగా విధులు నిర్వర్తిస్తున్న టి. మధుసూదన్‌ను ఇన్‌చార్జి డైరెక్టర్ (ఆపరేషన్)గా నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సోమవారం బాధ్యతలు స్వీకరించిన మధుసూదన్‌ను ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పలు రైళ్లు దారిమళ్లింపు

కాజీపేట, జూలై 1 - బల్లార్షా సెక్షన్‌లో మూడో లైన్‌ల నిర్మాణపనుల కారణంగా ఈ నెల 3 నుంచి పలు రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్ న్యూఢిల్లీ మధ్య నడిచే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిజామాబాద్, బల్లార్షా మీదుగా దారి మళ్లించి నడుపుతున్నారు. గోరఖ్‌పూర్ - యశ్వంతాపూర్‌ల మధ్య నడిచే యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ మక్తల్, నిజామాబాద్‌ల మీదుగా, దారి మళ్లించినడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అవస్థల మధ్య అంతంతమాత్రంగా!


వరంగల్ ఐటీఐలో అధ్వానంగా వి ద్యార్థుల టాయిలెట్లు

కనీస వసతుల్లేక అధ్వానంగా పారిశ్రామిక శిక్షణ సంస్థలు


వరంగల్ ఐటీఐలో డ్రాఫ్ట్స్‌మెన్ తరగతుల భవనం దుస్థితి..

- పదేళ్లుగా రాని రా మెటీరియల్ డబ్బులు
- పాత యంత్రాలతోనే విద్యార్థుల కుస్తీ
- సిబ్బంది కొరతతో అరకొర శిక్షణ
- శిథిలావస్థలో భవనాలు, వర్క్‌షెడ్లు

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు ఆరే ఉన్నాయి. వరంగల్, హనుమకొండ, కాజీపేటల్లో మూడు, మహబూబాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారంలో మరో మూడు నడుస్తున్నాయి. జనగామ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐ లేదు. ఏటూరునా గరం ఐటీఐ ప్రధానంగా స్థానికంగా ఉన్న ఎస్టీలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాటు చేసింది. ఈ ఐటీఐల్లో ప్రవేశాల్లో ఎస్టీలకు 80 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఐటీఐలు 21 వరకు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలపై మొత్తం అజమాయిషీ ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రేనింగ్ (డీట్) అనే సంస్థదే. ఐటీఐల్లో ఇచ్చే పారిశ్రామిక శిక్షణకు సంబంధించిన సిలబస్‌ను ఈ సంస్థే తయారు చేస్తుంది. ఈ సంస్థ రూపొందించిన ట్రెయినింగ్ మ్యాన్యువల్‌నే వీటిలో అమలు చేస్తారు. కాగా ప్రభుత్వ ఐటీఐల్లో పని చేసే ఉద్యోగులకు మాత్రం వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. శిక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలను, సామగ్రిని సమకూర్చాల్సింది కూడా రాష్ట్ర ప్రభుత్వమే. ప్రభుత్వ ఐటీఐల్లో పది రకాల ట్రేడ్‌లలో శిక్షణ ఇస్తుండగా ప్రైవేటు ఐటీలు మాత్రం కేవలం ఒకటి, రెండు ట్రేడ్‌లనే నిర్వహిస్తున్నాయి. వాటిలో ఎలక్ట్రిషియన్ తప్పని సరి. ఈ ఐటీలలో ఒక సంవత్సరం కోర్సు, రెండు సంవత్సరాల కోర్సులున్నాయి. ఎలక్ట్రిషియన్ రెండు సంవత్సరాల కోర్సు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోపా) ఏడాది కోర్సు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీల్లో ప్రవేశాలన్నీ ఆన్‌లైన్ ద్వారానే జరుగుతాయి. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రిజర్వేషన్ ప్రకారం సీట్ల కేటాయింపు జరుగుతుంది.

అందని రా మెటీరియల్ డబ్బులు.. పాతయంత్రాలతోనే కుస్తీ..

ఐటీఐల్లో చదువుకునే విద్యార్థులకు ఆయా ట్రేడ్‌లలో పొందుతున్న శిక్షణకు గాను రా మెటీరియల్‌పైనే ప్రతీ నెల రూ.400 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయాలి. ఒక సంవత్సరం కోర్సు చదివే విద్యార్థికైతే సంవత్సరానికి రూ.4800, రెండు సంవత్సరాల కోర్సు విద్యార్థికి రూ.9600 ఖర్చు చేయాలి. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలి. కానీ పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదు. కేవలం ఐటీఐల్లో పని చేసే ఉద్యోగులకు జీతాలు మాత్రమే వస్తున్నాయి. చాలా ఐటీఐల్లో పాత యంత్రాలే ఉన్నాయి. బడ్జెట్ లేకపోవడంతో కొత్త యంత్రాలను కొనే పరిస్థితి లేదు. ఈ పాత యంత్రాలతోనే విద్యార్థులు కుస్తీ పడుతున్నారు. వీటిపైనే ప్రయోగాలు చేస్తున్నారు. రా మెటీరియల్ రాకపోవడం వల్ల విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయడంలో ఇబ్బందులు పడుతున్నారు. పాత మెటీరియల్స్‌తోనే మళ్లీమళ్లీ చేయాల్సి వస్తోంది. ఉదాహరణకు ఒక ఫిట్టర్ విద్యార్థి ఇనుము మెటీరియల్ సరఫరా లేక గత విద్యార్థులు చేసిన ఇనుప ముక్కలతోనే మళ్లీ చేస్తున్నారు. అలాగే ఎలక్ట్రిషియన్ విద్యార్థి విద్యుత్ వైర్ల సరఫరా లేక పాత వైర్లతోనే సర్దుకోవలసి వస్తోంది. వెల్డింగ్ ట్రేడ్ విద్యార్థులు ఏడాదిలో 50 ప్రాక్టికల్స్ చేయాల్సి ఉంటుంది. మెటీరియల్ లేక పది, పదిహేను ప్రాక్టిల్స్‌తోనే సరిపెట్టుకోవలసి వస్తోంది. ఐటీఐల నిర్వహణ ఖర్చులను కూడా రాష్ట ప్రభుత్వం ఇవ్వడం లేదు. సరిగా బడ్జెట్ రాకపోవడం వల్ల ప్రతీ నెల విద్యుత్ బిల్లులను చెల్లించడం కూడా ఐటీఐలకు కష్టంగా మారింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ప్రభుత్వ ఐటీఐల్లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. గత పదేళ్ల కాలంలో అనేక మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వారి స్థానంలో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగేలేదు. కేవలం 40శాతం సిబ్బందితోనే ఐటీఐలు నడుస్తున్నాయి. ఇటీవల వీఆర్‌వోలు, వీఆర్‌వోలను జూనియర్ అసిస్టెంట్లుగా ఐటీఐలలో నియమించినా పెద్దగా ప్రయోజనం లేకుం డా పోయింది. వారికి వృత్తి శిక్షణకు సంబంధించిన కనీస పరిజ్ఞానం కూడా లేదు. గ్రామాల్లో మస్కూరు పని చేసే వీరికి సాంకేతికపరమైన వృత్తిశిక్షణపైగానీ, కనీసం ఆఫీసులో రికార్డుల నిర్వహణలోగానీ అవగా హన లేకపోవడం వల్ల వారు ఉన్నా ప్రయోజనం లేని పరిస్థితి ఉంది. ఒక్కో ఐటీఐకి ఇద్దరు, ముగ్గురిని నియ మించడంతో ఐటీఐల్లో సిబ్బంది ఉన్నట్టుపైకి కనిపిస్తు న్నది కానీ క్షేత్ర స్థాయిలో అంతాలోటే. ఇక ఐటీఐల్లో వృత్తిశిక్షణలో కీలకమైన టెక్నికల్ స్టాఫ్ మరీ తక్కువ గా ఉన్నారు. అన్ని ఐటీఐలలో 60 శాతానికిపైగా ఖాళీ లున్నాయి. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం లోకి రాకముందు ఎప్పుడో పన్నెండేళ్ల క్రితం ఏపీపీ ఎస్సీ ద్వారా జరిగిన నియామకాలే తప్ప ఆ తర్వాత కాలంలో ఖాళీల భర్తీయే జరగలేదు. టీఎస్‌పీఎస్‌సీ ద్వారా ఇప్పటి వరకు ఎలాంటి నియామకాలు జరగ లేదు. ఇటీవలే కొంత మంది కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రం రెగ్యులరైజ్ చేశారు. ఇదొక్కటే ఐటీఐలో జరిగిన చెప్పుకోదగిన పరిణామం. ఐటీఐలో ఒక్కో యూనిట్ (ట్రేడ్)లో 20 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. అలా ఎన్ని ట్రేడ్‌లు ఉంటే 20 మంది చొప్పున అంత మంది విద్యార్థులను తీసుకుంటారు. నిబంధనల ప్రకారం ఒక్కో ట్రేడ్‌కు ఒక ఇన్‌స్ట్రక్టర్ తప్పని సరిగా ఉండాలి. కానీ ఇన్‌స్ట్రక్టర్ల కొరత వల్ల ఉన్న వాళ్లే ఒక్కొక్కరు రెండు, మూడు ట్రేడ్లను చూసుకోవాల్సి వస్తోంది.

కానరాని కనీస సౌకర్యాలు

ప్రభుత్వ ఐటీఐల్లో కనీస సౌకర్యాలు భూతద్దం వేసి చూసినా కానరావు. ఐటీఐలకు ప్రస్తుతం ఉన్న భవనాలు 70, 80 ఏళ్లనాటివి. అవి పూర్తిగా పాతపడి శిథిలావస్థకు చేరుకున్నాయి. ములుగు రోడ్డులోని ఐటీఐలోని భవనాలు, వర్క్‌షెడ్లు పూర్తిగా పాతపడిపోయి కనిపిస్తాయి. మూత్ర, శాలలు, మరుగుదొడ్లు కూడా సరిగా లేవు. తాగునీటి సదుపాయం అసలు లేదు. అరకొర వసతుల మధ్య వృత్తిశిక్షణ పొందుతున్న విద్యార్థులు నిత్యం ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తోంది. మహబూబాబాద్ ఐటీఐ భవనం పూర్తిగా పాతపడడంతో దాని స్థానం కొత్త భవనం నిర్మించగా జిల్లా పోలీసు అధికారులు లాక్కొని అందులో ఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. చేసేది లేక ఐటీఐను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. భూపాలపల్లిలో ఐటీఐ కోసం కట్టిన కొత్త భవనంలో తొలుత కలెక్టరేట్ ఏర్పాటు చేయగా కలెక్టరేట్ భవనం పూర్తికావడంతో ఇటీవలే దానిని ఐటీఐకి తిరిగి అప్పగించారు.

జనగామలో ఎప్పుడు?

ఉమ్మడి వరంగల్‌లోని అయిదు జిల్లాల్లో ప్రభుత్వ ఐటీఐలు ఉండగా జనగామ జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు. ఈ జిల్లాకు ప్రభుత్వ ఐటీఐ ఇది వరకే మంజూరైంది. ఐటీఐ భవన నిర్మాణానికి సిద్దిపేట రోడ్డులోని గుట్టల సమీపంలో స్థలాన్ని కూడా కేటాయించారు. సర్వే కూడా పూర్తయింది. ఆ తర్వాత ప్రభుత్వం పట్టించుకోకపోవడం, స్థానిక ప్రజాప్రతి నిధులు ఒత్తిడి తీసుకురాకపోవడంతో జనగామలో ఐటీఐ ఏర్పాటు ఎక్కడవేసిన గొంగలి అక్కడే చందంగా మారింది. దీనితో విద్యార్థులు ప్రైవేటు ఐటీఐలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా తీసుకొని ప్రైవేటు ఐటీఐలు విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వేలాది రూపాయాలను గుంజుతున్నాయి.

ఒకే క్యాంపస్‌లో..

ములుగు రోడ్డులోని వరంగల్ ఐటీఐ క్యాంపస్ విశాలంగా ఉంటుంది. 70 ఏళ్ల క్రితం ఈ ఐటీఐ ఏర్పాటైంది. దీనికి విశిష్టమైన చారిత్రక నేపథ్యం ఉన్నది. ఈ ఐటీఐకి విశాలమైన స్థలం ఉండటంతో.. ఇదే అవకాశంగా అన్ని కార్యాలయాలను ఇందులోనే ఏర్పాటు చేశారు. హనుమకొండ ఐటీఐని కూడా ఇందులోకే మార్చారు. ఇది వరకు ఇది వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో అద్దె భవనంలో నడిచేది. దానిని ఈ ములుగు రోడ్డులోని ఐటీకి క్యాంపస్‌కు తరలించారు. ఐటీఐల రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం కూడా ఇందులోనే ఉంది. ఇది చాలదన్నట్టు వరంగల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసును, దీంతో పాటు రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసును సైతం ఇందులోనే చేర్చారు. పట్టించుకునేవారు లేకపోవడంతో ములుగు రోడ్డులోని ఐటీఐ స్థలంలో కొంత భాగం అన్యాక్రాంతమైంది. విచిత్రమేమిటంటే ప్రస్తుతం పాత సెంట్రల్ జైలు స్థలంలో నిర్మాణంలో ఉన్న మల్టీసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి బహుళ అంతస్తుల భవన స్థలంలో కొంత ఇందులోనే చూపారు.

ఏటీసీలు సరే.. ఐటీఐల్లోని సమస్యల సంగతేంటి?

ప్రభుత్వ ఐటీఐలు అనేక సమస్యల మధ్య కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో టాటా టెక్నాలజీ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంలో వీటిల్లో అడ్వాన్సుడ్ ట్రెయినింగ్ సెంటర్ (ఏటీసీ)లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఏటీసీలు ఐటీఐలో ఒక భాగంగానే నడుస్తాయి కానీ ప్రస్తుతం ఉన్న పాత ఐటీఐ పరిస్థితేంటన్నది ప్రశ్న. ఏటీసీలు మాత్రమే టీటీఎల్ ఆధ్వర్యంలో నడుస్తాయి. ఐటీఐలు మాత్రం యథావిధిగా ప్రభుత్వ యాజమాన్యంలోనే కొనసాగుతాయి. ఏటీసీలు ఏర్పాటయితే ప్రస్తుతం ఐటీఐల్లో నిర్వహిస్తున్న ట్రేడ్ల సంగతేమిటన్న ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వ ఐటీఐల్లో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, వెల్డర్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, టర్నర్, మెషినిస్టు, కోపా ట్రేడ్లను నిర్వహిస్తున్నారు. వీటి కొనసాగింపు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. ఐటీఐ ఆవరణలో ఏటీసీల నిర్వహణకు కొత్త భవనాల నిర్మాణం జరుగుతుంది. కానీ ఐటీఐ ప్రస్తుత పాత భవనాల సంగతేమిటీ? విద్యార్థులకు రామెటీరియల్ డబ్బులు ఇచ్చేది ఎవరు? సిబ్బంది ఖాళీల భర్తీ జరిగేనా? మౌలిక వసతుల కల్పన మాటేమిటీ? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏటీసీల ఏర్పాటుతో పాటు సమాంతరంగా ఐటీఐలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ఏటీసీల ఏర్పాటుతో ఒరిగే ప్రయోజనం పెద్దగా ఏమీ ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రైతన్నకు మద్దతుగా..

వ్యవసాయ ఉత్పత్తులకు ధరలు పెంచిన కేంద్రం


ఘన్‌పూర్ మార్కెట్‌కు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 1: రైతులు పండిస్తున్న పంటలకు మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచింది. పెరిగిన ధరలు ఈ సీజన్ నుంచే అమలులోకి వచ్చాయని చెబుతున్నారు. ఏ పంట ధర ఎంత పెరిగింది? మార్కెట్ యార్డులో ఏ సరుకుకు ట్రేడర్లు ఎంత ధర ఇస్తున్నారు? అనేది ఈ ధరలతో రైతులు పోల్చుకుంటే నష్టపోకుండా ఉండవచ్చు. ఒక్కోసారి కొన్ని పంటలకు మద్దతు ధరల కంటే డిమాండ్‌ను బట్టి ఎక్కువ ధర కూడా లభించే అవకాశం ఉంటుంది. మద్దతు ధరలపై రైతులకు అవగాహన ఉంటే లాభపడే అవకాశం ఉంటుంది. ఐతే గత ఏడాది ధరలతో ఈ ఏడాది పెంచిన ధరలను.. పెరిగి పోతున్న పెట్టుబడి వ్యయంతో పోల్చి చూసుకుంటే పెద్దగా ఒరిగిందేమీ లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. ఎంతైనా గుడ్డిలో మెల్లలా కొంత మేలు జరుగుతుందని ఆశిస్తున్నారు. దుక్కులు దున్నడం, విత్తనాలు వేయడం, ఎరువులు, పురుగు మందులు, కూలీ రేట్లు, కలుపు తీయడం, పంట కోత కోయించడం, తూర్పార పట్టించడం, మార్కెట్ యార్డుకు రవాణా చేయడం అన్నీ లెక్కలు వేసి చూసుకుంటే చివరకు ఏం మిగలడం లేదని వాపోతున్నారు. ఆరుగాలం కష్టించిన రైతుకు లాభం మాటేమోగాని కూలి గిట్టుబాటు కాని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడికి, చేసిన అప్పులకు పోగా రోజుకు వంద, రెండు వందలు కూడా రైతుకు కూలి పడడం లేదని వాపోతున్నారు.

పంట పెట్టుబడి ఇలా..

ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు వాటిని పండించడానికి పెడుతున్న పెట్టుబడి, వస్తున్న ఆదాయం లెక్క వేసి చూస్తే పెద్దగా ఫలితం ఉండడం లేదని తెలుస్తోంది. సన్న, చిన్న కారు రైతులకు వస్తున్న ఆదాయం ఏ మాత్రం చెప్పుకోదగినదిగా ఉండడం లేదంటున్నారు. వరి పంటకు ఎకరాకు పెట్టుబడి 20 నుంచి 25 వేల రూపాయల వరకు అవుతోందని, ట్రాక్టర్‌తో దున్నడానికి రూ.5 వేలు, విత్తనాలు వేయడానికి రూ.5 వేలు, కలుపు తీయడానికి రూ.3 వేలు, ఎరువులు, పురుగు మందులకు 3 వేలు, కోత కోయడానికి రూ.5 వేలు, రవాణ తదితర ఖర్చులు కలుపుకుని తడిసి మోపెడు అవుతోందని రైతులు వాపోతున్నారు. కాగా ఎకరాకు 30 నుంచి 40 బస్తాల ధాన్యం లేదా 20 నుంచి 22 క్వింటాళ్లు మాత్రమే వస్తోందని, ధాన్యం ధర క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ. 2300 వేసుకున్నా 46 వేల నుంచి 50 వేల రూపాయలు వస్తున్నాయి. పెట్టుబడి పోను ఆరు నెలలు కష్టపడితే రూ. 20 వేల నుంచి 25 వేలు మాత్రమే మిగులుతన్నాయని చెబుతున్నారు. అంటే నెలకు రూ.3 వేల నుంచి 4 వేలు మాత్రమే మిగిలినట్టు. ఇంత తక్కువ మిగిలితే రోజు కూలి ఏం పడినట్టని ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి వెళితే రోజుకు రూ.200ల నుంచి రూ.300లు కూలి వస్తున్నదని చెబుతున్నారు.



పెరిగింది గోరంతే...

తోట రమేశ్, రైతు, శివునిపల్లి

నాలుగేళ్ల క్రితం మద్దతు ధరలు కొంత మెరుగ్గానే పెరిగాయి. ప్రస్తుతం పంట పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ఈసారి పెరుగుదల అంతంతే ఉంది. ఏ మాత్రం గిట్టుబాటు కాదు. చేసిన కష్టం, పెట్టుబడి, నిర్వహణ ఖర్చులు అన్ని చూసుకుంటే లాభం మాటేమోగాని రైతులే వి ఎగిలేలా ఉంది.

పెరిగిన మద్దతు ధరల వివరాలు

వరి సాధారణ రకం క్వింటాల్‌కు గత ఏడాది రూ. 2183 కాగా ఈ ఏడాది రూ.2300కి పెరిగింది. అంటే క్వింటాల్‌కు రూ. 117 పెరుగుదల ఉంది.

పంట	2024	2023	పెరుగుదల
వరి (సాధారణ)	2300	2183	117
వరి (ఏ గ్రేడ్)	2320	2203	117
పెసలు	8682	8558	124
మినుములు	7400	7050	450
మొక్కజొన్న	2225	2090	135
కందులు	7550	7000	550
వేరుశనగ	6783	6377	406
పత్తి(పొట్టిపింజ)	7121	6620	501
పత్తి(పొడుగుపింజ)	7521	7020	501
పొద్దు తిరుగుడు	7280	6760	520
సోయాబీన్(పసుపు)	4892	4600	292
నువ్వులు	9267	8635	632
జొన్నలు(హైబ్రీడ్)	3371	3180	191
జొన్నలు(మల్దండి)	3421	3225	196
సజ్జలు	2625	2500	125
రాగులు	290	3846	444

వరికి కనీసం రూ.500లు పెంచాలి



సముద్రాల రాజు, రైతు, నమిలిగొండ

ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.500లు, పత్తికి రూ.1000లు పెంచితే రైతులకు కొంత లాభదాయకం. అలా కాకుండా ధాన్యానికి రూ.117, పత్తికి రూ. 501లు పెంచడం ప్రస్తుత పెట్టుబడికి ఏమాత్రం సరిపోదు. రైతుకు కనీసం కూలి రేటు కూడా పడకపోతే ఇక ఏం ఫలితం ఉంటుంది?

ఎద్దు పొడిచి గిరిజన రైతు మృతి


మృతి చెందిన రైతు బానోత్ శ్రీను

మహబూబాబాద్ రూరల్, జూలై 1 : ఎద్దు పొడవడంతో గిరిజన రైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మండలం ఇస్లావత్‌తండా (ఎస్) శివారు బిచ్యాతండాలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్యాతండాకు చెందిన బానోత్ శ్రీను (47) రెండు ఎడ్లు ఉన్నాయి. వర్షం వస్తుండడంతో ఆరు బయట ఉన్న పశువులను కొట్టంలో కట్టేసేందుకు వాటిని తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎద్దు ఒక్కసారిగా శ్రీనును పొడవడంతో అతని తల ఇంటిగోడకు బలంగా తాకింది. దీంతో శ్రీను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నానుకి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య నానుకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అన్నారం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్, జూలై 1: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం (సరస్వతీ) బ్యారేజీ వద్ద నిపుణుల బృందం చేపడుతున్న పరీక్షలు 11 రోజులక చేరాయి. ప్యార్లర్ సెర్పింగ్ మెథడ్‌లో ఈ టెస్టులు జరుగుతున్నాయి. మొత్తం 42 ప్రాంతాల్లో ఈ టెస్టులు చేయాల్సి ఉండగా సోమవారం నాటికి ఏడు ప్రాంతాల్లో వీటిని నిర్వహించారు.

ఎస్సీ గురుకులాల్లో పార్ట్‌టైం లెక్చరర్లు, టీచర్లకు దరఖాస్తు ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల, కళాశాలల్లో పార్ట్‌టైం టీచర్లు, లెక్చరర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆర్‌సీవో ఎస్. విద్యారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, ఎకనామిక్స్, సోషల్, బయోసైన్స్, హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీతో పాటు బీఈడీ చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. జూలై 3వ తేదీ లోపు హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌజ్ ఎదురుగా ఉన్న ఆర్‌సీవో కార్యాలయంలో అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 4వ తేదీన ఇంటర్వ్యూతో పాటు డెమో ఉంటుందని తెలిపారు.

ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్

కేయూ క్యాంపస్, జూలై 1 : జూలై 2, 4 తేదీల్లో జరగాల్సిన కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ నాల్గవ సెమిస్టర్ పరీక్షలను డివిజన్ కౌంట్స్ ఆఫీసర్స్ పరీక్షల కారణంగా రీషెడ్యూల్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 2న జరుగాల్సిన పరీక్ష జూలై 20న, జూలై 4న జరుగాల్సిన పరీక్ష జూలై 22న జరుగుతుందని స్పష్టం చేశారు. పరీక్షల సమయం, పరీక్ష కేంద్రాల్లో ఏలాంటి మార్పులు ఉండవని పేర్కొన్నారు.

6 నుంచి ఎంసీఏ నాలుగో సెమిస్టర్ ఎగ్జామ్స్

కేయూ క్యాంపస్, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ సీబీసీఎస్ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు జూలై 6 నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 6, 9, 11 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని కోరారు. కేయూ క్యాంపస్‌లోని కామర్స్ విభాగం, ఎడ్యుకేషన్ విభాగం, హనుమకొండ వాగ్దేవి పీజీ కళాశాల, సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఒకే ఈతలో ఏడు మేకల పిల్లలు


ఏడు పిల్లలకు జన్మనిచ్చిన మేక

మరిపెడ రూరల్, జూలై 1 : సహజంగా మేకలు, గొర్రెలు ఒకే ఈతలో 1, 2, లేదంటే మూడు పిల్లలు జన్మించడం సాధారణంగా చూస్తాం.. కానీ ఈ మేక గతంలో 3 పిల్లలకు జన్మనివ్వగా ఈ సారి ఏకంగా ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. ఈ అరుదైన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. రైతు రేఖ వెంకన్నకు చెందిన మేక ఏడు పిల్లలకు జన్మనిచ్చింది. జన్మించిన ప్రతి పిల్ల ఆరోగ్యంగా ఉండడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఇందులో నాలుగు పోతు పిల్లలు, మూడు కొదమలు ఉన్నట్లు రైతు తెలిపారు.

టెక్స్‌టైల్ పార్కును సందర్శించిన 'యంగ్‌వన్' చైర్మన్



హెలిప్యాడ్ వద్ద టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్‌తో మాట్లాడుతున్న చైర్మన్ కిహాక్‌సంగ్

గీసుగొండ, జూలై 1: గీసుగొండ మండలం శాయంపేటహవేలి గ్రామశివారులోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)ను దక్షిణకొరియా దేశానికి చెందిన యంగ్‌వన్ కంపెనీ చైర్మన్, సీఈవో కిహాక్‌సంగ్, కంపెనీ ప్రెసిడెంట్ మిన్‌సుక్‌లీ, డైరెక్టర్ ఎండీ షాజాహాన్ సోమవారం సందర్శించారు. సోమవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డితో హైదరాబాద్‌లో అపాయింట్‌మెంట్ ఉన్న నేపథ్యంలో వారు తొలుత టెక్స్‌టైల్ పార్కుకు చేరుకుని తమ కంపెనీ ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించేందుక వచ్చారని టీజీఐఐసీ అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో పార్కుకు వచ్చిన కంపెనీ ప్రతినిధులు స్థలం మ్యాప్‌ను పరిశీలించడంతో పాటు 3 గంటల పాటు వారు కంపెనీ నిర్మాణాలపై చర్చించారు. యంగ్‌వన్ కంపెనీకి పార్కులో వస్త్ర పరిశ్రమలను నెలకొల్పేందుకు 297 ఎకరాలను టీజీఐఐసీ కేటాయించగా రూ.980 కోట్ల అంచనా వ్యయంతో కొద్దినెలల క్రితం కంపెనీ నిర్మాణ పనులను చేపట్టింది. ఇందులో 12వేల మందికి ప్రత్యక్షంగా, మరో 10వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశం ఉందని టీజీఐఐసీ అధికారులు చెబుతున్నారు. వస్త్ర పరిశ్రమల రంగంలో యంగ్‌వన్ కంపెనీకి ప్రపంచంలోనే మంచి గుర్తింపు ఉందని, ఫామ్ టూ ఫ్యాషన్ ఫారిన్ అనే విధంగా ఇందులో వస్త్రాలు తయారు చేస్తారని అధికారులు పేర్కొన్నారు. యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధుల వెంట టీజీఐఐసీ జోనల్ మేనేజర్ రామా సంతోష్‌కుమార్, తదితరులున్నారు.

బాల్యంపై.. బ్యాగు భారం!





వర్ధన్నపేట రూరల్, జూలై 1 : పుస్తకాల బరువు బాల్యాన్ని కుంగదీస్తోంది. కిలోలకు కిలోల బరువుంటున్న పుస్తకాల బ్యాగులతో చిన్నారుల వెన్నెముక వంగిపోతోంది. ప్రైవేటు పాఠశాలల పుణ్యమా.. అని ఒకటి, రెండు తరగతుల విద్యార్థులే 20 నుంచి 25కిలోల పుస్తకాలను మోస్తున్నారు. వాస్తవానికి విద్యార్థి బరువులో 10 శాతం మాత్రమే పుస్తకాల బరువు ఉండాలని చెబుతున్న విద్యాహక్కు చట్టం.. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు అసలు పుస్తకాలు ఉండొద్దని పేర్కొంటోంది. కానీ, ఈ నిబంధనలేవీ అమలవడం లేదు. అవసరం లేని పుస్తకాలను పాఠశాలలలోనే భద్రపరుచుకునేలా లాకర్ల సదుపాయం ఏర్పాటు చేయాలని ఉన్నా చాలా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. మరోవైపు మారిన ఫ్యాషన్ పోకడలతో ప్రస్తుతం విద్యార్థులు నడుం కిందకు బ్యాగు వేలాడేలా వేసుకుంటున్నారు. దీని వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వరంగల్ జిల్లాలో 244 ప్రైవేటు పాఠశాలలు ఉండగా 70,520 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే చాలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ లాభాపేక్ష కోసం పలు పబ్లికేషన్స్ రూపొందించిన, తమ సంస్థల పేరిట ముద్రించిన పుస్తకాలను కొనాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో ఎల్‌కేజీ చదువుకునే విద్యార్థికి 6 నుంచి 10 పాఠ్య పుస్తకాలు, క్లాస్ వర్క్, హోమ్‌వర్క్ కోసమంటూ పదుల సంఖ్యలో నోట్ పుస్తకాలు ఇస్తున్నాయి. తల్లిదండ్రులు వాటిని బ్యాగుల్లో ఉంచి పిల్లలను బడికి పంపుతున్నారు. వీటికి లంచ్ బాక్స్, వాటర్ బాటిల్ తోడవడంతో బ్యాగు బరువు 4 నుంచి 6 కిలోల వరకు అవుతోంది. ఇలా తరగతి పెరిగే కొద్దీ బరువు పెరుగుతోంది. ఈ మోత భారంతో పిల్లలు చిన్నతనం నుంచే అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

- పుస్తకాల మోతతో విద్యార్థుల అవస్థలు
- ఏటేటా పెరుగుతున్న బరువు
- చిన్న వయస్సులోనే వెన్నెముక సమస్యలు
- అమలు కాని విద్యాహక్కు చట్టం నిబంధనలు
- అవగాహన కల్పించని అధికారులు

అవసరం లేని పుస్తకాలే ఎక్కువ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆరు సబ్జెక్టులకు సంబంధించిన ఆరు పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉంటాయి. కానీ, ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రం అందుకు విరుద్ధంగా తల్లిదండ్రులపై ఆర్థిక భారాన్ని మోపేందుకు ఒకటి, రెండు తరగతులు చదివే విద్యార్థులకు 10 నుంచి 12 పుస్తకాలు, ఒక్కో సబ్జెక్టుకు తరగతి వర్క్‌బుక్, హోం వర్క్, ప్రాజెక్టు పని ఇలా మూడేసి పుస్తకాలు కొనుక్కోవాలని చెబుతున్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ మొత్తం 30 నుంచి 45 అవుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అవసరం లేని పుస్తకాలను పక్కకు పెట్టి అవసరం ఉన్న వాటిని వాడుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు.

ఈసారైనా అవగాహన కల్పించేనా..?

విద్యాహక్కు చట్టంపై క్షేత్రస్థాయిలో అధికా రులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న తెలంగా ణ ప్రభుత్వం అదే స్థాయిలో విద్యాహక్కు చట్టం ప్రైవేటు పాఠశాలల్లో అమలవుతుందా.. లేదా చూసుకోవడంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రు లు ప్రైవేటు యాజమాన్యాలను ప్రశ్నించేలా చట్టంపై అవగాహన తేవా లి. ఆయా మండలాల్లోని ఎంఈవోలతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయడంతో పాటు కళాజాత మాదిరిగా, ప్రభుత్వ పాఠశాలల పనితీరు ను వివరించేటప్పుడు, విద్యా హక్కుపై గల సామాన్య ప్రజల హక్కును గుర్తుచేయాల్సి బాధ్యత ఎంతైనా ఉంది.

అధిక భారం వెన్నుపూస పైనే..

నిటారుగా నిలబడాలంటే వెన్నుపూస ప్రధాన ఆధారం. పుస్తకాల బ్యాగును వీపుపై వేసుకోవడం వల్ల వెన్నెముకపై భారం పడుతోంది. దీంతో అది దెబ్బతినే ప్రమాదం ఉంది. 15ఏళ్ల పిల్లల శరీరంలో వివిధ రకాల మార్పులు సంభవిస్తాయి. ఈ వయస్సులో వెన్నెముకపై సామర్థ్యానికి మించి భారం వేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరి స్తున్నారు. వెన్నుముక, మెడ నొప్పులు వచ్చే ప్రమాదం ఉంద ని చెబుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు.

అమలుకు నోచుకోని చట్టాలు..

ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పాఠ్యపుస్తకాల బరువు తగ్గించా లని ప్రభుత్వం 2006లోనే చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ, అది అమలుకు నోచుకోవ డం లేదు. విద్యార్థి శరీర బరువులో 10 శాతం మాత్రమే పాఠ్యపుస్తకాలు ఉండేలా ఆ చట్టం చెబుతోంది. విద్యార్థి సుమారు 14కిలోలు ఉన్నాడనుకుంటే ఆవిద్యార్థి తీసుకెళ్లే బ్యాగు మాత్రం 4 కిలోలు ఉంటుంది. దాన్ని మోసేందుకు విద్యార్థి అష్టక ష్టాలు పడాల్సిన పరిస్థితి. ప్రైవేటు పాఠశాలలు నాలుగైదు అంతస్థుల్లో ఇరుకిరుకు గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. దాంతో విద్యార్థులు పుస్తకాల బ్యాగులతో అన్ని అంతస్థులు ఎక్కాల్సిందే.

వెన్నుముకపై భారం పడుతుంది



డాక్టర్ సోమశేఖర్, ఎండీ సర్జన్

చిన్న వయసులోనే విద్యార్థులు అధిక పుస్తకాలు గల బ్యాగులు మోయడంతో బరువు నేరుగా వెన్నెముకపై పడుతుంది. ఎంతో సున్నితమైన ప్రదేశంలో మనకు తెలియకుండా రోజు రోజుకు భారం పెరగడంతో ఒక్కసారిగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. బోధన విధానం, చదువుకునే తీరు కూడా సమయాన్ని బట్టి అనుసరించాలి. ఆడుకునే సమయంలో ఆడుకోకుండా చదవడమే చేస్తే మానసికంగా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారు.

పిల్లలపై ఒత్తిడి తగ్గించాలి



గాండ్ల కుమార్, వర్ధన్నపేట

పిల్లలపై పుస్తకాల బరువుతో పాటు మానసికంగా కూడా పాఠశాలల యాజమాన్యాలు ఒత్తిడి తెస్తున్నాయి. చిన్న వయసులో ప్రశాంతంగా ఉండాల్సిన విద్యార్థులు పేజీల కొద్దీ పుస్తకాలు తిరగేస్తూ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయడంలో విఫలమైంది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రైవేటు పాఠశాలలపై ఎల్లప్పుడు నిఘా పెంచితే వారి ఆగడాలను అరికట్టవచ్చు.

నోట్ బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందజేస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, జూలై 1 : అవసరార్థులకు, అనాథ విద్యార్థులకు సేవ చేయడం భగవంతునికి సేవ చేసినట్లేనని ప్రముఖ వ్యాపారవేత్త, సంజీవని మెడికల్ స్టోర్స్ అధినేత రేణుకుంది శ్రీనివాస్ అన్నారు. రికార్డు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండలో నోటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ 24 సంవత్సరాల నుంచి రికార్డ్ సర్వీస్ సేవా కార్యక్ర మాలు చేస్తోందన్నారు. అతిథుల చేతుల మీదుగా రూ. 8 వేల విలువైన నోటు పుస్తకాలను పం పిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కుసుమ సురేశ్, అయితా వేణుగోపాల్, కుసుమ రమేశ్, కుసుమ ప్రకాశ్, శ్రీనివాస్, పిచ్చిరెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయిం బర్స్‌మెంట్, స్కాల ర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శులు ఊట్కూర్ ప్రణీత్‌గౌడ్, భాషబోయిన సంతోష్ డి మాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు ఎదుర్కొం టున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి కాసరబోయిన రవితేజ, నాయ కులు అఖిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీల బదిలీల ఉత్తర్వులు

వరంగల్‌లో 460, హనుమకొండలో 319 మంది బదిలీ

పండిట్లు, పీఈటీలకు ఇంకా అందని బదిలీల ఉత్తర్వులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో చివరి అంకం ముగియనుంది. ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు వెలువడడంతో ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. సోమవారం ఎస్జీటీలు బదిలీల ఉత్తర్వులను సంబంధిత అధికారుల నుంచి అందుకొని వారికి కేటాయించిన పాఠశాలలో చేరారు. అయితే ఎస్జీటీ తత్సమాన అర్హత కలిగిన లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలకు మాత్రం సోమవారం సాయంత్రం వరకు బదిలీల ఉత్తర్వులు వెలువడకపోవడంతో బదిలీల అంకం ఇంకా ముగియలేదు. పండిట్లు, పీఈటీలు సోమవారం రాత్రి వరకు బదిలీల ఉత్వర్వుల కోసం వేచి చూశారు. వరంగల్ జిల్లాలో 460 మంది ఎస్జీటీలు బదిలీ కాగా 22 మంది ఎల్పీలు, పీటీలకు బదిలీల ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. హనుమకొండ జిల్లాలో 319 మంది ఎస్జీటీలు బదిలీల ఉత్తర్వులు అందుకోగా 33 మంది పండిట్లు, పీటీలు బదిలీల ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే సోమవారం అర్ధరాత్రికల్లా వారికి బదిలీల ఉత్తర్వులు అందుతాయని విద్యాశాఖాధికారులు వెల్లడించారు.

శ్రీనివాస్ కాలనీలో చోరీ

వరంగల్ క్రైం, జూలై 1 : కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ శ్రీనివాస్ కాలనీలో చోరీ జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న బాలాజీనాయక్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఊరెల్లాడు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా నుంచి 8తులాల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

డీఎస్సీ వాయిదా వేయాలని ఆందోళన

బాలసముద్రం, జులై1: డీఎస్సీ వాయిదా వేసి మెగా డీఎస్సీ నిర్వహించాలని ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా గ్రంథాలయం ఎదుట డీఎస్సీ అభ్యర్థులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ మాట్లాడుతూ రాష్ట్రం కోసం పోరాడిన నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 25 వేల ఉపాధ్యాయులను నియమించాలన్నారు. గ్రూప్-2, 3లో ఉద్యోగాల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేశ్, కాకతీయ యూనివర్శిటీ ఇంచార్జి మచ్చ పవన్, కళ్యాణ్, లక్ష్మణ్ సాయి, కిరణ్, నవ్య పాల్గొన్నారు.

వేధింపులకు గురయ్యే మహిళలకు అండగా నిలుస్తాం

హనుమకొండ టౌన్, జూలై 1 : వేధింపులకు గురయ్యే మహిళలకు, బాలికలకు సఖి వన్ స్టాప్ కేంద్రం అండగా ఉంటుందని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. హనుమకొండలోని వన్ షాపింగ్ మాల్‌లో పని చేస్తున్న మహిళలకు సోమవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలు లైంగిక వేధింపులకు గురి అవుతున్నారని అలాంటి వారి కోసం ప్రభుత్వం ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ యాక్టు తీసుకరావడం జరిగిందన్నారు వివిధ సమస్యలపై సహాయం కోసం సఖి వన్ స్టాప్ కేంద్రానికి వచ్చే బాధితులకు న్యాయ, పోలీస్, తాత్కాలిక వసతి, వైద్య సహాయంను ఉచితంగా అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని సమస్యలున్న మహిళలు ఉపయోగించుకుకోవాలని, అందుకోసం 0870-2452112, 181 లో సంప్రదించవచ్చాన్నారు.

రోడ్డును ఆక్రమించి ఇళ్లను నిర్మిస్తున్నారు

ప్రజావాణిలో ప్రజల వినతి

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

బల్దియా గ్రీవెన్స్‌లో కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 1 : కొన్ని కాలనీల్లో కబ్జాదారులు రోడ్డును ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారనీ, పలు కాలనీల్లో డ్రైయినేజీ నీటి సమస్యల ఉన్నాయని ఇలా ప్రజల ఫిర్యాదులతో బల్దియా ప్రజావాణి (గ్రీవెన్‌సెల్) కార్యక్రమంలో బల్దియా కౌన్సిల్ హాల్‌లో సోమవారం కొనసాగింది. ప్రజలు నేరుగా గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్‌తో పాటు వివిధ వింగ్ అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతీ వారం గ్రీవెన్స్ ద్వారా స్వీరించిన ఫిర్యాదులపై తక్షణమే పరిష్కారం చూపాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. మొత్తంగా సోమవారం ఒక్క రోజే 81 ఫిర్యాదులు అందినట్టు బల్దియా పీఆర్వో అయూబ్ ఖాన్ వెల్లడించారు. ఇటీవల వరంగల్‌లో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసిన సిబ్బందిని కమిషనర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, సీపీ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, టీపీఆర్‌వో రాజేశ్‌కుమార్, డిప్యూటి కమిషనర్ కృష్ణారెడ్డిలతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

● హనుమకొండ హంటర్‌రోడ్డులోని గాయత్రి కాలనీలో గత నాలుగు మాసాలుగా ఇండ్ల మధ్యలో ఓ ఇంటిని లాడ్జీ (గెస్ట్‌హౌస్)గా చేసి ఇండ్ల మధ్యలో వ్యభిచారం చేయిస్తున్నారని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.

● గ్రేటర్ 3వ డివిజన్ ఆరెపల్లి శివారులోని భీరన్న దేవాలయానికి సంబంధించిన సుమారు 13 గుంటల దేవుని భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమించి కట్టడాలు జరుపుతున్నారని కురుమ సంక్షేమ సేవా సమితి నాయకులు ఫిర్యాదు చేశారు.

● బల్దియా పరిధిలోని రోడ్డు, డ్రైనేజీలతో పాటు పలు అబివృద్ధి పనులు చేసి చాలా రోజులు గడుస్తున్నా బిల్లులు ఇవ్వడం లేదని పెండింగ్ బి ల్లులు తక్షణమే చెల్లించాలని జీడబ్ల్యుఎంజీ కాం ట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు ఫిర్యాదు చేశారు.

● హనుమకొండ 41వ డివిజన్ నాగేంద్రనగర్‌లో మునిసిప్ నిబంధనల ప్రకారం లేఫ్లాట్లలో సుమారు 30 ఇండ్లు నిర్మించుకున్నాం. కానీ ఇటీవల ఓ వ్యక్తి తమ ఇళ్లకు వచ్చే 20 ఫీట్ల రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నాడని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు.

● వరంగల్ పడమరకోట దళితవాడలో గత వారం రోజులుగా మంచి నీరు రాకపోవడం వల్ల ప్రజలు తండ్లాడుతున్నారని కాలనీ ప్రజలు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.



బిల్లులు చెల్లించాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంట్రాక్టర్లు

● గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ సురేంద్రపురి కాలనీలో 2 ఎకరాల స్థలంలో ఓ వ్యక్తి అనధికారిక నిర్మాణాలు చేపడుతున్నాడు. మున్సిపాలిటీ నిబంధనలు అతిక్రమించి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేం దుకు స్థలం వదిలి వేయకుండా కట్టడాలు జరు పుతున్నాడని ఫిర్యాదు చేశారు.

ఇంజనీరింగ్ - 25, హెల్త్ అండ్ శానిటేషన్ - 06, ప్రాపర్టీ ట్యాక్స్ - 09, టౌన్‌ప్లానింగ్ - 41 మొత్తంగా 81 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు.

ఫలితాలలో పింగిళి కళాశాల ప్రథమ స్థానంలో నిలవాలి

కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ

వడ్డెపల్లి, జూలై 1 : ఫలితాలలో పింగిళి కళాశాల ప్రథమ స్థానంలో నిలపాలని కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్‌ల ఫలితాలను హైదరాబాద్‌లోని సెక్రెటరియేట్‌లో గల తన చాంబర్‌లో క్యూ ఆర్ కోడ్ విధానంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాకాటి కరుణ మాట్లాడుతూ పింగిళి కళాశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. చంద్రమౌళి, కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ యాదగిరి, ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్, అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ ప్రొఫెసర్ బాల భాస్కర్, కళాశాల పరీక్షల విభాగం అధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి, అడిషనల్ కంట్రోలర్లు డాక్టర్ రేణుక, శిరీష, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అకాడమీక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పార్వతి, అధ్యాపకులు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ తిరువెంగళాచారి పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న వాకాటి కరుణ, ప్రిన్సిపాల్

రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతికత బీఆర్ఎస్ నేతలకు లేదు

వరంగల్ నగరాభివృద్ధిపై ముఖ్యమంత్రిది ప్రత్యేక విజన్

అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే నాయిని పని చేస్తున్నారు

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్

హనుమకొండ సిటీ, జూలై 1 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతికత బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎండీ అజీజ్‌ఖాన్ ధ్వజమెత్తారు. సోమవారం హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. ప్రభుత్వ ఖర్చులతో వరంగల్‌కు వచ్చి ఓ ప్రయివేట్ ఆసుపత్రిని ప్రారంభించడం ఏమిటంటూ బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ మహానగర అభివృద్ధిపై ప్రత్యేక విజన్‌తో ఉన్నరన్నారు. ఈ కోణంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్యమంత్రిని నగరానికి ఆహ్వానించారని చెప్పారు. ఈ పరిణామాల క్రమంలో నగరాభివృద్ధిపై సమీక్ష జరిపి తద్వారా అభివృద్ధి నిర్ణయాలు తీసుకునేందుకు రేవంత్‌రెడ్డి వరంగల్‌కు రావడం ఆ క్రమంలోనే ప్రయివేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవం జరుపడం జరిగిందన్నారు. అంతే కానీ ప్రత్యేకంగా ఆసుపత్రి ప్రారంభోత్సవానికే రాలేదని దీనిపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. గతంలో బీఆర్ఎస్ నేతకు చెందిన ఆసుపత్రిని ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్ వరంగల్ వచ్చారని గుర్తు చేశారు. అప్పుడు బీఆర్ఎస్ నేతల నోళ్లకు తాళం పడిందా అని ప్రశ్నించారు. నగరం ముంపునకు గురైన ఎమ్మెల్యేగా వినయ్‌భాస్కర్ స్పందిం చలేదన్నారు. 15 ఏళ్లలో నగరానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. భద్రకాళి మాఢ వీధులు, నయీం నగర్ బ్రిడ్జి తదితర అభివృద్ధి పనులను కమిషన్లకు కక్కుర్తి పడి విస్మరించారని ఆరోపించారు. వినయ్‌భాస్కర్ వ్యవహారశైలి నచ్చకనే ఆయనను చాలా మంది బీఆర్ ఎస్ నేతలు వీడి కాంగ్రెస్‌లో చేరడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని కబ్జాలే జరిగాయన్నారు. ఆరు నెలల కాంగ్రెస్ పాలనలో కాం గ్రెస్ ఎమ్మెల్యేలపై ఒక్క కబ్జా ఆరోపణలు రాలేదని చెప్పారు. అభివృద్ధి, ప్ర జా సంక్షేమమే ధ్యేయంగా పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పని చేస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మెల్యేగా ఉన్న సమ యంలో వినయ్‌భాస్కర్ నగరా న్ని ఏమాత్రం పట్టిం చు కోకుండా ముంచాడని జీడబ్ల్యూ ఎంసీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న విమర్శిం చారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. రూ.50 లక్షలకు మించి నిధుల విడుదల కాలేదన్నారు. ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇవ్వని ఘనత ఆయనకే దక్కిందన్నారు. కాంగ్రెస్ నాయకులు బోడ డిన్నా మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని అణచి వేశా డని ఆరోపించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు శ్రీమాన్, మానసా రామ్ ప్రసాద్, విజయలక్ష్మితో పాటు అబూబాకర్, విద్యాసాగర్, రవీందర్, నాగరాజు, స్వామిచరణ్, బి స్నీ లక్ష్మణ్, నసీంజహాన్,, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎండీ అజీజ్‌ఖాన్

వైద్యులు దైవంతో సమానం..

రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి



డాక్టర్లను సన్మానిస్తున్న రెడ్ క్రాస్ పాలక వర్గం ప్రతినిధులు

సుబేదారి, జూలై 1: వైద్యులు దైవంతో సమానమని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని రెడ్ క్రాస్ భవన్‌లో డాక్టర్స్ డే వేడుకలను పురస్కరించుకొని సోమవారం రెడ్ క్రాస్ పాలక వర్గ సభ్యుల ఆధ్వర్యంలో డాక్టర్ బిధాన్‌చంద్రరాయ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ చైర్మన్ విజయ్ చందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకించి కోవిడ్ -19 మహమ్మారి వంటి సమయంలో వైద్యులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రోగులకు సేవలు చేసి కాపాడారని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలక వర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాసరావు, రక్తదాతలు మధురబోయిన రాజ్‌కుమార్, గణేష్, సనత్, ప్రణయ్, హర్షిత, వంశీ, సంతోష్, సన్ని, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూ బ్లడ్ యాప్ ఆవిష్కరణ

వరంగల్ మెడికల్ : ప్రస్తుత సమాజంలో వైద్యుల పాత్ర చాలా ముఖ్యమైందని సీనియర్ సర్జన్ డాక్టర్ కూరపాటి రమేశ్ అన్నారు. సోమవారం యూ బ్లడ్ యాప్‌ను డాక్టర్ రమేశ్, సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ కూరపాటి రాధిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపత్కాల సమయంలో పేషంట్లకు యూ బ్లడ్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. యూ బ్లడ్ యాప్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం యూ బ్లడ్ యాప్ సృష్టికర్త డాక్టర్ యలమంచిలి జగదీష్‌బాబుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

రైల్వే డాక్టర్లకు సన్మానం

కాజీపేట : డాక్టర్ డేను పురస్కరించుకుని సోమవారం కాజీపేట రైల్వే ఆసుపత్రిలో ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్లను సన్మానించారు. సీనియర్ డీఎంవో డా. నిరంజన్, డా.నరేందర్ హిర్వాని, డా. యాకుబ్, డా. కె. వినయ్ బాబులకు శాలువాలు కప్పిపూలమాలలు వేసి ఘనంగా సన్మానించి వారిచేసిన సేవలను కొనియాడారు. డివిజన్ అధ్యక్షుడు బి. వీరన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్. తిరుపతి, కార్మిక నాయకులు ఆర్‌కే స్వామి, జకరియా, ధన్‌రాజ్, ఎన్. వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



యూ బ్లడ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

వైద్యులు అంకితభావంతో పని చేయాలి

ఏఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్



డాక్టర్స్ డే వేడుకల్లో పాల్గొన్న వైద్యులు

వరంగల్ మెడికల్, జూలై 1 : వైద్యులు అంకితభావంతో పని చేయాలని ఏఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్ అన్నారు. సోమవారం రాత్రి వరంగల్‌లోని ఐఎంఏ హాలులో డాక్టర్స్ డే దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిసి.రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కాళీప్రసాద్ మాట్లాడుతూ నైతిక విలువలతో పేద ప్రజలకు సేవలందించడమే వైద్యుల లక్ష్యమన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో సైతం రోగులకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అన్వర్, శ్రీనివాస్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ఐఎంఏ రాష్ట్ర ప్రతినిధులు శేషుమాధవ్, విజయచందర్‌రెడ్డి, నల్లా సురేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సుదీప్, బందెల మోహన్‌రావు, సుధీర్, కొత్తగట్టు శ్రీనివాస్, నాగార్జునరెడ్డి, కంకణాల మల్లేశం, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక గణాంక దర్శిని ఆవిష్కరణ

హనుమకొండ కలెక్టరేట్, జూలై 1 : జిల్లా గణాంక దర్శిని డిస్ట్రిక్ట్ హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ 2022-23 పుస్తకాన్ని కలెక్టర్ పి. ప్రావీణ్య సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ గణాంక దర్శినిలో 20 చాప్టర్లు, 187 టేబుల్స్‌ను జిల్లాకు చెందిన వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల నుంచి సేకరించి పొందుపరిచారు. ఇందులో జనాభా, వాతావరణం, ఆరోగ్య, కుటుంబ, సంక్షేమం, విద్య, రవాణా, బ్యాంకింగ్, ఎకానమి, సోషల్ సెక్యూరిటీకి సంబంధించిన అంశాలు వివరంగా ఉన్నాయి. గణాంక దర్శిని పుస్తకాన్ని రూపొందించిన ముఖ్య ప్రణాళిఖాధికారి బి. సత్యనారాయణరెడ్డిని, సిబ్బందిని ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. గణాంకదర్శిని పుస్తకాన్ని ఆవిష్కరించిన వారిలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, కలెక్టరేట్ ముఖ్య ప్రణాళికాధికారి బి. సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.

ఉద్యోగికి పదవి విరమణ అనివార్యం : కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, జూలై 1 : ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ అనివార్యమని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ హరప్రసాద్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబుల పదవి విరమణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందుతున్న అధికారులను శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో మెరుగైన సేవలు అందించే అధికారులకు మంచి గుర్తింపు ఉంటుదన్నారు. ఎన్నో సవాళ్లతో కూడుకుని ఉన్న ప్రభు త్వ ఉద్యోగాన్ని సంపూర్ణంగా చేసి పదవి విరమణ పొందడమే గొప్ప విజయమని, పదవి విరమ ణ పొందుతున్న ప్రతీ ఉద్యోగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, డీఆర్‌ఓ గణేష్, ఆర్‌డీఓ వెంకటేష్ అధికారులు పాల్గొన్నారు.

భరోసా కేంద్రం బాధితులకు అండగా ఉండాలి

వరంగల్ క్రైం, జూలై 1 : లైంగిక దాడులకు గురైన బాధితులకు భరోసా కేంద్రం అండగా నిలువాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. భరోసా కేంద్రం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా వరంగల్ రంగంపేటలోని భరోసా కేంద్రాన్ని సోమవారం అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. భరోసా కేంద్రం సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన నష్ట పరిహారం చెక్కులు, కుట్టు మిషన్లు కమిషనర్ అందచేశారు. అనంతరం షీ టీం పోలీస్ స్టేషన్ సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భరోసా కేంద్ర ఇన్స్‌పెక్టర్ సువర్ణ, షీ టీం ఇన్స్‌పెక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

'ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలి'

మడికొండ, జూలై 1: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించి అధికోత్పత్తిని సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్ అన్నారు. సోమవారం కాజీపేట దర్గా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) సర్వసభ్య సమావేశం గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ భట్టుపల్లిలోని రైతు వేదిక వద్ద పీఏసీఎస్ వైస్ చైర్మన్ మాదాసు బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని కోరారు. జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్‌ను పీఏసీఎస్ పాలక వర్గం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాజీపేట మండల వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఈగ వెంకటేశ్వర్లు, ఏఈవో భరత్, పీఏసీఎస్ డైరెక్టర్లు లింగం నరేందర్‌రెడ్డి, పుల్యాల సంపత్‌రెడ్డి, కాయిత రాజ్‌కుమార్ యాదవ్, మేరుగు రాజయ్య, సుల్తాన్ వెంకన్న, సీఈవో భూపాల్‌రెడ్డి, సిబ్బంది జ్ఞానేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డి, వినోద్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ

హనుమకొండటౌన్, జూలై1: హనుమకొండ పోలీస్‌స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో సీపీ ముచ్చటించారు. అనంతరం సీసీ కెమెరాల పనితీరు, సీసీటీఎన్ఎస్ రిసెప్షన్ పనితీరును అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రజలతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బందికి సీపీ సూచించారు.

సైక్లింగ్ పోటీల్లో హెడ్ కానిస్టేబుల్‌కు మెడల్

మడికొండ, జూలై 1: కేరళ రాష్ట్రానికి చెందిన కన్నూర్ సైకిల్ అసోసియేషన్ వారు సమ్మర్ సైక్లింగ్ ఛాలెంజ్ పేరుతో 40 రోజులలో 1000 కిలో మీటర్లు ఆన్‌లైన్ సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. మడికొండ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గుండబత్తిన జయరాజ్ ఈ పోటీలలో పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. ఇందుకు గాను నిర్వాహకులు ఆయనకు మెడల్‌తో పాటు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. సోమవారం మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ చేతుల మీదుగా జయరాజ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాలు, సైక్లింగ్ పోటీలలో పాల్గొంటూ యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్న జయరాజ్‌ను ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు రాజబాబు, దివ్య, పోలీస్ సిబ్బందితో పాటు పలువురు అభినందించారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సన్మానం

వరంగల్ క్రైం, జులై 1: వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించి ఉద్యోగ విమరణ పొందిన పలువురు పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కమిషనర్ హాజరయ్యారు. ఉద్యోగ విమరణ పొందిన ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రవి, యాదగిరి, ఎఎస్ఐలు సాంబయ్య, ప్రభాకర్‌లను కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించారు.

వర్షాకాలంలో గాల్లో తేమ ప్రభావం చెవుల్లోని గులిమి మీద కూడా పడుతూ ఉంటుంది. అది మరింత మెత్తబడి, ఫంగస్ పెరుగుదలకు అనువుగా మారిపోతుంది. దాంతో చెవిలో దురద, నొప్పి, దిబ్బెడ, బ్లాక్ అయిపోవడం, చెవిలో సమస్య ఉన్న వైపు తలనొప్పి, నోరు తెరవడంలో ఇబ్బంది, చెవిలో గుయ్యిమని శబ్దం రావడం లాంటి లక్షణాలు మొదలవుతాయి.



ఉమెన్స్ హెల్త్

పెరిగే వయసుతో పాటు మహిళల్లో ఈస్ట్రోజన్ హార్మోన్ స్రావం తగ్గుముఖం పడుతుంది. ఎముకల దృఢత్వం మొదలు, మానసిక సంతులనం వరకూ ఎన్నో కోణాల్లో మహిళల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ఈ హార్మోన్ లోపాలు, సరిదిద్దే మార్గాల గురించి తెలుసుకుందాం!

ఆ హార్మోన్ తగ్గితే?

ఈ హార్మోన్ అండాశయాల్లో తయారవుతుంది. కాబట్టి అండాశయాల మీద ప్రభావం చూపించే అంశాలన్నీ ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తికి ప్రతిబంధకంగా మారతాయి. అవేంటంటే...

- అవసరానికి మించిన వ్యాయామం
- తీవ్రమైన మూత్రపిండాల వ్యాధి
- టర్నర్ సిండ్రోమ్ (ఒకే ఎక్స్ క్రోమోజోమ్‌తో ఆడపిల్లలు పుట్టడం)
- పిట్యుటరీ గ్రంథి మందకొడిగా పని చేయడం
- అనరెక్సియా (ఈటింగ్ డిజార్డర్)
- ప్రిమెచ్యూర్ ఒవేరియన్ ఫెయిల్యూర్ లేదా మరేదైనా ఆటోఇమ్యూన్ డిజార్డర్
- అండాశయాలకు రక్తసరఫరాలో అడ్డంకులు ఏర్పడడం
- మెగ్నీషియం లోపం
- కుటుంబ నియంత్రణ మాత్రలతో ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ హార్మోన్ల ఉత్పత్తి తగ్గడం
- హైపోథైరాయిడిజం
- ఈస్ట్ ఓవర్‌గ్రోత్

లోపాన్ని తెలిపే లక్షణాలు

ప్యూబర్టీకి చేరువవుతున్న ఆడపిల్లల్లో, మెనోపాజ్‌కు చేరువవుతున్న మహిళలో ఈస్ట్రోజన్ హార్మోన్ లోపం తలెత్తుతుంది. అయితే అన్ని వయసుల మహిళల్లో కూడా ఈ సమస్య తలెత్తే అవకాశాలు లేకపోలేదు. అయితే ఈస్ట్రోజన్ హార్మోన్ తగ్గినప్పుడు, మహిళల్లో ఈ లక్షణాలు కనిపిస్తాయి.

- ఒంటి నుంచి వేడి ఆవిర్లు
- భావోద్వేగాలు అదుపు తప్పడం
- మానసిక కుంగుబాటు
- తలనొప్పులు
- అలసట
- ఏకాగ్రతా లోపం
- నెలసరి సమస్యలు
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు
- ఎముకల బలహీనత

ఇలా పెంచుకోవచ్చు

తగ్గిన ఈస్ట్రోజన్ హార్మోన్ మోతాదును పెంచుకునే ప్రత్యామ్నాయాలున్నాయి. ఇందుకోసం వైద్యుల పర్యవేక్షణలో



పిల్స్, జెల్స్ వాడుకోవచ్చు. అయితే సహజసిద్ధంగా శరీరంలో ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తయ్యేలా మార్గాలను అనుసరించడం అన్నిటికంటే ఉత్తమం ఇందుకోసం...

- **ఫైటో ఈస్ట్రోజన్స్:** ఈ పోషకాలు ఉండే ఆహారాన్ని తింటూ ఉండాలి. టోఫు, సోయా, బఠాణీలు, అప్రికాట్స్ బ్రొకోలి, కాలీఫ్లవర్, ఫ్లాక్స్ సీడ్స్, గుమ్మడి విత్తనాలు, పెసర మొలకల్లో ఫైటో ఈస్ట్రోజన్స్ ఉంటాయి.
- **చక్కెర:** చక్కెర తినే అలవాటు హార్మోన్లలో అవకతవకలకు దారి తీస్తుంది. అలాగే చక్కెర ఈస్ట్ ఓవర్‌గ్రోత్‌ను ప్రేరేపిస్తుంది. ఈ ఈస్ట్‌కు సంబంధించిన టాక్సిన్లు హార్మోన్ ఉత్పత్తికి తోడ్పడే హార్మోన్ రిసెప్టార్ సైట్లను బ్లాక్ చేస్తాయి. కాబట్టి చక్కెర తినడం తగ్గించాలి.
- **మెగ్నీషియం:** ఈ పోషకంతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఈస్ట్రోజన్ ఉత్పత్తి పెరుగుతుంది. అలాగే కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు (చిలగడ దుంపలు), సహజసిద్ధ మూలికలు (తులసి, సేజ్, పుదీనా)లను తీసుకుంటే సెల్ రిసెప్టివిటీ పెరిగి ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి పెరుగుతుంది.
- **బరువు:** తక్కువ బరువు ఉన్నా శరీరం సరిపడా ఈస్ట్రోజన్ హార్మోన్‌ను తయారు చేసుకోలేదు. హార్మోన్లను తయారు చేసుకోవడం కోసం శరీరంలో సరిపడా కొవ్వు ఉండడం అవసరం.
- **వ్యాయామం:** అవసరానికి మించిన వ్యాయామం ఈస్ట్రోజన్ ఉత్పత్తిని తగ్గిస్తే, క్రమం తప్పకుండా సరిపడా వ్యాయామం చేయడం వల్ల తగినంత ఈస్ట్రోజన్ శరీరంలో ఉత్పత్తి అవుతూ రొమ్ము కేన్సర్ నుంచి రక్షణ దక్కుతుంది. కాబట్టి క్రమం తప్పక పరిమితంగా వ్యాయామం చేయాలి.
- **ద్రవాహారం:** నీళ్లు, పండ్లు, కూరగాయల రసాలు, గ్రీన్ టీ, కొబ్బరినీళ్లు, మజ్జిగ తరచుగా తీసుకోవడం వల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకు వెళ్లిపోయి, ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గి, హార్మోన్ల ఉత్పత్తి మెరుగవుతుంది.

ఈస్ట్రోజన్ పెరిగితే?

కొందర్లో అవసరానికి మించి ఈస్ట్రోజన్ హార్మోన్ పెరుగుతుంది. ఈ పరిస్థితిని ఈస్ట్రోజన్ డామినెన్స్ అంటారు. దీన్ని కొన్ని లక్షణాల ఆధారంగా గుర్తించే వీలుంది. అవేంటంటే...

- కడుపు ఉబ్బరం
- భావోద్వేగాలు అదుపు తప్పడం
- తలనొప్పులు
- నెలసరి సమస్యలు
- అరిచేతులు, అరికాళ్లు చల్లబడడం
- బరువు పెరగడం
- వెంట్రుకలు రాలిపోవడం
- యాంగ్జయిటీ/ప్యానిక్ ఎటాక్స్
- అలసట
- జ్ఞాపకశక్తి సమస్యలు
- రొమ్ముల సలపరం





ఇయర్ ఇన్‌ఫెక్షన్స్

తాళాలు, పిన్నీసులు, అగ్గి పుల్లలు, ఇయర్ బడ్స్... ఏంటివన్నీ అనుకుంటున్నారా? చెవుల్లో దురదను దూరం చేయడం కోసం... ఎక్కువ మంది ఉపయోగించే సాధనాలివే! వీటితో దురద తగ్గడం మాట అటుంచి, చెవులకు శాశ్వత నష్టం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు వైద్యులు

ప్రమాదం పొంచి ఉంది

చెవుల్లో గులిమి సర్వసాధారణం. ఈ సేంద్రీయ పదార్థం దానంతటదే తయారవుతూ, దానంతటదే బయటకు వచ్చేస్తూ ఉంటుంది. జిడ్డు చర్మం వాళ్లకు జిడ్డుగా, పొడి చర్మం వాళ్లకు పొడిగా గులిమి తయారవుతూ ఉంటుంది. కానీ దీని గురించి అవసరానికి మించి బెంగ పడేవాళ్లు ఉంటూ ఉంటారు. దురద పెట్టిందనో, చెవిలో అసౌకర్యంగా ఉందనో, చేతికందిన వస్తువులతో చెవుల్లో తిప్పేసుకుంటూ ఉంటారు. మరీ ముఖ్యంగా వర్షాకాలంలో గాల్లో తేమ ప్రభావం చెవుల్లోని గులిమి మీద కూడా పడుతూ ఉంటుంది. అది మరింత మెత్తబడి, ఫంగస్ పెరుగుదలకు అనువుగా మారిపోతుంది. దాంతో చెవిలో దురద, నొప్పి, దిబ్బెడ, బ్లాక్ అయిపోవడం, చెవిలో సమస్య ఉన్న వైపు తలనొప్పి, నోరు తెరవడంలో ఇబ్బంది, చెవిలో గుయ్యిమని శబ్దం రావడం లాంటి లక్షణాలు మొదలవుతాయి. ఇది పెద్దల్లో, పిల్లల్లో ఇద్దర్లో కనిపిస్తుంది. ఇలాంటి సందర్భాల్లో ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి.



చెవుల్లో పుల్లలు

చెవి నిర్మాణం ఇంగ్లీషు అక్షరం 'ఎస్' ఆకారంలో ఉంటుంది. మనం చెవిలో పిన్నీసులు, అగ్గిపుల్లలు, ఇయర్‌బడ్స్ లాంటివి ఏవి పెట్టినా అవి ఏ డైరెక్షన్‌లో వెళ్తుందో మనకు తెలియదు. వీటితో చెవి లోపల తిప్పుకోవడం వల్ల ఇయర్ కెనాల్, కర్ణభేరి.. రెండూ దెబ్బతింటాయి. మరీ ముఖ్యంగా వినికిడికి పనికొచ్చే చెవిలోని ఎముకలు కూడా దెబ్బతింటాయి. కొంతమందికి చెవిని శుభ్రం చేస్తూ ఉండాలనే నమ్మకం ఉంటుంది. దాంతో ఇయర్ బడ్స్‌తో చెవులను శుభ్రం చేస్తూ ఉంటారు. కానీ ఇలా చేయడం వల్ల గులిమిని మరింత లోపలికి నెట్టినవాళ్లమవుతాం! నిజానికి చెవుల్లోని గులిమి సహజసిద్ధంగా, దానంతట అదే బయటకు వచ్చేస్తుంది. దాన్ని శుభ్రం చేసుకోవడంలో తప్పు లేదు. ఒకవేళ పొడి గులిమి గట్టిపడి అడ్డుపడితే, వైద్యులను కలిసి శుభ్రం చేసుకోవాలి. డాక్టరుని కలిసే ముందు చెవిలో డ్రాప్స్ వేసుకుని వెళ్తే, మెత్తపడిన గులిమిని వైద్యులు తేలికగా తొలగించగలుగుతారు. ఇలా కాకుండా మనంతట మనమే శుభ్రం చేసుకునే ప్రయత్నం చేస్తే, పొడి గులిమి, చెవి లోపలే రాయిలా తయారైపోతుంది.

చెవిలో నూనె?

శరీర చర్మం ఎలా ఉంటుందో, చెవి లోపలి చర్మం కూడా అలాగే ఉంటుంది. మనది పొడి చర్మమైతే, మాయిశ్చరైజర్లు, నూనెలు పూసుకున్నట్టే, చెవి లోపల చర్మాన్ని కూడా నూనెతో మాయిశ్చరైజ్ చేయడం మంచిదే! అయితే అందుకోసం ప్రతి రోజూ, చెవిలో నూనె చుక్కలు వేసుకోవలసిన అవసరం లేదు. నెలలో ఒకట్రెండుసార్లు వేసుకుంటే సరిపోతుంది. అయితే అప్పటికే చెవి ఇన్‌ఫెక్షన్ ఉన్నవాళ్లు నూనె వేసుకోకూడదు. కొందరికి చెవిలో గులిమి పొడిగా ఉంటే, ఇంకొందరికి జిగటగా ఉంటుంది. పొడిగా ఉన్న వాళ్లకు చెవిలో దురద ఉండొచ్చు. ఇలాంటివాళ్లు చెవిలో నూనె వేసుకోవచ్చు.

ఫంగస్‌లు పెరిగితే....

స్నానం చేసినప్పుడు చెవిలోకి వెళ్లిన నీళ్లను శుభ్రం చేసుకోవడం కోసం ఇయర్‌బడ్స్‌ను ఉపయోగిస్తూ ఉంటాం. కానీ నిజానికి ఇలా చేయడం వల్ల ఇన్‌ఫెక్షన్‌ను మరింత ప్రేరేపించిన వాళ్లమవుతాం! అప్పటికే చెవిలో ఫంగస్ పెరుగుతుంటే, నీళ్లు తగలడం వల్ల దాని ఉధృతి పెరిగిపోతుంది. కాబట్టి చెవి ఇన్‌ఫెక్షన్ లక్షణాలు పదే పదే వేధిస్తుంటే వెంటనే వైద్యులను కలవాలి. మరీ ముఖ్యంగా చెవిలో చీము సమస్య కలిగి ఉన్నవాళ్లలో ఇయర్ ఇన్‌ఫెక్షన్లు ఎక్కువ. అలాగే మధుమేహులు, కీళ్లవాతం, అవయవ మార్పిడి చేయించుకున్నవాళ్లు, ఇతరత్రా తీవ్ర వ్యాధుల కోసం స్టిరాయిడ్స్ తీసుకునే వాళ్లలో వ్యాధినిరోధకశక్తి స్వతహాగానే తగ్గిపోతుంది. ఇలాంటి వాళ్లలో కూడా చెవి ఇన్‌ఫెక్షన్లు ఎక్కువ. ఇలాంటి వాళ్లు ఇన్‌ఫెక్షన్ మొదలైన వెంటనే వైద్యులను కలవాలి. వైద్యులు ఎండోస్కోపీతో చెవిలో పెరుగుతున్న ఫంగస్‌ను కనిపెట్టి, నోటి మాత్రలు, ఇయర్ డ్రాప్స్‌తో సమస్యను అరికట్టగలుగుతారు. పుట్టగొడుగుల్లా పెరిగే ఈ ఫంగస్ కొందర్లో నల్లగా, ఇంకొందర్లో తెల్లగా, పసుపుపచ్చగా కనిపిస్తుంది. క్యాండిడా, ఆస్పర్‌జిల్లస్ మొదలైన ఫంగస్‌లను వైద్యులు మొదట సక్షన్‌తో క్లీన్ చేసి, యాంటీ ఫంగల్ ఇయర్‌డ్రాప్స్‌ను సూచిస్తారు. వీటికి తోడు నోటి మాత్రలు కూడా వాడుకుంటే ఇన్‌ఫెక్షన్ పూర్తిగా తగ్గిపోతుంది. కొందరికి చెవి వాపు ఉంటే, వాళ్లకు వైద్యులు ఇయర్ విక్‌ను సూచిస్తారు. దీన్ని చెవికి అమర్చి, ఇయర్ డ్రాప్స్ వేసుకోవచ్చు.

పిల్లల్లో ఇలా...

పిల్లల్లో ఈ సమస్య ఎక్కువ. పదే పదే జలుబు



చేయడం వల్ల ముక్కులో నుంచి చెవి వరకూ దారి తీసే ట్యూబ్ ద్వారా చెవి ఇన్‌ఫెక్షన్ మొదలవుతుంది. ఇలాంటప్పుడు విపరీతమైన నొప్పితో పిల్లలు ఏడుస్తూ ఉంటారు. ముఖ్యంగా రాత్రుళ్లు ఏడుస్తూ నిద్ర లేస్తూ ఉంటారు. తల్లులు పసి పిల్లల నోట్లో సిప్పర్‌ను పెట్టి రాత్రుళ్లు అలాగే పడుకోబెట్టేస్తూ ఉంటారు. ఇలాంటి పిల్లల్లో కూడా మధ్య చెవి ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అలాగే పిల్లల్లో అడినాయిడ్స్, టాన్సిల్స్ సమస్యలు కూడా ఎక్కువగా ఉంటాయి. వీళ్లలో జలుబు ఎక్కువ రోజులు తగ్గకపోవడం వల్ల చెవి ఇన్‌ఫెక్షన్లు వస్తూ ఉంటాయి. అలర్జీలు ఉన్న పిల్లల్లో దగ్గు, జలుబుల వల్ల, చెవి ఇన్‌ఫెక్షన్లు పెరిగి, కర్ణభేరికి రంధ్రం పడి, చీము కారే పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది. చిన్న పిల్లలను తరచూ చెవి ఇన్‌ఫెక్షన్లు వేధిస్తూ ఉంటే, స్కానింగ్ ద్వారా అడినాయిడ్స్, సైనసైటిస్, టాన్సిళ్లను పరిశీలించాల్సి ఉంటుంది. ముక్కు ఎముకకు ఇన్‌ఫెక్షన్ సోకలేదని కూడా నిర్ధారించుకోవాలి.

ఇయర్ ఫోన్స్ వాడుతున్నారా?

ఇయర్‌ఫోన్స్ వాడే వాళ్లలో చెవి నుంచి బయటకొచ్చే వ్యాక్స్ లోపలికి నెట్టబడుతూ ఉంటుంది. వృత్తిపరంగా ఎక్కువ సమయాల పాటు ఇయర్ ఫోన్స్, బడ్స్ వాడేవాళ్లు ప్రతి రెండు నెలలకోసారి వైద్యులను కలుస్తూ చెవులను పరీక్షించుకుంటూ ఉండాలి. అలాగే ఇయర్ బడ్స్‌ను ఎక్కువగా వాడేటప్పుడు, చెవి లోపల తేమ పెరిగి, ఫంగస్‌కు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. కాబట్టి ఇయర్‌ఫోన్స్, బడ్స్‌ను తరచూ స్టెరిలైజ్ చేసుకుంటూ ఉండాలి. అలాగే హియరింగ్ ఎయిడ్స్ వాడుకునే పెద్దలు, పిల్లల విషయంలో కూడా ఇదే తరహా జాగ్రత్తలు పాటించాలి.



డాక్టర్ పి.వి.ఎల్.ఎన్ మూర్తి
సీనియర్ కన్సల్టెంట్ ఇఎన్‌టి,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.

ఆయుర్వేదం

కీళ్ల నొప్పులా?



కీళ్లు వాచి, కదల్చలేనంతగా నొప్పి పెడుతూ ఉంటే ఆయుర్వేద చికిత్సలను ఆశ్రయించవచ్చు. వాపు తగ్గి, కదలికలు సులువయ్యేలా చేసే ఆయుర్వేద చికిత్సల్లో ఇవి కొన్ని!

- **ఉలవలు:** 100 గ్రాముల అడవి ఉలవలను పొడి చేసి, 50 గ్రాముల నువ్వుల నూనె కలిపి ముద్ద చేయాలి. ఈ ముద్దతో కీళ్ల మీద పట్టు వేసి, పలుచని వస్త్రం చుట్టాలి. ఇలా రాత్రంతా ఉంచితే ఉదయానికి వాపు, నొప్పి తగ్గుతాయి.
- **అందుగ బంక:** అందుక చెట్టు బంక సేకరించి, 10 గ్రాముల బంకను 100 మిల్లీ లీటర్ల నీళ్లలో కలిపి, సగం అయ్యే వరకూ మరిగించి, చల్లార్చాలి. గోరువెచ్చగా ఉన్నప్పుడు ఈ నీళ్లను తాగాలి. ఇలా వారం రోజులు తాగితే కీళ్ల నొప్పులు అదుపులోకి వస్తాయి.
- **ఆముదం వేరడు:** ఆముదం చెట్టు వేరడు 100 గ్రాములు, రేల చెట్టు వేర్లు 100 గ్రాములు తీసుకుని, ఎండబెట్టి, పొడి చేసుకోవాలి. 30 గ్రాముల చూర్ణాన్ని 200 మిల్లీ లీటర్ల నీళ్లలో కలిపి రాత్రంతా కదలకుండా ఉంచాలి. ఉదయాన్నే ఈ నీటిని పావు వంతు అయ్యేవరకూ మరిగించి, వడగట్టి తాగాలి. ఇలా 20 రోజుల పాటు క్రమంతప్పక చేస్తే కీళ్లనొప్పులు తగ్గుముఖం పడతాయి.

హోమియో

రాళ్లు కరుగుతాయి!



మూత్రపిండాల్లో రాళ్లను హోమియో మందులతో కరిగించే వీలుంది. మూత్రాశయం, మూత్ర నాళం... ఇలా మూత్ర పిండాల్లో రాళ్లు ఎక్కడ ఏర్పడినా, వాటిని కరిగించడానికి తోడ్పడే సమర్థమైన హోమియో మందులు ఇవే!

- **బెర్బెరిస్ వల్గారిస్:** దీన్ని మదర్ టింక్చర్ రూపంలో వాడి మూత్రపిండాలకు సంబంధించిన ఏ రకానికి చెందిన రాయినైనా కరిగించే వీలుంది.
- **లైకోపోడియం:** కుడి వైపు మూత్రపిండంలో రాళ్లను కరిగించడంలో దిట్ట ఇది. మూత్రవిసర్జన చేస్తున్నప్పుడు నొప్పి తగ్గే లక్షణం ఉన్నవారికి ఈ మందు తోడ్పడుతుంది.
- **హైడ్రాంజే ఆర్బొరెసెన్స్:** ఈ మందుకు 'స్టోన్ బ్రేకర్' (రాళ్లను పగలగొట్టేది) అని పేరు. ఈ మందు మూత్రనాళం, మూత్రాశయాల్లో రాళ్లను నలుగగొట్టి, మూత్రం ద్వారా వాటిని బయటకు వెళ్లేలా చేయగలదు.
- **సర్సపరిల్లా:** మూత్రంలో ఇసుకను పోలిన రాళ్లకు ఇది దివ్యమైన ఔషధం.

యోగా



మలబద్ధకం మాయం!

మలబద్ధకం అరుదుగా తలెత్తడం సహజం. అయితే లాక్‌డౌన్ మూలంగా జీవనశైలి క్రమం తప్పి, ఆ కారణంగా మలబద్ధకం తలెత్తడం ఎక్కువమందిని తరచుగా వేధిస్తున్న ప్రస్తుత సమస్య. దీన్నే 'క్వారంటైన్ కాన్‌స్టిపేషన్' అని అంటున్నాం. ఈ ఇబ్బంది తొలగించడానికి ఉపయోగపడే యోగాసనాలు ఉన్నాయి. అవేంటంటే...

- **పవనముక్తాసనం:** విశ్రాంత స్థితిలో వెల్లకిలా పడుకోవాలి. మోకాళ్లను మడిచి, పొత్తికడుపు దగ్గరకు తీసుకురావాలి. రెండు చేతులతో మోకాళ్లను బిగించి, దగ్గరకు లాక్కోవాలి. తలను పైకెత్తి, గడ్డం ఛాతీకి ఆనించాలి. ఈ భంగిమలో 5 సెకండ్ల పాటు ఉండి, తిరిగి యథాస్థితికి రావాలి.
- **మాలాసనం:** కాళ్ల మధ్య ఎడం ఉండేలా నిలబడాలి. మోకాళ్లు వంచి, నేల మీద స్క్వాట్ పొజిషన్‌లో కూర్చోవాలి. చేతులు రెండు జోడించి, మోచేతులు మోకాళ్లకు ఆనేలా శరీరం దగ్గరకు చేతులను తీసుకురావాలి. వెన్ను, మెడ నిటారుగా ఉంచి, భుజాలను రిలాక్స్‌గా ఉంచాలి. ఈ భంగిమలో ఐదు సార్లు శ్వాస తీసుకునేంత సమయం ఉండి యథాస్థితికి రావాలి.
- **బాలాసనం:** మోకాళ్ల మీద కూర్చుని, ముందుకు వంగాలి. పొత్తికడుపు తొడలకు తగిలేలా, తల నేల మీద ఆనేలా ముందుకు వంగాలి. రెండు చేతులను తల మీదుగా చాపి, నేలను తాకించాలి. ఈ భంగిమలో ఐదు సార్లు శ్వాస తీసుకునేంత సమయం ఉండి యథాస్థితికి రావాలి.

అప్పుడే పుట్టిన పసిపాపలు గాజుబొమ్మల లాంటివారు. వారిని అతి జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉంటుంది. కొన్ని సార్లు పిల్లలకు కొన్ని రకాల సమస్యలు వస్తూ ఉంటాయి. వాటిలో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఎక్కువ! ఈ సమస్యలకు సంబంధించిన విషయాలను మెడికవర్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ పిడియాట్రిషియన్ డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగె- 'డాక్టర్'కు వివరించారు.



శిశువులకు కాలుష్యం ప్రమాదమే!

పిల్లలలో ఎక్కువగా వచ్చే శ్వాసకోశ సమస్యలు ఏమిటి?

పిల్లలు శ్వాస పీల్చుకొనే సమయంలో శబ్దం చేస్తున్నా.. శ్వాస పీల్చుకోనే గుండె దగ్గర ఉన్న కండరాలు ఎక్కువగా కదులుతూ ఇబ్బంది పెడుతున్నా.. వారికి సమస్య ఉందని గుర్తించి వెంటనే చికిత్స అందిస్తాం. సాధారణంగా ఒక బేబీ పుటడానికి 40 వారాలు పడుతుంది. 34 వారాల కన్నా తక్కువ వయస్సు ఉన్న పిల్లలు పుడితే వారికి శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

మన చుట్టూ ప్రపంచంలో కాలుష్యం బాగా పెరిగిపోతుంది.. దీని ప్రభావం నవజాత శిశువులపై ఎలా ఉంటుంది?

బిడ్డ కడుపులో ఉండగా తల్లులు పొగ త్రాగితే శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. ఈ మధ్య జరిగిన అధ్యయనాలలో- తక్కువ బరువున్న పిల్లలు నెలలు నిండకుండా పుట్టడానికీ.. కాలుష్యానికి నేరుగా సంబంధం ఉందని తేలింది. తల్లులు కాలుష్యం బారిన పడినప్పుడు అబార్షన్స్ కూడా జరిగే అవకాశముంది. ప్రపంచంలో పది మంది పిల్లలు పుడితే వారిలో ఒకరు పూర్తిగా ఎదగకుండా పుడతారు. అలాంటి వారికి చికిత్స అవసరమవుతుంది.

తక్కువ బరువు ఉన్నవారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువంటున్నారు కదా..వారిని రక్షించటానికి అవసరమైన వైద్య సదుపాయాలు, చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయా?

నవజాత శిశువులను రక్షించటానికి అనేక పరికరాలు, ట్రీట్‌మెంట్స్, ప్రొటోకాల్స్ అభివృద్ధి చెందాయి. ఉదాహరణకు సాధారణంగా ఒక బేబీ పుట్టినప్పుడు 2 నుంచి మూడు కేజీల వరకూ ఉంటుంది. కొన్ని సార్లు పూర్తిగా ఎదగకుండానే పిల్లలు పుడుతూ ఉంటారు. ఉదాహరణకు ఈ మధ్యనే మా దగ్గర 24 వారాలు ఎదిగిన ఒక బేబీ పుట్టింది. ఈ పసికూన బరువు 500 గ్రాములు. ఇలాంటి వారిని జాగ్రత్తగా పెంచటానికి కొన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అంతే కాదు. కొత్త కొత్త మందులు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు అప్పుడే పుట్టిన పిల్లల్లో ఊపిరితిత్తులు సరిగ్గా ఎదగవు. అవి సరిగ్గా ఎదగటానికి ఒక ప్రత్యేకమైన ఇంజక్షను ఉంది. దీనిని నేరుగా ఊపిరితిత్తులకే ఇస్తాం. దీని వల్ల పిల్లల ఊపిరితిత్తులు సక్రమంగా పనిచేస్తాయి.

> పూర్తిగా ఎదగని బేబీలను పెంచి వారిని ఆరోగ్యంగా ఇంటికి పంపినప్పుడు ఎంతో సంతృప్తిగా అనిపిస్తుంది. సాధారణంగా పుట్టిన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆ తర్వాత వారికి ఎటువంటి సమస్యలు రావు.

తల్లి గర్భంలో ఉన్నప్పుడే పిల్లలకు ఉన్న అన్ని సమస్యలు తెలిసిపోతాయా?

అత్యాధునికమైన అల్ట్రా సౌండ్ పద్ధతిలో పిల్లల్లో ఏవైనా సమస్యలు ఉన్నాయా అనే విషయం తెలుస్తుంది. ఈ మధ్యకాలంలో ఫీటల్ మెడిసెన్ అనే ప్రత్యేక విభాగం అభివృద్ధి చెందింది. దీని ద్వారా గర్భస్థ శిశువుకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాన్ని పుట్టక ముందే తెలుసుకోగలుగుతాం. ఒక సారి ఏదైనా ఆరోగ్య సమస్య ఉందనే విషయం తెలిస్తే- బిడ్డ పుట్టిన వెంటనే తగిన వైద్యాన్ని అందించటానికి సిద్ధంగా ఉంటాం. ఉదాహరణకు ఒక బిడ్డకు సమస్య ఉందనే విషయాన్ని గైనకాలిజిస్ట్ కనుగొన్నారనుకుందాం. అప్పుడు కడుపులో ఉన్న బిడ్డ లంగ్స్ బలోపేతం అవటానికి వీలుగా తల్లికి కొన్ని స్టిరాయిడ్స్ ఇస్తారు. ఇలాంటి చికిత్సలతో పాటుగా- ఈ మధ్య కాలంలో అత్యాధునికమైన వెంటిలేటర్లు, పిల్లలకు ఏ మాత్రం అసౌకర్యం కల్గించని విధంగా ఉండే పరికరకాలు అందుబాటులోకి వచ్చాయి.

పిల్లలకు ఎలాంటి జన్యుపరమైన సమస్యలు ఏర్పడతాయి?

జన్యుపరమైన సమస్యలు కూడా వస్తూ ఉంటాయి. ఉదాహరణకు ఇది వరకు జన్యువుల వల్ల వచ్చే సిస్టిక్ ఫైబ్రోసిస్ అనే సమస్య విదేశాలలో ఎక్కువగా కనిపించేది. ఈ సమస్య ఉన్న వారిలో ఊపిరితిత్తులు సక్రమంగా పనిచేయవు. ఈ మధ్యకాలంలో మన దగ్గర కూడా ఇలాంటి కొన్ని కేసులు వస్తున్నాయి.

> పుట్టిన బిడ్డలతో పాటుగా వారి తల్లులను కూడా జాగ్రత్తగా చూసుకోవాలి. సాధారణంగా బిడ్డ పుట్టిన తర్వాత తల్లులు విపరీతమైన ఒత్తిడితో ఉంటారు. బిడ్డకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉందని తెలిస్తే- ఆ ఒత్తిడి మరింతగా పెరుగుతుంది. అందువల్ల వారికి తగిన కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది.



డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగె
హెచ్ఓడీ, నియోనెటాలజీ
మరియు పీడియాట్రిక్స్,
మెడికవర్ హాస్పిటల్,
హైదరాబాద్

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 2 జూలై 2024
cinema@andhrajyothy.com



రామ్‌చరణ్ సొంత చిత్రంలో నిఖిల్

వి మెగా పిక్చర్స్ పతాకంపై చిత్రాలు నిర్మించడానికి హీరో రామ్‌చరణ్ నిర్మాణరంగంలోకి ప్రవేశించారు. యూవీ క్రియేషన్స్ విక్రమ్‌రెడ్డి ప్రొడక్షన్ పార్ట్‌నర్. అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ అగర్వాల్ వీరిద్దరితో చేతులు కలిపారు. నిఖిల్ హీరోగా నిర్మించే తొలి చిత్రం 'ది ఇండియా హౌస్' నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటించే ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ కీలక పాత్ర పోషించనున్నారు. 1905వ సంవత్సరం నేపథ్యంగా ప్రేమ, విప్లవం అంశాలతో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ హంపీలోని విరూపాక్ష దేవాలయంలో ప్రారంభమైంది. మంగళవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ జరుగుతుంది. ఈ చిత్రానికి కెమరూన్ బ్రైసన్ ఛాయాగ్రాహకుడు.

విక్టరీ వెంకటేశ్ కొత్త చిత్రం



విక్టరీ వెంకటేశ్, వరుణ్‌తేజ్‌తో 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' వంటి వినోదాత్మక చిత్రాలను అందించిన దర్శకుడు అనిల్ రావిపూడి తాజాగా ఇప్పుడు వెంకటేశ్ సోలో హీరోగా ఓ సినిమా చేస్తున్నారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించే ఈ చిత్రం బుధవారం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఉన్న రివాల్వర్, గులాబీ పువ్వు, ఎక్సలెంట్ వైఫ్, ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ అనే కాప్షన్ అందరినీ ఆకట్టుకున్నాయి. దీనిని బట్టి చూస్తే ఇందులో వెంకటేశ్ మాజీ పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషిస్తున్నారనీ, ఆ ఆఫీసర్‌గారి భార్య, మాజీ గర్ల్‌ఫ్రెండ్ మధ్య వచ్చే సన్నివేశాలు అనిల్ రావిపూడి స్కూల్‌లో లా వినోదభరితంగా ఉండవచ్చని అర్థమవుతుంది.

సూపర్ నేచురల్ థ్రిల్లర్



వైవిధ్యమైన చిత్రాలతో అందరినీ ఆకట్టుకొంటున్న సుధీర్‌బాబు ఓ సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్‌లో నటించనున్నారు. మన పురాణాలతో అనుసంధానం చేస్తూ ఎన్నో రహస్యాలను వెలికి తీసే కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇంతకుముందెన్నడూ రాని డిఫరెంట్ కాన్సెప్ట్‌తో విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి వెంట్ కల్యాణ్ దర్శకుడు. 'రుస్తమ్', 'టాయ్‌లెట్', 'ఏక్ ప్రేమ్ కథ', 'ప్యాడ్‌మ్యాన్', 'పరి' వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రేరణ అరోరా సమర్పణలో ఈ సినిమా రూపుదిద్దుకుంటుంది. ఇందులో సుధీర్ బాబు సరసన బాలీవుడ్ కథానాయిక నటిస్తుంది. ఆమె ఎవరనేది త్వరలో తెలియజేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. 'కుట్ర, పన్నాగాలతో మంచికి, చెడుకీ మధ్య జరిగే యుద్ధం ఈ చిత్ర ముఖ్యాంశం. పాన్ ఇండియా సినిమాల్లో ఓ మైల్ స్టోన్‌గా ఉంటుంది' అని చెప్పారు దర్శకుడు కల్యాణ్. ఈ సినిమా గురించి సుధీర్‌బాబు మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ నచ్చి ఏడాది నుంచి ఈ టీమ్‌తో ట్రావెల్ అవుతున్నాను. డిఫరెంట్ కంటెంట్‌తో రూపొందనున్న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందా అని ఆతృతతో ఎదురుచూస్తున్నాను' అని చెప్పారు. ఆగస్టు 15న ఫస్ట్‌లుక్ విడుదల చేస్తామనీ, సినిమాను శివరాత్రి సందర్భంగా వచ్చే ఏడాది మార్చిలో విడుదల చేస్తామనీ ప్రేరణ అరోరా చెప్పారు.

మాస్ మూమెంట్స్‌తో 'స్టెప్పామార్'



రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాధ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమా ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్ అందరికీ మంచి కిక్ ఇచ్చి.. సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను 'మాస్ సాంగ్ ఆఫ్ ది ఇయర్' అంటూ మేకర్స్ విడుదల చేశారు. 'స్టెప్పామార్' అంటూ సాగే ఈ పాట హై ఎనర్జిటిక్ మాస్ మూమెంట్స్‌తో సాగింది. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, సాహితీ ఆలపించారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన ఈ సాంగ్‌కు మణిశర్మ సంగీతం అందించారు.

హారర్ మిస్టరీ కథాంశంతో...

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా ఓ హారర్ మిస్టరీ సినిమాలో నటిస్తున్నారు. 'చావు కబురు చల్లగా' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న కౌశిక్ పెగళ్లపాటి దర్శకత్వం వహిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత నవీన్ యెర్నేని క్లాప్ కొట్టగా, నిర్మాత దిల్‌రాజు కెమెరా స్విచ్ఛాన్ చేశారు. సతీశ్ కిలారు, అన్మోల్ శర్మ స్క్రిప్ట్ అందించారు. జూలై 11 నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని, ఇప్పటివరకూ ఎవ్వరూ తీయని కథాంశంతో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి ఎడిటర్: నిరంజన్ దేవరమానే, డీఓపీ: చిన్మయ్ సలాస్కర్, సంగీతం: బి.అజనీశ్ లోక్‌నాథ్.



భార్య చెప్పులు మోసిన కొత్త పెళ్లికొడుకు



సీనియర్ నటుడు శత్రుఘ్నసిన్హా కుమార్తె సోనాక్షి వివాహం ఆమె చిరకాల స్నేహితుడు జహీర్ ఇక్బాల్‌తో ఇటీవలే జరిగింది. భార్య సోనాక్షి అంటే ఇక్బాల్‌కు ఎంత ప్రేమ అంటే.. ఆమె చెప్పుల్ని కూడా మోసేంతగా. అవునండీ. నిజం. ఈ మధ్య ఇక్బాల్, సోనాక్షి కలసి ఓ హోటల్‌కు వెళ్లారు. అప్పుడు సోనాక్షి వేసుకున్న చెప్పులతో ఇబ్బంది పడుతుంటే, 'నువ్వు ఉండు' అని ఆమె చెప్పులు పట్టుకుని ఇక్బాల్ నడుస్తుంటే వెనుక నడుస్తూ వీడియో తీశారు సోనాక్షి. ఆ ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేసి 'కరెక్ట్ పర్సన్‌ను పెళ్లి చేసుకుంటే ఇలా ఉంటుంది' అని రాసుకొచ్చారు సోనాక్షి.

సునయన పెళ్లి అతనితోనేనా?



'కుమారి వర్సెస్ కుమారి' చిత్రంతో వెండితెర ప్రవేశం చేశారు సునయన. 'రాజరాజచోర' చిత్రంతో హిట్ అందుకుని ఆ తర్వాత కొన్ని సినిమాలు, 'మీట్ క్యూట్', 'ఇన్‌స్పెక్టర్ రిషి' వెబ్ సిరీస్‌లో నటించారు. కొన్ని రోజుల క్రితం తనకు నిశ్చితార్థం అయ్యిందని సోషల్ మీడియాలో ప్రకటించి.. తన కాబోయే భర్త వేలు పట్టుకున్న ఫొటోను షేర్ చేశారు. కానీ తను పెళ్లాడబోయే వ్యక్తి పేరు మాత్రం చెప్పకుండా అందరినీ సస్పెన్స్‌లో పెట్టారు. తాజాగా, ఆమె పెళ్లి చేసుకోబోయేది దుబాయ్‌కు చెందిన ఖలీద్ అల్ అమేరి అనే యూట్యూబర్‌ను అని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి కారణం జూన్ 26న ఖలీద్ అల్ అమేరి తన ఇన్‌స్టా ఖాతాలో ఓ అమ్మాయితో ఉంగరాలు మార్చుకున్న ఫొటోను పోస్ట్ చేశారు. దీంతో సునయన నిశ్చితార్థం చేసుకున్న వ్యక్తి.. పెళ్లి చేసుకోబేయేది ఖలీల్‌నే అని అందరూ అనుకుంటున్నారు. కాగా, ఖలీల్‌కు ఇప్పటికే సలామా మొహమ్మద్‌తో పెళ్లయిందని, ఫిబ్రవరి 14న వారిద్దరూ విడాకులకు అప్లై చేయగా వెంటనే విడాకులు మంజూరు అయ్యాయట. ఈ విషయాన్ని స్వయంగా ఖలీల్ భార్య సలామానే చెప్పారు.


మిస్ యూనివర్స్‌తో 'క్యాలెండర్' సాంగ్



కమల్ హాసన్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. ఇది 1996లో రిలీజై బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'భారతీయుడు' చిత్రానికి సీక్వెల్‌గా వస్తోన్న సంగతి తెలిసిందే. టాప్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా, సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ పాన్ ఇండియన్ మూవీ 12న విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. సోమవారం ఈ సినిమా నుంచి 'క్యాలెండర్' లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో దక్షిణాఫ్రికాకు చెందిన మోడల్, 2017 విస్ యూనివర్స్ డెమి లీ టెబో నటించి.. పాటకే ప్రత్యేకార్షణగా నిలిచారు. అలాగే ఇదివరకటి శంకర్ సినిమాల్లోని పాటల్లాగే ఇందులోనూ గ్రాండ్ స్కేల్‌లో విజువల్స్ ఉన్నాయి. ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా, శ్రావణ భార్గవి ఆలపించారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఎ.శ్రీకర ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రవివర్మన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుందర్ రాజ్.

ఐదుగురు స్నేహితుల వినోదం

ఎమ్మెస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల మధ్య జరిగే సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని విస్కి దర్శకత్వంలో బొమ్మా బొరుసా సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు మెహర్ రమేశ్ విడుదల చేశారు. బాలుకి స్నేహితులు



పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఓపెన్ అయిన టీజర్ ఆ తర్వాత వినోదభరితంగా సాగింది. కొత్తదనం కలిగిన సినిమా అనే భావన టీజర్ చూశాక కలుగుతుంది. ఈ సందర్భంగా దర్శకుడు విస్కి మాట్లాడుతూ 'ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతి పాత్ర ఎంటర్‌టైన్ చేస్తుంది. ఐదుగురు స్నేహితులకు ఎదురైన అనుభవాలు, వాటి పర్యావసానాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఈ నెల 19న సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. ప్రమోదిని, వాకా మణి, రాజా అశోక్, వెంకటేశ్, సాయి అరుణ్, రాహుల్ ఇతర ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఐ.భరత్.

'కోడి బుర్ర' కథ ఏమిటి?



తమిళ హీరో శ్రీరామ్ కొత్త చిత్రం 'కోడి బుర్ర' షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో మొదలైంది. శ్రుతి మీనన్, ఆరుషి హీరోయిన్లుగా నటిస్తున్నారు. శాసనసభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేసిన అనంతరం నిర్మాత బెక్కం వేణుగోపాల్ తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్ ప్రారంభించారు. అనంతరం దర్శకుడు చంద్రశేఖర్ కానూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో శ్రీరామ్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. హీరోయిన్ శ్రుతి మీనన్ డాక్టర్‌గా నటిస్తోంది. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో చిత్రం రూపుదిద్దుకుంటుంది' అని చెప్పారు. ఒక ఇంట్రెస్టింగ్ మూవీలో నటిస్తున్నందుకు ఆనందంగా ఉందని శ్రీరామ్ చెప్పారు. నిర్మాత కంచర్ల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 'నా ఫేవరెట్ హీరో శ్రీరామ్. ఆయన నటించిన 'ఒకరికి ఒకరు', 'పోలీస్ పోలీస్' వంటి సినిమాలు చాలా సార్లు చూశాను. నా మిత్రులు గట్టు విజయ్ గౌడ్, చిన్ని చందు, వట్టం రాఘవేంద్ర, సముద్రాల మహేశ్ గౌడ్‌తో కలసి ఈ సినిమా తీస్తున్నాను' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: సుకుమార్ రాగ, సినిమాటోగ్రఫీ: శ్రీకాంత్ కొడా, ఎడిటర్: శిరీష్ ప్రసాద్. రచన, దర్శకత్వం: చంద్రశేఖర్ కానూరి.

యానిమేషన్ చిత్రానికి డాలర్ల పంట



యానిమేషన్ చిత్రం 'ఇన్‌సైడ్ అవుట్ 2' ప్రపంచవ్యాప్తంగా దుమ్ముదులుపుతోంది. చరిత్రలో ఇప్పటివరకూ ఏ యానిమేషన్ చిత్రం సాధించని అరుదైన ఫీట్‌ను నమోదు చేసింది. కేవలం మూడు వారాల్లోనే గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద వన్ బిలియన్ డాలర్లు (దాదాపు రూ.8500 కోట్లు) అర్జించింది. ఇటువంటి సంచలన రికార్డు సాధించడమే కాకుండా ఈ ఏడాది ఇప్పటివరకూ రిలీజైన అన్ని సినిమాల కలెక్షన్లను వెనక్కునెట్టి అగ్ర స్థానాన్ని కైవసం చేసుకుంది. మొత్తానికి వన్ బిలియన్ డాలర్లు కొల్లగొట్టిన 11వ యానిమేషన్ సినిమాగా 'ఇన్‌సైడ్ అవుట్ 2' చరిత్ర సృష్టించింది. ఇండియాలోనూ రిలీజైన ఈ చిత్రం ఇప్పటికే రూ.100 కోట్ల పైచిలుకు కలెక్షన్లను సాధించడం విశేషం. 2015లో ఈ సినిమా మొదటి భాగం 'ఇన్‌సైడ్ అవుట్' జూన్ 19న విడుదలైంది. ఈ చిత్రానికి పీట్ డాక్టర్ దర్శకత్వం వహించారు. 11 ఏళ్ల రిలే అండర్సన్ అనే బాలిక మెదడులోని భావోద్వేగాలైన ఆనందం, కోపం, చిరాకు, బాధ, భయం యానిమేషన్ రూపు సంపాదించుకుని.. ఆమె ఆలోచనల్ని, నిర్ణయాల్ని ఎలా ప్రభావితం చేస్తాయి అనేది ఈ సినిమా కథ. ఈ సినిమా లైఫ్‌టైమ్ కలెక్షన్స్ దాదాపు 900 మిలియన్ డాలర్లు (రూ.7500 కోట్లు). ఈ సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కింది 'ఇన్‌సైడ్ అవుట్ 2'. జూన్ 14న విడుదలైన ఈ సీక్వెల్‌కు కెల్సీ మన్ దర్శకత్వం వహించారు. దాదాపు 96 నిమిషాల నిడివి కలిగిన ఈ సినిమాను ప్రముఖ హాలీవుడ్ నిర్మాణ సంస్థ వాల్ట్ డిస్నీ అనుబంధ సంస్థ పిక్సర్ నిర్మించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తన తోటి మిత్రులతో ఐస్ హాకీ ఆడే సమయంలో 13 ఏళ్ల రిలే అండర్సన్ జీవితంలోకి ఆందోళన, అసంతృప్తి, సిగ్గు, అసూయ ప్రవేశిస్తాయి. ఆ క్షణం నుంచి సినిమా ఎన్ని మలుపులు తీసుకుందనేది దర్శకుడు చాలా వినోదాత్మకంగా చూపించారు. టీనేజర్లను విపరీతంగా ఆకట్టుకునేలా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రస్తుతం కుటుంబ సమేతంగా ప్రేక్షకులు క్యూ కడుతున్నారు. ఇదే ఊపు కొనసాగితే ఈ సినిమా మరిన్ని రికార్డులు సాధించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



అమ్మాయిలు అదరగొట్టారు

భారత్ ఘన విజయం । 10 వికెట్లతో దక్షిణాఫ్రికా చిత్తు । వోల్వార్ట్ శతకం

2 టెస్ట్‌ల్లో మనోళ్లకిది రెండో పది వికెట్ల విజయం. 2002లో సౌతాఫ్రికాపైనే అన్ని వికెట్లతో నెగ్గింది.

చెన్నై : దక్షిణాఫ్రికా మహిళలతో ఏకైక టెస్ట్‌లో భారత్ 10 వికెట్లతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ 232/2 స్కోరుతో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సఫారీలు 373 పరుగులకు ఆలౌటయ్యారు. కెప్టెన్ వోల్వార్ట్ (122), డి క్లెర్క్ (61) పోరాడారు. అనంతరం విజయానికి భారత్ 37 పరుగులు చేయాల్సి ఉండగా..ఓపెనర్లు షఫాలీ వర్మ (24 నాటౌట్), శుభా సతీష్ (14 నాటౌట్) 10 ఓవర్లలోపే లాంఛనాన్ని పూర్తి చేశారు. మొత్తం 10 వికెట్లు తీసిన స్పిన్నర్ స్నేహ్ రాణా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ శుక్రవారం నుంచి ఇక్కడే జరగనుంది.

పోరాడిన సఫారీలు

మ్యాచ్‌ను కనీసం డ్రా చేసేందుకు సౌతాఫ్రికా పోరాడింది. 105 పరుగులు వెనుకంజలో ఉండి, రెండో ఇన్నింగ్స్‌లో ఎనిమిది వికెట్లు చేతిలో ఉన్న దశలో..వోల్వార్ట్, డి క్లెర్క్, కాప్ భారత బౌలర్లను ఒకింత నిలువరించారు. వోల్వార్ట్, కాప్ మూడో వికెట్‌కు 58 రన్స్ జోడించారు. ఈ క్రమంలో వోల్వార్ట్ శతకం పూర్తి చేసింది. అయితే కాప్‌ను దీప్తిశర్మ, టకెర్‌ను స్నేహ్ రాణా అవుట్ చేయడంతో పర్యాటక జట్టు 266/4తో నిలిచింది. ఆపై వోల్వార్ట్ కూడా నిష్క్రమించడంతో భారత్ విజయానికి చేరువైంది. కానీ డిక్లెర్క్..జాఫ్తా ఇతర లోయర్ ఆర్డర్ బ్యాటర్ల సాయంతో ఇన్నింగ్స్ నడిపించింది. దాంతో టీ విరామానికి దక్షిణాఫ్రికా 336/8 స్కోరు సాధించింది. అప్పటికి డిక్లెర్క్ క్రీజులో ఉండడంతో మరో సెషన్ ఆడి మ్యాచ్‌ను డ్రా చేసుకొనేలా కనిపించింది. కానీ భారత బౌలర్లు విజృంభించి మిగిలి రెండు వికెట్లు పడగొట్టడంతో సౌతాఫ్రికా ఆలౌటై స్వల్ప ఆధిక్యం సాధించింది.

సంక్షిప్తస్కోర్లు : భారత్ 603/6 డిక్లేర్డ్, 37/0 (షఫాలీ 24 నాటౌట్, శుభ 13నాటౌట్); దక్షిణాఫ్రికా 266, 373 (వోల్వార్ట్ 122, లుస్ 109, డిక్లెర్క్ 61, కాప్ 31, సినాలో 15, రాజేశ్వరి 2/55, దీప్తిశర్మ 2/85, స్నేహ్ రాణా 2/111).

'లియాన్' విజేత ఆనంద్



లియోన్ (స్పెయిన్): ఐదుసార్లు వరల్డ్ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ కెరీర్‌లో పదోసారి లియాన్ మాస్టర్స్ టైటిల్ నెగ్గాడు. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో ఆనంద్ 3-1తో శాంటోస్ (స్పెయిన్) పై నెగ్గాడు. ఆనంద్ 28 సంవత్సరాల కిందట 1996లో తొలిసారి ఈ టైటిల్ సాధించాడు. ఈ టోర్నీలో ఇరిగేసి అర్జున్, టోపలోవ్ కూడా తలపడ్డారు. అర్జున్ సెమీస్‌లో ఓటమి పాలయ్యాడు.

ఐసీసీ టీమ్‌లో మనోళ్లు ఆరుగురు

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో రాణించిన ఆటగాళ్లతో ఐసీసీ 'టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్'ని ఎంపిక చేసింది. ఇందులో ఆరుగురు భారత ఆటగాళ్లు ఉన్నారు.

ఐసీసీ టీ20 జట్టు: రోహిత్, సూర్యకుమార్, హార్దిక్, అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్ (భారత్), ఫరూఖీ, గుర్బాజ్, రషీద్ (అఫ్ఘాన్), పూరన్ (విండీస్), స్టొయినిస్ (ఆసీస్). 12వ ఆటగాడు: నోకియా (సౌతాఫ్రికా).

'యూరో' క్వార్టర్స్‌లో ఫ్రాన్స్

కొలోగ్ని (జర్మనీ): టైటిల్ ఫేవరెట్ ఫ్రాన్స్.. యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ క్వార్టర్స్‌కు చేరుకొంది. సోమవారం జరిగిన రౌండ్-16లో ఫ్రాన్స్ 1-0తో బెల్జియంపై గెలిచింది. మరో నాకౌట్ మ్యాచ్‌లో స్పెయిన్ 4-1తో జార్జియాను చిత్తు చేసింది.

కోర్టులో కుప్పకూలి చైనా షట్లర్ మృతి

జకార్తా: చైనాకు చెందిన 17 ఏళ్ల షట్లర్ ఝాంగ్ ఝిజీ మ్యాచ్ ఆడుతూ కోర్టులోనే కుప్పకూలి మరణించాడు. ఆసియా జూ. చాంపియన్‌షిప్స్‌లో కజుమా (జపాన్)తో మ్యాచ్ తొలి గేమ్ సందర్భంగా గుండెపోటుతో ఝాంగ్ కోర్టులో కుప్పకూలాడు.



ఎయిర్ గన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన షూటింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన భూక్యా మోనాలిసా, భూక్యా సోనాలిసా మంత్రి కొండా సురేఖతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని సచివాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని రేవంత్ రెడ్డి అభినందించారు.

చిక్కుకుపోయిన టీమిండియా

బార్బడోస్‌కు హరికేన్ ముప్పు । ఎయిర్‌పోర్టు మూసివేత

బార్బడోస్ : టీ20 వరల్డ్ కప్ గెలిచిన ఉత్సాహంలో ఉన్న భారత జట్టుకు ప్రస్తుతం ఆందోళనకర పరిస్థితి ఎదురైంది. బార్బడోస్ అత్యంత ప్రమాదకర హరికేన్ ముప్పును ఎదుర్కోవడంతో ఆ నగరంలో కర్ఫ్యూ విధించారు. విమానాశ్రయాన్ని మూసి వేయడంతో టీమిండియా సహా భారత మీడియా ప్రతినిధులంతా అక్కడే చిక్కుకుపోయారు. బెరిల్ హరికేన్ ధాటికి బలమైన గాలులతో కూడిన భారీ వర్షం నగరాన్ని ముంచెత్తుతోంది. దాంతో విమానాల రాకపోకలను రద్దు చేశారు. వరల్డ్ కప్ ఫైనల్ శనివారమే ముగిసినా..ఆదివారం రిజర్వ్ డే కావడంతో ప్రయాణానికి వీలుకాలేదు. ఇక..సోమవారంనాడు జట్టు స్వదేశానికి బయలుదేరాల్సి ఉన్నా..హరికేన్ కారణంగా ప్రయాణం రద్దయింది. భారత జట్టు సభ్యులు, సహాయ సిబ్బంది బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా తదితరులంతా హోటల్లోనే ఉండిపోయారు. భారత జట్టును చార్టర్డ్ విమానంలో బార్బడోస్ నుంచి నేరుగా ఢిల్లీ తీసుకొచ్చేందుకు బీసీసీఐ ప్రయత్నాలు చేపట్టింది. అయితే ఇక్కడి పరిస్థితులు కుదుటపడి, విమానాశ్రయం తెరిచాకనే అది సాధ్యమవుతుంది.

శ్రీలంక టూర్‌కు కొత్త కోచ్

» బోర్డు కార్యదర్శి జైషా



న్యూఢిల్లీ: భారత జట్టు శ్రీలంక పర్యటనకు వెళ్లేముందే కొత్త కోచ్‌ను ప్రకటిస్తామని బీసీసీఐ కార్యదర్శి జైషా తెలిపాడు. టీమిండియా ఈనెల 27 నుంచి లంకతో మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడనుంది. అయితే రాహుల్ ద్రవిడ్ స్థానంలో బాధ్యతలు తీసుకునేదెవరనేది మాత్రం తేల్చలేదు. ఇప్పటికే క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) ముందు గంభీర్, డబ్ల్యూవీ రామన్ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 'కోచ్, సెలెక్టర్ల ఎంపిక త్వరలోనే జరుగుతుంది. సీఏసీ ఆ పదవికి రెండు పేర్లను షార్ట్ లిస్ట్ చేసింది. ప్రస్తుతానికి లక్ష్మణ్ జింబాబ్వేకు వెళతాడు. శ్రీలంక టూర్ మాత్రం కొత్త కోచ్ ఆధ్వర్యంలోనే జరుగుతుంది' అని కరీబియన్ దీవుల్లో రోహిత్ బృందంతో పాటే ఉన్న జైషా పేర్కొన్నాడు.

సీడెడ్ల శుభారంభం

వింబుల్డన్

లండన్ : వింబుల్డన్‌లో పురుషులు, మహిళల విభాగంలో సీడెడ్‌లు శుభారంభం అందుకున్నారు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మూడో సీడ్ అల్కారజ్ 7-6 (3), 7-5, 6-2తో మార్క్ లజాల్‌పై, ఐదో సీడ్ మెద్వెదెవ్ 6-4, 6-4, 6-2తో కొవసెవిక్‌పై, ఎనిమిదో సీడ్ కాస్పెర్ రూడ్ 7-6 (2), 6-4, 6-5తో బోల్ట్‌పై, 10వ సీడ్ దిమిత్రోవ్ 6-3, 6-4, 7-5తో లజోవిక్‌పై నెగ్గి ముందంజ వేశారు. మహిళల సింగిల్స్‌లో ఏడో సీడ్ పోలిని 7-5, 6-3తో టోర్మోపై, 9వ సీడ్ సకారి 6-3, 6-1తో కెస్లర్‌పై, 14వ సీడ్ కసాట్కినా 6-3, 6-0తో జాంగ్ షూయ్‌పై, 18వ సీడ్ కోస్త్యుక్ 6-3, 6-2తో స్రమ్‌కోవాపై నెగ్గి రెండో రౌండ్‌లో ప్రవేశించారు.

చలో జింబాబ్వే..

» 6 నుంచి 5 టీ20ల సిరీస్

» గిల్ కెప్టెన్సీలో బరిలోకి..



న్యూఢిల్లీ: టీ20 ప్రపంచ కప్‌లో అద్భుత విజయం తర్వాత టీమిండియా మరో ధనాధన్ సిరీస్‌కు సిద్ధం కాబోతోంది. ఇందుకోసం జట్టు జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. అక్కడి హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో ఈనెల 6 నుంచి ఇరు జట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్ జరగనుంది. ఈ జట్టులో సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి ఐపీఎల్‌లో రాణించిన ప్లేయర్లకు చోటిచ్చారు. ఇక శుభ్‌మన్ గిల్‌కు జట్టు పగ్గాలు అప్పగించిన విషయం తెలిసిందే. టీ20 వరల్డ్ కప్‌లో జట్టుతో ప్రస్తుతం బార్బడోస్‌లో ఉన్న యశస్వీ జైస్వాల్, సంజూ శాంసన్, శివమ్ దూబే, రింకూ సింగ్ ఈ టూర్‌కు ఎంపికయ్యారు. ఏకంగా మూడు స్థానాలు ఖాళీ కావడంతో వాటిని భర్తీ చేస్తూ, టీ20 టీమ్‌లో నిలకడైన స్థానం కోసం యువ ఆటగాళ్లు పోటీపడనున్నారు. ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్‌కు తొలిసారిగా జాతీయ జట్టులో చోటు దక్కినా గాయంతో దూరం కావాల్సివచ్చింది. అతడి స్థానంలోనే దూబే ఎంపిక జరిగింది. మరోవైపు ఈ సిరీస్‌కు వీవీఎస్ లక్ష్మణ్ తాత్కాలిక కోచ్‌గా వ్యవహరించనున్నాడు. మరోవైపు సికిందర్ రజా సారథ్యంలోని జింబాబ్వే జట్టును సోమవారం ప్రకటించారు. ఇక ఐదు మ్యాచ్‌లు ఈనెల 6,7,10,13,14 తేదీల్లో జరగనున్నాయి. మ్యాచ్‌లన్నీ సాయంత్రం 4.30 నుంచి హరారే వేదికగా జరుగుతాయి.

భారత్: గిల్ (కెప్టెన్), జైస్వాల్, రుతురాజ్, అభిషేక్, రింకూ, శాంసన్, ధ్రువ్ జురెల్, దూబే, పరాగ్, వాషింగ్టన్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్, తుషార్.

విరాట్‌కు ద్రవిడ్ టార్గెట్





న్యూఢిల్లీ: కోచ్‌గా చివరి రోజు రాహుల్ ద్రవిడ్.. కోహ్లీకి అంతిమ లక్ష్యాన్ని నిర్దేశించాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ నెగ్గాలని సూచించాడు. కోహ్లీ కెరీర్‌లో వైట్ బాల్ చాంపియన్‌షిప్‌లు వన్డే, టీ20 వరల్డ్‌కప్‌లతోపాటు చాంపియన్స్ ట్రోఫీ టైటిల్ గెలిచిన రికార్డుంది. ఇక, మిగిలింది రెడ్ బాల్ టెస్ట్ చాంపియన్‌షిప్ మాత్రమే. ఈ ఉద్దేశంతోనే ద్రవిడ్ అలా టార్గెట్ సెట్ చేసి ఉంటాడు.

కప్పు ఎగురుకుంటూ వెళ్తుంటే.. చటుక్కున అందుకొన్నా..!

మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో సౌతాఫ్రికా విజయానికి 16 పరుగులు కావాల్సిన సమయంలో.. మిల్లర్ కొట్టిన బంతిని బౌండ్రీలైన్ వద్ద సూర్యకుమార్ అద్భుత రీతిలో అందుకోవడం తెలిసిందే. ఈ క్యాచ్‌ను 1983 వరల్డ్ కప్‌లో రిచర్డ్స్‌ను కపిల్‌దేవ్ అవుట్ చేసిన క్యాచ్‌తో పోల్చుతున్నారు. సూర్య సమయస్ఫూర్తికి జేజేలు పలుకుతున్నారు. అయితే, మ్యాచ్ అనంతరం ఆ క్యాచ్ గురించి సూర్యను మీడియా ప్రశ్నించగా.. 'ఆ క్షణంలో ఏమీ ఆలోచించలేదు. నాకు కనిపించింది ఒక్కటే..! వరల్డ్‌కప్ ఎగురుకుంటూ దూరంగా వెళ్తోంది. ఎలాగైనా ఒడిసిపట్టాలనుకొన్నా. అయినా నేను నిమిత్త మాత్రుణ్ణి. అదంతా దేవుడి ప్రణాళిక' అని చెప్పాడు.

పక్కనే సోదరుడు!

టీ20 వరల్డ్‌కప్ గెలిచిన అనంతరం కోహ్లీ, రోహిత్ శర్మ ఇద్దరూ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. వీరిద్దరిని ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తాయి. అయితే, రోహిత్ తల్లి పూర్ణిమ చేసిన పోస్టు మరింత వైరల్‌గా మారింది. విరాట్‌ను రోహిత్ సోదరుడిగా సంబోధించడం ఫ్యాన్స్ హృదయాలను తాకింది. 'టీ20 క్రికెట్‌లో ఆల్ టైమ్ గ్రేట్‌లు' అని రోహిత్, కోహ్లీ కలసి ఉన్న ఫొటోకు పూర్ణిమ క్యాప్షన్ పెట్టారు. 'భుజాలపై కూతురు. యావద్దేశం అతడి వెంటే. పక్కనే సోదరుడు' అనే సందేశాన్ని ఫొటో కింద రాసి షేర్ చేశారు.



బార్బడోస్ బీచ్‌లో..

టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన అనంతరం మెగా ట్రోఫీతో రోహిత్ శర్మ బార్బడోస్ బీచ్‌లో అఫీషియల్ ఫొటో షూట్‌లో పాల్గొన్నాడు. వీటిని ఎక్స్‌లో షేర్ చేసిన బీసీసీఐ.. 'మిషన్ విజయవంతమైంది. మనం ప్రపంచ చాంపియన్లం. కెప్టెన్.. నువ్వు సాధించావ్' అని క్యాప్షన్ పెట్టింది.

బిజినెస్

జూన్ నెల జీఎస్‌టీ వసూళ్లు 1.74 లక్షల కోట్లు

ఇక నుంచి అధికారికంగా వసూళ్ల వివరాల వెల్లడి బంద్

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లలో వృద్ధి రేటు కొనసాగుతోంది. జూన్ నెలలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.74 లక్షల కోట్లుగా నమోదైనట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 7.7 శాతం ఎక్కువ. అయితే మే నెల వసూళ్లు రూ.1.73 లక్షల కోట్లతో పోలిస్తే మాత్రం గత నెల వసూళ్లలో పెద్ద పెరుగుదల లేదు. ఈ నెల నుంచి ఇక అధికారికంగా ప్రతి నెలా 1వ తేదీన అంతకు ముందు నెల జీఎస్‌టీ వసూళ్ల సమగ్ర వివరాల విడుదలకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఫుల్‌స్టాప్ పెడుతోందని ఆ వర్గాలు తెలిపాయి. వివిధ సోషల్ మీడియా చానల్స్ ద్వారా టూకీగా మాత్రమే ఇక ఈ వివరాలు విడుదలవుతాయి. ఇందుకు కారణం మాత్రం కేంద్ర ప్రభుత్వం చెప్పడం లేదు. కాగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లోనే జీఎస్‌టీ వసూళ్లు రూ.5.57 లక్షల కోట్లకు చేరాయి. జూన్‌లో వసూలైన రూ.1.74 లక్షల కోట్ల జీఎస్‌టీలో సీజీఎస్‌టీ ద్వారా రూ.39,586 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ ద్వారా రూ.33,548 కోట్లు వసూలయ్యాయి.

జీఎస్‌టీకి ఏడేళ్లు

జీఎస్‌టీ అమల్లోకి వచ్చి సోమవారంతో ఏడేళ్లు పూర్తయ్యాయి. దీంతో మొబైల్ ఫోన్లతో పాటు ఆహార పదార్థాలు, విరివిగా ఉపయోగించే అనేక గృహోపయోగ వస్తువులపై పన్ను పోటు తగ్గిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 17 పరోక్ష పన్నులు, 13 సెస్సులను కలిపి 2017 జూలై 1 నుంచి జీఎస్‌టీని అమల్లోకి తీసుకువచ్చారు.



ఆటో అమ్మకాల్లో వృద్ధి అంతంతే...

ముంబై: ఆటోమొబైల్ అమ్మకాల్లో వృద్ధి జూన్ నెలలో నామమాత్రంగానే ఉంది. దేశంలోని పలు ప్రాంతాల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు బేస్ ఎఫెక్ట్ (గత ఏడాది జూన్‌లో అమ్మకాల భారీ వృద్ధి) కూడా ఈ నామమాత్రమైన వృద్ధికి కారణమని అంటున్నారు. జూన్ నెలలో మొత్తం 3,40,784 కార్లు అమ్ముడుపోయాయి. గత ఏడాది జూన్ అమ్మకాలు 3,28,710 యూనిట్లతో పోల్చితే ఇది 3.67 శాతం అధికం.

మారుతి 3 శాతం వృద్ధి: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ కార్ల అమ్మకాల్లో 3% వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది జూన్‌తో పోల్చితే అమ్మకాలు 1,33,027 యూనిట్ల నుంచి 1,37,160 యూనిట్లకు పెరిగాయి.

- హ్యుండయ్ మోటార్స్ అమ్మకాలు 50,001 యూనిట్ల నుంచి 50,103 యూనిట్లకు పెరిగాయి.
- టాటా మోటార్స్ కార్ల అమ్మకాలు 8% క్షీణించి 47,359 యూనిట్ల నుంచి 43,624 యూనిట్లకు పెరిగాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా కార్ల అమ్మకాలు 23% పెరిగి 32,588 నుంచి 40,022కి చేరాయి.
- టయోటా కిర్లోస్కర్ అత్యుత్తమ నెలవారీ అమ్మకాలను ప్రకటించింది. ఆ కంపెనీ 27,474 యూనిట్లు విక్రయించింది. గత ఏడాది జూన్‌లో విక్రయించిన 19,608 యూనిట్లతో పోల్చితే ఇది 40% అధికం.
- జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా అమ్మకాలు 9% పడిపోయాయి. గత జూన్‌తో పోల్చితే అమ్మకాలు 5,125 నుంచి 4,644 యూనిట్లకి తగ్గాయి.

టూ వీలర్ అమ్మకాలు

- బజాజ్ ఆటో అమ్మకాలు 8% పెరిగి 1,99,983 యూనిట్ల నుంచి 2,16,451 యూనిట్లకు చేరాయి.
- టీవీఎస్ మోటార్ కూడా 8% వృద్ధితో 2,55,734 యూనిట్లు విక్రయించింది. సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా అమ్మకాల్లో 13% వృద్ధిని ప్రకటించింది.

యాక్సిస్ నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఇండెక్స్ ఫండ్. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఎన్ఎస్ఈలోని టాప్ 500 కంపెనీల వృద్ధి అవకాశాలను నిశితంగా పరిశీలించి ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేయనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 9. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. ఆ తర్వాత రూపాయి చొప్పున పెట్టుబడులు పెంచుకుంటూ పోవచ్చు. రిస్క్‌ను సర్దుబాటు చేసుకుంటూ దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దింది.

- శ్రీరామ్ ఫామ్ సొల్యూషన్స్.. ఐదు కొత్త తరం పంట సస్య రక్షణ, స్పెషాలిటీ ప్లాంట్ న్యూట్రిషన్ ఉత్పత్తులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి విడుదల చేసింది. ఇన్‌సెక్టిసైడ్స్ పోర్టుఫోలియోలో శ్రీరామ్ సైషో, క్రోన్, ట్రిక్టర్ పేరుతో వీటిని తీసుకువచ్చింది. అలాగే శ్రీరామ్ ప్రోటోబజ్ ప్లస్ పేరుతో స్పెషాలిటీ ప్లాంట్ ఉత్పత్తిని మార్కెట్లోకి తెచ్చింది.
- బంధన్ బ్యాంక్ తన ఖాతాదారుల కోసం ప్రత్యేక సదుపాయాన్ని ప్రారంభించింది. ప్రత్యక్ష పన్నులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు ఆదాయ పన్ను శాఖకు చెందిన టిన్ 2.0 ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటితోపాటు బ్యాంక్‌కు చెందిన 1,700 శాఖల్లో ఆఫ్‌లైన్ విధానంలో కూడా పన్ను చెల్లింపులను స్వీకరించనుంది.
- బజాజ్ ఆటో లిమిటెడ్ హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో కార్గో, ప్యాసింజర్ త్రీవీలర్స్ కోసం కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. వినాయక బజాజ్ పేరుతో ప్రారంభించిన ఈ షోరూమ్‌లో కంపెనీకి చెందిన అన్ని కార్గో, ప్యాసింజర్, ఎలక్ట్రిక్ త్రీ వీలర్స్ అందుబాటులో ఉండనున్నాయి.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని రైతుల కోసం స్వరాజ్ ట్రాక్టర్స్ అడ్వాన్స్‌డ్ పడ్లింగ్ సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. కంపెనీకి చెందిన స్వరాజ్ 843 ఎక్స్ఎం, 742 ఎక్స్‌టీ, 744 ఎఫ్ఈ, 855 ఎఫ్ఈ ట్రాక్టర్స్ మోడల్స్‌లో అధునాతన ఫీచర్లను పొందుపరిచింది. వరి సాగులోనూ, పడ్లింగ్ (దుక్కి దున్నటం) పనుల్లో ఈ మోడల్స్ రైతులకు అత్యంత సహాయకారిగా ఉంటాయని తెలిపింది.



అన్‌స్టాప బుల్

సరికొత్త శిఖరాలకు సూచీలు.. 80,000 మైలురాయి దిశగా సెన్సెక్స్

» మరో 443 పాయింట్లు పెరిగిన సూచీ

» ఆల్‌టైం రికార్డు స్థాయికి బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు

» రాణించిన ఐటీ, బ్యాంకింగ్ రంగ షేర్లు

» రూ.443 లక్షల కోట్లకు మార్కెట్ సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో బుల్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆసియా, ఐరోపా మార్కెట్ల సానుకూల సంకేతాలతో ఐటీ, బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్లు పుంజుకోవడంతో భారత ఈక్విటీ సూచీలు సోమవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ ఒక దశలో 528.27 పాయింట్లు ఎగబాకి 79,561 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 443.46 పాయింట్ల లాభంతో 79,476.19 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం 131.35 పాయింట్ల వృద్ధితో సరికొత్త ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 24,141.95 వద్ద ముగిసింది. అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో ఆ దేశ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ఈ సెప్టెంబరులోనే ప్రామాణిక వడ్డీ రేట్ల తగ్గింపునకు శ్రీకారం చుట్టవచ్చన్న ఆశలు ప్రపంచ మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయని విశ్లేషకులు పేర్కొన్నారు. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.3.9 లక్షల కోట్లు పెరిగి సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయి రూ.443.05 లక్షల కోట్లకు (5.31 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.
- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 20 లాభపడ్డాయి. టెక్ మహీంద్రా షేరు 2.98 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ కూడా రెండు శాతానికి పైగా పెరిగాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ ఒక శాతానికి పైగా రాణించాయి. ఎన్‌టీపీసీ షేరు అత్యధికంగా 2.23 శాతం క్షీణించింది.
- బ్లూచి‌ప్‌లతో పోలిస్తే, చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరిగాయి. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు సరికొత్త రికార్డు గరిష్ఠాలను తాకాయి. స్మాల్‌క్యాప్ సూచీ 1.58 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.11 శాతం వృద్ధిని నమోదు చేశాయి.
- రంగాలవారీ సూచీల్లో ఐటీ అత్యధికంగా 1.84 శాతం వృద్ధి చెందగా.. టెక్నాలజీ, కమోడిటీస్, టెలికాం కూడా ఒక శాతానికి పైగా పెరిగాయి.
- ఫారెక్స్ మార్కెట్ విషయానికొస్తే, డాలర్‌తో రూపాయి మారకం విలువ 10 పైసలు క్షీణించి 83.44 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒకదశలో 0.51% పెరిగి 85.43 డాలర్ల వద్ద ట్రేడైంది.

ఐపీఓకు నివ బుపా హెల్త్ ఇన్సూరెన్స్

నివ బుపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (గతంలో మ్యాక్స్ బుపా హెల్త్ ఇన్సూరెన్స్) పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రానుంది. ఇందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన రూ.2,200 కోట్ల షేర్లను ఆఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. తద్వారా కంపెనీ మొత్తం రూ.3,000 కోట్లు సమీకరించనుంది.

- పిల్లల వస్త్రాలను విక్రయించే ఆన్‌లైన్ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫస్ట్‌క్రై మాతృసంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,816 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన 5.44 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది.
- ప్రెసిషన్ ఇంజనీరింగ్ సేవల కంపెనీ శివాలిక్ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ ఐపీఓకు వచ్చేందుకు సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.335 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 41.3 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది.
- టెక్నాలజీ ఆధారిత సేవలందించే సజిలిటీ ఇండియా లిమిటెడ్ సైతం సెబీకి ఐపీఓ పత్రాలు సమర్పించింది. బెంగళూరుకు చెందిన ఈ కంపెనీ ఐపీఓ ద్వారా ప్రమోటర్‌కు చెందిన 98.44 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలని భావిస్తోంది.
- మురుగు శుద్ధి ప్లాంట్లు, ప్రాజెక్టులను టర్న్‌కీ పద్ధతిన అభివృద్ధి చేసే ఎన్విరో ఇన్‌ఫ్రా ఇంజనీర్స్ కూడా సెబీ వద్ద డీఆర్‌హెచ్‌పీ ఫైల్ చేసింది. ఐపీఓ ద్వారా సంస్థ 4.42 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్‌కు చెందిన 52.68 లక్షల షేర్లను కూడా అమ్మకానికి పెట్టనుంది.
- ఆగ్రోకెమికల్స్ తయారీదారు అంబే ల్యాబ్స్ ఐపీఓ ఈ నెల 4న ప్రారంభమై 8న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.65-68గా నిర్ణయించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.44.68 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. ఐపీఓ అనంతరం కంపెనీ షేర్లను ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో లిస్ట్ చేయనుంది.

వైఫై-6 రౌటర్ల తయారీలోకి సెల్‌కాన్

» జెడ్‌టీఈ టెలికాంతో జట్టు

» ఆగస్టు నుంచి తిరుపతి ప్లాంటులో ఉత్పత్తి

» 1,000 మందికి ఉపాధి అవకాశాలు



అమరావతి (ఆంధ్రజ్యోతి): సెల్‌కాన్ గ్రూప్ కొత్తగా వైఫై-6 రౌటర్ల తయారీలోకి ప్రవేశిస్తోంది. సెల్‌కాన్ అనుబంధ సంస్థ సెల్‌కాన్ రిసొల్యూట్ ఇందుకోసం టెలికమ్యూనికేషన్స్ పరికరాల తయారీలోని చైనా దిగ్గజ సంస్థ జెడ్‌టీఈ టెలికాంతో చేతులు కలిపింది. గత నెల 29న ఉండవల్లిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో జెడ్‌టీఈ సీఈవో లేవో చావ్, సెల్‌కాన్ గ్రూప్ సీఎండీ వై గురు, రిసొల్యూట్ గ్రూప్ ఫౌండర్, సీఎండీ రమీందర్ సోయిన్ ఈ వివరాలు వెల్లడించారు.

తిరుపతిలో ప్లాంటు: తిరుపతిలో ఉన్న ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ-1)లో సెల్‌కాన్ రిసొల్యూట్ ఇందుకోసం ప్రత్యేక ప్లాంట్ ఏర్పాటు చేయనుందని సెల్‌కాన్ గ్రూప్ సీఎండీ గురు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు కల్లా ఈ ప్లాంటులో వైఫై-6 రౌటర్ల ఉత్పత్తిని చేపట్టనున్నారు. తొలుత నెలకు 2 లక్షల యూనిట్లతో ఉత్పత్తిని ప్రారంభించి ఏడాది చివరి నాటికి దీన్ని 5 లక్షల యూనిట్లకు పెంచనున్నారు. విదేశాలకు ఈ రౌటర్లను ఎగుమతి చేయాలని కంపెనీ భావిస్తోంది. కాగా ఈ ప్లాంట్ ద్వారా తొలిదశలో 1,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని గురు తెలిపారు.

రాష్ట్రానికి శుభసూచకం: మంత్రి లోకేష్

చైనా దిగ్గజ సంస్థ జెడ్‌టీఈ ఏపీకి రావడం శుభసూచకమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. రానున్న రోజుల్లో జెడ్‌టీఈ గ్రూప్‌నకు చెందిన ఇతర విభాగాలు కూడా రాష్ట్రంలో తమ ఉత్పత్తుల తయారీని ప్రారంభించాలని ఆయన కోరారు. ఎలక్ట్రానిక్స్, ఐఓటీ రంగంలో కీలకంగా ఉన్న జెడ్‌టీఈతో జట్టు కట్టడం సంతోషాన్నిస్తోందని సెల్‌కాన్ గ్రూప్ సీఎండీ గురు తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,300 ▲	66,300 ▲	94,700 ▲
ముంబై	71,874 ▲	65,837 ▲	87,802 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	545
వరంగల్	527	గోదావరి	535
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	118
కర్నూలు	112	నెల్లూరు	118
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

జాబ్ క్యాలెండర్ రెండు వారాల్లో!

(మొదటిపేజీ తరువాయి)

యూపీఎస్సీ, జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ(ఎన్టీయే), ఆర్‌ఆర్‌బీ, ఆర్‌ఆర్‌సీ, బ్యాంకింగ్ వంటి ఇతర పోటీ పరీక్షల బోర్డులకు, రాష్ట్రీయ, కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు పంపనున్నట్లు తెలుస్తోంది. దీని వల్ల.. ఉద్యోగార్థులకు టీజీపీఎస్సీ షెడ్యూల్ సమయంలో.. ఇతర పరీక్షల అడ్డంకులను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర జాబ్ క్యాలెండర్ కూడా.. యూపీఎస్సీ వంటి సంస్థల షెడ్యూల్‌లను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్నట్లు సమాచారం. అయితే.. ఇప్పటికే అక్టోబరులో గ్రూప్-1 మెయిన్స్ తేదీలను ప్రకటించారు. అదేవిధంగా గ్రూప్-2 పరీక్షలను ఆగస్టులో నిర్వహిస్తారు. ప్రస్తుతం కొనసాగుతున్న నోటిఫికేషన్లను మినహాయించి.. పకడ్బందీగా జాబ్ క్యాలెండర్‌ను రూపొందిస్తున్నట్లు తెలిసింది.

నిరుద్యోగులకు భరోసాగా..

బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాల ప్రక్రియ నిర్లక్ష్యానికి గురైందని.. ఆ ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాలతో వివాదాలు కోర్టులకూ చేరాయని కాంగ్రెస్ నేతలు ముందు నుంచి చెబుతూ వస్తున్నారు. లీకేజీలు, పరీక్షల నిర్వహణలో లోపాల వల్ల పలు పరీక్షలు రద్దయ్యాయి. దీంతో.. నిరుద్యోగుల్లో అపనమ్మకం నెలకొంది. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కారు ఆ అపనమ్మకాన్ని పోగొట్టేలా చర్యలు తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు.. నిరుద్యోగుల్లో భరోసా కల్పించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయనుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు టీజీపీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసి, కొత్త పాలక మండలిని నియమించింది. పరీక్షల నిర్వహణను యూపీఎస్సీ తరహాలో చేపట్టేలా కట్టుదిట్టమైన విధానాలను అనుసరిస్తోంది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా యూపీఎస్సీ ఛైర్మన్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే.! ప్రభుత్వం కూడా టీజీపీఎస్సీ పరీక్షలపై కోర్టు వివాదాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే గ్రూప్-1 ప్రిలిమ్స్(2.0) రద్దుకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో చేసిన అప్పీల్‌ను ఉపసంహరించుకుంది. పకడ్బందీగా గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను నిర్వహించింది. ఇటీవలే ప్రాథమిక కీ విడుదలవ్వగా.. త్వరలో ఫలితాలు వెలువడనున్నాయి. ఉద్యోగాల నియామకాల విషయంలో గతంలో అడ్డంకిగా ఉన్న రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్ల విషయంలో కోర్టులు పలు తీర్పులనిచ్చాయి. ఆయా తీర్పులకు అనుగుణంగా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని అనుసరించింది. దీని ప్రకారమే టీజీపీఎస్సీ, మెడికల్ బోర్డు, పోలీస్, గురుకుల బోర్డుల ద్వారా నిర్వహించిన పలు పోస్టులకు సంబంధించి.. అధికారంలోకి వచ్చిన మొదటి వందరోజుల్లోనే 28,942మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించింది. టీజీపీఎస్సీ కూడా నియామకాల విషయంలో వేగాన్ని పెంచింది. గతంలో పెండింగ్‌లో ఉన్న గ్రూప్-4 ఫలితాలను విడుదల చేసింది. ఈ పోస్టులకు ప్రస్తుతం సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొనసాగుతోంది. 1,540 ఏఈఈ పోస్టులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయింది. వ్యవసాయ, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో ఎంపికైన జాబితా విడుదలైంది. హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పోస్టుల పరీక్షలు పూర్తవ్వగా.. డివిజనల్ అకౌంట్స్ అధికారి(డీఏవో) పరీక్షలు గత నెల 30న ప్రారంభమయ్యాయి. టెట్ పూర్తి చేసి. 11,062 పోస్టులతో డీఎస్సీని ప్రకటించింది.

25 వేల మంది టీచర్ల బదిలీ!

(మొదటిపేజీ తరువాయి)

విషయం తెలిసిందే. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న స్కూళ్లలో అక్కడ పనిచేస్తున్న టీచర్లు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈ స్కూళ్లకు రావడానికి ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆప్షన్లను నమోదు చేసుకోకపోవడంతో బదిలీ అయిన ఉపాధ్యాయులే కొన్నాళ్లు అక్కడ పనిచేయాల్సి ఉంటుందని, అలాంటి ఉపాధ్యాయులను విడుదల చేయొద్దని విద్యా శాఖ అధికారులు జిల్లాలకు ఆదేశాలు జారీ చేశారు. ఇలా బదిలీ అయి, ప్రస్తుతం విడుదల కాని ఉపాధ్యాయుల సంఖ్య సుమారు 10 వేల వరకు ఉంటుందని అంచనా. డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయులు వచ్చే వరకు, లేదా తాత్కాలిక సర్దుబాటులో భాగంగా డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులు వచ్చే వరకు ప్రస్తుతం బదిలీ అయిన ఉపాధ్యాయులు పాత స్కూల్‌లోనే పనిచేయాల్సి ఉంటుంది. రంగారెడ్డి జిల్లాలో సోమవారం స్కూల్ అసిస్టెంట్ బదిలీలను పూర్తి చేశారు. తర్వాత సీనియారిటీ జాబితాలను వెల్లడించి, పదోన్నతులను పూర్తి చేయనున్నారు. తర్వాత ఎస్జీటీలను బదిలీలను నిర్వహించనున్నారు.

విద్యుత్ కమిషన్ గడువు

పెంచారా? లేదా?

- కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ఆరా
- 30తో ముగిసిన గడువు.. పెంపుపై నేడో రేపో ఉత్తర్వులు!

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ విచారణ కమిషన్ గడువు పెంచారా? లేదా? గడువును పెంచుతూ ఉత్తర్వులు వెలువడ్డాయా? లేవా? అని.. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి సోమవారం ఆరా తీసినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో కుదుర్చుకున్న ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లను నామినేషన్ ప్రాతిపదికన అప్పగించడంపై జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 7న విచారణ ప్రారంభించిన కమిషన్ జూన్ 30లోగా నివేదిక ఇవ్వాల్సి ఉంది. కాళేశ్వరం కమిషన్‌కు కూడా గడువు జూన్ 30 దాకానే ఉండగా.. దాన్ని ఆగస్టు 31 దాకా (రెండునెలలు) పెంచుతూ నీటిపారుదల శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. విద్యుత్ కమిషన్ విషయానికి వస్తే.. విచారణ ప్రక్రియ కీలక దశలో ఉంది. అది పూర్తి కావడానికి మరో రెండునెలలైనా పట్టే అవకాశాలున్నాయి. మరోవైపు.. ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న ఎస్ఏఎం రిజ్వీని ప్రభుత్వం ఇటీవలే బదిలీ చేసింది. ఆయన స్థానంలో రోనాల్డ్‌రాస్‌ను నియమించింది. ఇంధన శాఖతో పాటు జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. గత పదేళ్లకాలంలో ఇంధన శాఖలో నియమితులైన అధికారుల్లో ఈయనే జూనియర్. ఆయన బాధ్యతలు స్వీకరించి శాఖపై అధ్యయనం చేస్తున్న క్రమంలోనే కమిషన్ గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో.. విద్యుత్ విచారణ కమిషన్ గడువు పెంపుపై మంగళ, బుధవారాల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు సమాచారం.

అనుమతుల్లేకుండా బీఆర్ఎస్ కార్యాలయం!

- తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోండి
- మునిసిపల్ అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం
- నిబంధనలు పరిశీలిస్తే ఎప్పుడో కూలగొట్టాల్సిందని వ్యాఖ్య



నల్లగొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ పట్టణ నడిబొడ్డులో రూ.100 కోట్ల విలువైన స్థలంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని అనుమతి లేకుండా నిర్మించారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ వెంటనే నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ స్థలాన్ని కాపాడేందుకు తాను కృషి చేస్తానన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న 33 కేవీ సబ్ స్టేషన్‌కు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఎవరూ అడగకపోతే నడిరోడ్డు మీద ఇళ్లు కట్టుకున్నా మునిసిపల్ అధికారులు ఏమీ అనేలా లేరని, ఇదేనా మీ వ్యవహారం అంటూ నిలదీశారు. సామాన్యులకు ఎలాంటి నిబంధనలు వర్తింపజేస్తారో... రాజకీయ పార్టీలకైనా, పెద్దవాళ్లకైనా అలాంటి నిబంధనలే అమలు చేయాలని అన్నారు. నిబంధనలు పరిశీలిస్తే బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఎప్పుడో కూలగొట్టి ఉండాల్సిందన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడం అందరి కర్తవ్యమని, బీఆర్ఎస్ కార్యాలయం నిర్మించిన విలువైన స్థలంపై జిల్లా కలెక్టర్ విచారణ జరపాలని కోరారు. ప్రతిదానికీ బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని, కానీ తాము ప్రజాప్రయోజనాల అంశంలో ఎన్నడూ రాజకీయాలు చేయలేదని పేర్కొన్నారు. రోడ్ల విస్తరణ సమయంలో వందలాది మందికి సంబంధించి, కోట్ల రూపాయల విలువైన ఆస్తులు కూలగొట్టినా, పరిహారం ఇవ్వకపోయినా తాము ఎవరినీ బదనాం చేయలేదన్నారు.

పన్ను చెల్లింపుదారుల వివరాలివ్వండి!

కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ.. రైతుభరోసా అమలుకు కసరత్తు

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉన్న ఆదాయపు పన్ను చెల్లింపుదారుల వివరాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం కేంద్రానికి లేఖ రాసింది. పన్ను చెల్లిస్తున్న వారి జాబితా ఇవ్వాలని కోరింది. రేవంత్ సర్కారు రైతు భరోసా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని చూస్తున్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వం భూమి ఉన్నవారందరికీ పథకాన్ని అమలు చేసిన నేపథ్యంలో దీన్ని ప్రక్షాళన చేస్తామని ప్రకటించింది. కేవలం సాగు చేసే భూములకే రైతుభరోసా ఇవ్వాలని, రాళ్లు, రప్పలు కొండలు, గుట్టలు, రహదారులకు ఇవ్వబోమని స్పష్టం చేసింది. అదే క్రమంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారుల వివరాలు కూడా సేకరిస్తోంది. అయితే పన్ను చెల్లించేవారికి రైతుభరోసా ఇవ్వాలా? వద్దా? అనే విషయంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఐటీ శాఖ నుంచి వివరాలు సేకరిస్తే రాష్ట్ర రైతుల్లో ఆదాయపు పన్ను చెల్లించే వారు ఎందరనే లెక్కలు తేలిపోతాయి. దీని ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. కేంద్రం అమలు చేస్తున్న పీఎం-కిసాన్ పథకాన్ని ఐటీ చెల్లింపుదారులకు వర్తింపజేయడం లేదు. రైతుభరోసా పథకాన్ని కూడా అదే పద్ధతిలో అమలు చేస్తారా? లేదా? అనేది తేలాల్సి ఉంది. ఇప్పటికే రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. అభిప్రాయ సేకరణ ముగిసిన తర్వాత మంత్రివర్గ ఉపసంఘం నివేదిక ఇచ్చే అవకాశాలున్నాయి. ఆ తర్వాత అసెంబ్లీలో చర్చించి, రైతుభరోసా మార్గదర్శకాలను ఖరారు చేయనున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మందులు లేక రోగుల ఇక్కట్లు

- వెంటనే సరఫరా చేయాలని ప్రభుత్వానికి ఎఫ్‌జీజీ వినతి

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో మందులు లేక రోగులు ఇక్కట్లకు గురవుతున్నారని, వెంటనే వాటిని సరఫరా చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి సోమవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రభుత్వాస్పత్రులకు మందులను సరఫరా చేయకపోవడంతో పేద రోగులకు ఇబ్బందిగా మారిందని పేర్కొన్నారు. డాక్టర్లు మందుల చీటీలను రాస్తున్నారని, ఆస్పత్రుల ఆవరణలోని జెనెరిక్ మందుల షాపుల్లో మాత్రం ఆ మందులు ఉండడం లేదని తెలిపారు. ఫలితంగా పేద రోగులు ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుక్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు ఎప్పుడు?:ఏలేటి

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ నోటిఫికేషన్లు ఎప్పుడు జారీ చేస్తారో, డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల చేస్తారో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడచిపోయినా ఒక్క ఉద్యోగానికీ నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. కార్పొరేట్ ఆసుపత్రులను ప్రోత్సహించేలా ప్రభుత్వ వైఖరి ఉందని ఆరోపించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల ఇంటి వద్ద చావు డప్పు కొట్టాలని నాడు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో పిలుపునిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి... ఇప్పుడు కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ఎలాంటి డప్పు కొట్టాలో చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి ఆ పార్టీకి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని మహేశ్వర్‌రెడ్డి శాసనసభ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.

హైకోర్టులో కేసీఆర్‌కు ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)



విచారించినప్పటికీ.. విద్యుత్తు కమిషన్‌కు ప్రభుత్వం అప్పగించిన అంశాలు (టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్) చాలా విస్తృతమైనవని పేర్కొంది. అందుకే ఆ అంశాలపై విచారణ చేపట్టే అధికారం కమిషన్‌కు ఉందని స్పష్టం చేసింది. కమిషన్ ఛైర్మన్.. చీఫ్ జస్టిస్‌గా ఒక ఉన్నతమైన రాజ్యాంగబద్ధ పదవిని నిర్వహించారనే విషయాన్ని మరువరాదని హితవు పలికింది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి తన ఎదుట విచారణలో ఉన్న అంశాలను మాత్రమే మీడియా సమావేశంలో వెల్లడించారని, అందులో పక్షపాతం ఏమీ లేదని పేర్కొంది. పక్షపాతం అంటే కేవలం ఆరోపణ లేదా ఊహించుకోవడం కాదని, దానిని నిరూపించాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కీలక అంశాలను స్పృశిస్తూ తీర్పు వెలువరించడానికి వీలుగా ధర్మాసనం పలు ప్రశ్నలను రూపొందించి.. వాటికి సమాధానాలిచ్చింది.

● ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు చేయాలన్న అప్పటి ప్రభుత్వ నిర్ణయాన్ని.. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాలపై తీసుకున్న నిర్ణయాలను ఇప్పటికే ఈఆర్సీ విచారించింది కదా? మళ్లీ దానిపై విచారణ చేపట్టే పరిధి కమిషన్ ఉందా? అనే ప్రశ్నకు ధర్మాసనం బదులిస్తూ, '2015లో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల విద్యుత్తు సంస్థల మధ్య పీపీఏలు జరిగాయి. ఈ ఒప్పందాలను, టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పలువురు ఈఆర్సీని ఆశ్రయించారు. ఈఆర్సీ బహిరంగ విచారణ చేపట్టి 2017లో తీర్పు వెల్లడించింది. అలాగే ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీ సైతం 2018లో టారిఫ్‌లను నిర్ధారించింది. ఈ తీర్పులపై అప్పీళ్లు దాఖలు కాగా.. అవి అప్పీలేట్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీలు ఇచ్చిన తీర్పు కాపీలను పిటిషనర్ సమర్పించకపోయినా.. అఫిడవిట్ ద్వారా ఈ వ్యవహారంపై రెండు రాష్ట్రాల ఈఆర్సీలు విచారణ చేపట్టినట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వం విద్యుత్తు కమిషన్‌కు అప్పగించిన అంశాల్లో ఈఆర్సీ విచారించిన అంశాల కంటే విస్తృతమైన అంశాలున్నాయి. కమిషన్ గుర్తించిన లోపాలకు, ఆర్థికపరమైన నష్టాలకు బాధ్యులు ఎవరో గుర్తించే బాధ్యతను సైతం కమిషన్‌కు అప్పగించారు. మరోవైపు ఈఆర్సీ ఇప్పటికే విచారించిన అంశాలపై టారిఫ్ నిర్ధారణ వంటి విషయాలు ప్రస్తుత విద్యుత్తు కమిషన్‌కు అప్పగించిన బాధ్యతల్లో లేవు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఈఆర్సీ విచారించిన అంశాలపై విచారించే అధికార పరిధి ఎంక్వైరీ కమిషన్‌కు లేదనే వాదన ఆమోదయోగ్యం కాదు. ఈఆర్సీ విచారించినవి, కమిషన్‌కు అప్పగించిన అంశాలు వేర్వేరు అయినందున కమిషన్‌కు పరిధి ఉంటుంది" అని ధర్మాసనం వివరించింది.

● కమిషన్ పక్షపాత, వివక్షాపూరిత ధోరణితో వ్యవహరిస్తోందా? ప్రెస్‌మీట్ పెట్టడం ద్వారా తన ఎదుట ఉన్న వ్యవహారాలపై ముందే ఓ నిర్ణయం ప్రకటించిందా? అనే ప్రశ్నకు ధర్మాసనం సమాధానం ఇస్తూ, 'పిటిషనర్ (కేసీఆర్) ప్రతివాదిగా చేర్చిన మూడో ప్రతివాది కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డికి నోటీసులు జారీ చేయాలంటే పక్షపాతం అనే అంశంపై ముందుగా ఈ కోర్టు సంతృప్తి చెందాల్సి ఉంటుంది. కమిషన్ ఛైర్మన్ ఏప్రిల్ 14న పిటిషనర్‌కు నోటీసులు జారీచేశారు. పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నందున రాలేనని, సమయం పొడిగించాలని మే 1న పిటిషనర్ సమాధానం ఇచ్చారు. మళ్లీ కమిషన్ పిటిషనర్‌కు లేఖ రాస్తూ మూడు నెలల్లో రిపోర్ట్ ఇవ్వాల్సి ఉందని.. మే 13న ఎన్నికలు ముగుస్తున్నందున మే 31 లేదా జూన్ 15 లోపు మీకు తగిన సమయాన్ని వెల్లడించండని కోరింది. ఆ తర్వాత జూన్ 11న కమిషన్ ఛైర్మన్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఆ ప్రెస్‌మీట్‌కు సంబంధించిన ఆంగ్ల తర్జుమాను పరిశీలించాం. ఇందులో.. తన ఎదుట కొనసాగుతున్న ప్రొసీడింగ్స్ స్టేటస్‌ను కమిషన్ మీడియాకు వెల్లడించింది. కమిషన్ ఛైర్మన్ ముందే ఓ నిర్ణయానికి వచ్చేశారని చెప్పడానికి ఇందులో ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదు. తన ముందున్న మెటీరియల్ ఆధారంగా తాను తెలుసుకున్న అంశాలను రికార్డు చేయడం కమిషన్ విధి. కమిషన్ ఛైర్మన్ చీఫ్ జస్టిస్‌గా రాజ్యాంగబద్ధమైన పదవి నిర్వహించారనే విషయం మరిచిపోరాదు.

ఆరోపణలకు ఆధారం లేదు..

కేవలం మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ ఛైర్మన్ వ్యక్తిగత పక్షపాతంతో వ్యవహరించారనే ఆరోపణ చేస్తున్నారే తప్ప మరే ఆధారం లేదు. పక్షపాతం చూపించారనే ఆరోపణ కేవలం ఊహించుకోవడం ద్వారా చేయకూడదు.. దానిని నిరూపించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో పక్షపాతం అనే ఆరోపణను నిరూపించడంలో పిటిషనర్ విఫలమయ్యారు. ఈ మేరకు అన్ని అంశాలకు సమాధానం లభించింది. అలాగే ప్రభుత్వం జారీచేసిన కమిషన్ ఏర్పాటు జీవో, సెక్షన్ 8(బీ) కింద కమిషన్ పిటిషనర్‌కు ఇచ్చిన నోటీసు కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్ - 1952కు విరుద్ధంగా ఉందన్న వాదన సైతం ఆమోదయోగ్యం కాదు. పిటిషనర్ నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో పాల్గొన్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన తర్వాతే నోటీసు జారీచేస్తున్నట్లు కమిషన్ పేర్కొంది' అని ధర్మాసనం తీర్పులో వెల్లడించింది. ఎంక్వైరీ కమిషన్ అనేది నిజనిర్ధారణ సంఘం మాత్రమేనని, ఆ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌ను ప్రభుత్వం అమలు చేయవచ్చు.. చేయకపోనూ వచ్చని తెలిపింది. కమిషన్ ఇచ్చే నివేదికను అపాయింటింగ్ అథారిటీ అయిన ప్రభుత్వం అంగీకరించవచ్చు.. తిరస్కరించవచ్చని, కమిషన్ ఇచ్చే నివేదిక అంతిమమూ కాదు.. దానికి నిర్ణయాత్మక శక్తీ ఉండదని పేర్కొంది. తన నివేదికను అమలు చేసే అధికారం సైతం కమిషన్‌కు లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అడ్మిషన్ దశలోనే కొట్టేసింది.

కేసీఆర్‌కు మరో చాన్స్ ఇద్దామా!

- లేఖ రాసే యోచనలో జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్
- విద్యుత్తు రఘు, కోదండరామ్‌ను క్రాస్ ఎగ్జామిన్.. చేయడానికి కేసీఆర్‌కు అవకాశంపై పరిశీలన

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ల నిర్మాణంలో వచ్చిన ఆరోపణలపై మాజీ సీఎం కేసీఆర్‌కు మరోసారి లేఖ రాసే అంశాన్ని జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ పరిశీలిస్తోంది. ఆరోపణలు చేసిన విద్యుత్తు రంగ నిపుణులు, ఇతర ఫిర్యాదుదారులను ప్రశ్నించే (క్రాస్ ఎగ్జామిన్) అవకాశం కేసీఆర్‌కు ఇవ్వాలా? లేక వారి ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోవాలా? అనే దానిపై కమిషన్ మంగళవారం నిర్ణయం తీసుకోనుంది. పోటీ బిడ్డింగ్ లేకుండా ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోవడం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లను నామినేషన్ పద్ధతిలో నిర్మించే బాధ్యతను కట్టబెట్టడంపై కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ నిర్ణయాలకు కేసీఆరే కారకుడంటూ విద్యుత్తు నిపుణులు కంచర్ల రఘు, ఎం.తిమ్మారెడ్డి, ఎం.వేణుగోపాల్‌రావు, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్.. నర్సింహారెడ్డి కమిషన్‌కు నివేదించారు. ఈ ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కమిషన్.. వారిని క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి కేసీఆర్‌కు అవకాశం ఇస్తూ కేసీఆర్‌కు లేఖ రాసింది. ఈ లేఖపై వారం రోజుల్లో స్పందించాలని కోరింది. కానీ, కేసీఆర్ మాత్రం కమిషన్ ఏర్పాటునే సవాలు చేశారు. కమిషన్‌ను రద్దు చేయాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే కేసీఆర్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. కమిషన్‌ను రద్దు చేసేందుకు నిరాకరించింది. దీంతో సాక్షులను ప్రశ్నించేందుకు వీలుగా కేసీఆర్‌కు మరో అవకాశం ఇవ్వాలా? లేకవారి ఫిర్యాదులను సాక్ష్యాలుగా పరిగణించాలా? అని కమిషన్ యోచిస్తోంది. సహజ న్యాయసూత్రాల ప్రకారం ఎవరైనా సాక్షులు ఆరోపణలు చేస్తే.. వారిని క్రాస్ ఎగ్జామిన్ చేసే అవకాశం న్యాయస్థానం/కమిషన్ ఇస్తుంది.

హైకోర్టు నిర్ణయం..

కేసీఆర్‌కు చెంపపెట్టు

- ఇకనైనా 'కమిషన్' ముందు విచారణకు హాజరవ్వాలి: ఆది శ్రీనివాస్
- తుగ్లక్‌లా పాలించినందుకే కేసీఆర్, జగన్‌ను ఇంటికి పంపారు: యెన్నం

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోళ్లకు సంబంధించి విచారణ కమిషన్‌ను రద్దు చేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేయడం.. ఆయనకు చెంపపెట్టు లాంటిదని ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం చేసిన కేసీఆర్.. చట్టం ముందు అందరూ సమానమేనన్న సంగతి మరిచారని విమర్శించారు. ఇకనైనా జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ముందు ఆయన హాజరై వాస్తవాలు చెప్పాలన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విసిరిన సవాల్ మేరకే ప్రభుత్వం విచారణ కమిషన్‌ను వేసిందన్నారు. ఏ విచారణకైనా సిద్ధమని ప్రకటించి ఇప్పుడు పారిపోతారా? అంటూ నిలదీశారు. యెన్నం మాట్లాడుతూ.. విద్యుత్తు ఒప్పందాల్లో తీసుకున్న కమీషన్లు బయటపడతాయనే విచారణకు హాజరు కావడానికి కేసీఆర్ భయపడుతున్నారన్నారు. 'తెలుగు రాష్ట్రాల్లో పిచ్చి తుగ్లక్ పాలన చేసిన కేసీఆర్, జగన్‌లకు ప్రజలు ఇంటికి పంపారు. వారిని ఓడించడం ద్వారా తెలుగు ప్రజలు తెలివిగల వారని నిరూపించారు' అని వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల పక్షాన నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌కు ఏదైనా జరిగితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులదే బాధ్యతని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. పదేళ్ల పాటు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని మండిపడ్డారు. యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ.. మోతీలాల్ నాయక్‌ను రెచ్చగొట్టి బీఆర్ఎస్ నేతలు దీక్షకు దింపారని మండిపడ్డారు. ఏడు నెలల సర్కారుపై విమర్శలు చేయడానికి హరీశ్‌కు సిగ్గుండాలన్నారు. చనగాని దయాకర్ మాట్లాడుతూ.. కేయూలో సునీల్, అశోక్‌నగర్‌లో ప్రవల్లిక చనిపోతే.. ఇతర కారణాలతో చనిపోయారంటూ తప్పుగా చిత్రీకరించింది కేటీఆర్ కాదా అని ఫైర్ అయ్యారు.

ఆ విషయం తెలిసే బీఆర్ఎస్ డ్రామాలు..

ఉద్యమ సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని అగ్గిపెట్టె దొరకలేదంటూ డ్రామాలాడి.. యువకులు, విద్యార్థుల మరణాలకు కారణమైన హరీశ్ ఇవాళ నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడుతున్నారని తెలంగాణ కాంగ్రెస్ ధ్వజమెత్తింది. త్వరలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించబోతున్న విషయం తెలిసే బీఆర్ఎస్ నేతలు.. కొత్త డ్రామాకు తెరలేపారని 'ఎక్స్' వేదికగా ఆరోపించింది.

వైఎస్ 75వ జయంతికి రండి!

- మంత్రి రాజనర్సింహకు షర్మిల ఆహ్వానం

ఈనెల 8వ తేదీన ఏపీసీసీ తరఫున విజయవాడలో భారీ ఎత్తున నిర్వహిస్తున్న వైఎస్ఆర్ 75వ జయంతి కార్యక్రమానికి రావాలని రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహను ఏపీసీసీ చీఫ్ షర్మిల ఆహ్వానించారు. మంగళవారం సీఎం రేవంత్‌ని కూడా ఆమె ఆహ్వానించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

కాంగ్రెస్‌లోకి బండా ప్రకాష్?

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఫొటో వైరల్.. ఖండించిన శాసనమండలి వైస్ ఛైర్మన్

- బీఆర్ఎస్‌ను వీడటం లేదని స్పష్టీకరణ
- బస్వరాజు సారయ్య కూడా కాంగ్రెస్‌లోకే

వరంగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్‌లో మరో వికెట్ పడనుందా? శాసనమండలి వైస్ ఛైర్మన్ బండా ప్రకాష్ కాంగ్రెస్‌లో చేరనున్నారా? అంటే అవుననే ప్రచారం జరుగుతోంది. సోమవారం ఆయన హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిశారంటూ ఓ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బండా ప్రకాష్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు కొంతకాలంగా ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడంతో ఆయన పార్టీ మారడం ఖాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బలమైన ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన బండా ప్రకాష్‌ను పార్టీలో చేర్చుకోవడం ద్వారా ఆ వర్గానికి దగ్గర కావాలనే ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉన్నట్టు సమాచారం. పాతికేళ్లకు పైగా కాంగ్రెస్‌లో కొనసాగిన బండా



సీఎం రేవంత్‌ను బండా ప్రకాష్ కలిసినట్టుగా వైరల్ అవుతున్న ఫొటో

ప్రకాష్ 2017లో బీఆర్ఎస్‌లో చేరి 2018లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2021లో ఈటల రాజేందర్ బీజేపీలో చేరటంతో.. బీఆర్ఎస్ అధిష్ఠానం బండా ప్రకాష్‌తో రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయించి ఎమ్మెల్యేల కోటాలో శాసన మండలి సభ్యుడిని చేసింది. మండలి డిప్యూటీ ఛైర్మన్‌ను చేసింది. ఆయన పదవీకాలం 2027 నవంబరు 30 వరకు ఉంది. కాగా, మండలిలో కాంగ్రెస్‌కు మెజారిటీ లేకపోవడటంతో కనీసం 16 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను చేర్చుకోవాలని ఆకర్ష్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లాకు చెందిన ఆరుగురు ఎమ్మెల్సీల్లో నలుగురిని తీసుకుంటారనే ప్రచారం జరిగింది. గత శనివారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనకు వచ్చిన సందర్భంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య.. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో రహస్యంగా చర్చలు జరిపారు. దీంతో బండా ప్రకాష్‌తోపాటు సారయ్య కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరు నేతలకు కాంగ్రెస్‌తో పాతికేళ్లకు పైగా అనుబంధం ఉంది.

బీఆర్ఎస్‌ను వీడటం లేదు: బండా ప్రకాష్

తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని బండా ప్రకాష్ అన్నారు. బీఆర్ఎస్‌ను వీడటం లేదని స్పష్టం చేశారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడుతూ.. సోమవారం సాయంత్రం తాను హైదరాబాద్‌కు వచ్చానని, సీఎం రేవంత్‌రెడ్డిని కలవలేదని చెప్పారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటో పాతది అయి ఉండొచ్చునన్నారు.

ఫిరాయింపులను ప్రోత్సహించలే

మేం విలీనమే చేసుకున్నాం: కేటీఆర్.. జంపింగ్ సంస్కృతికి బీజం వేసింది కాంగ్రెస్సే

- కవితక్క త్వరలో వస్తది... జగిత్యాలలో తిరుగుతది: కేటీఆర్



జగిత్యాల, హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఫిరాయింపులకు పాల్పడ్డ ప్రజా ప్రతినిధులను డిస్‌క్వాలిఫై చేయాలని రాహుల్ గాంధీ, పార్టీలు మారే ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టాలని ఇదే సీఎం రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు అన్నారని కానీ, ఇప్పుడు తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి ఎలా చేర్చుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. ఇప్పటివరకు ఆరుగురు ఎమ్మెల్యేలను చేర్చుకున్న కాంగ్రెస్ పార్టీని, రేవంత్‌ను కూడా రాళ్లతో కొట్టాలా? లేదా? అనేది ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. పార్టీ ఫిరాయింపులను ధైర్యంగా ప్రశ్నించడంతో పాటు ఢిల్లీకి తన వాణిని వినిపించింది ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఒక్కరే అని తెలిపారు. జగిత్యాలలో సోమవారం జరిగిన జిల్లా బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. దేశంలో ఆయారాం, గయారాం సంస్కృతికి బీజం వేసింది కాంగ్రెస్, ఇందిరా గాంధీయేనని విమర్శించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంపై ఆయన మాట్లాడుతూ.. సంజయ్ బీఆర్ఎస్‌కు గడ్డిపోచతో సమానమన్నారు. గతంలో 2014లో సంపూర్ణమైన మెజార్టీతో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు రూ.50 లక్షలతో అడ్డంగా దొరికిపోయి, జైలుకు వెళ్లిన దొంగ రేవంత్ రెడ్డి అని విమర్శించారు. గతంలో తమ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించలేదని, టీడీఎల్పీ, బీఎస్పీఎల్పీలు విలీనం అయ్యాయని, ఒక్కొక్కరిని పార్టీలోకి తీసుకోలేదని చెప్పారు. 'పెద్దలు ఎప్పుడూ ఒకటి చెబుతుంటారు... రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయని. మీ జగిత్యాల ఎమ్మెల్యే ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన చావనీ... మనం ధైర్యంగా నిలబడుదాం.... స్థానిక సంస్థల ఎన్నికల్లో మీకు అండగా మేమంతా ఉంటాం... కవితక్క కూడా వస్తది... తప్పకుండా తిరుగది... మీకందరికీ అండగా ఉంటది... ఎట్లనయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేను గెలిపించామో... అంతకంటే డబుల్ కష్టం చేద్దాం' అంటూ జైలులో ఉన్న కవిత త్వరలోనే వస్తదన్న సంకేతాన్ని ఇచ్చే విధంగా కేటీఆర్ మాట్లాడారు. నిన్నటి వరకు మేడిగడ్డ మేడి పండులాంటిది.. మరమ్మతులు చేసినా పనికిరాదు.. రూ.లక్ష కోట్లు బూడిదలో పోసిన పన్నీరని విమర్శించి, ఇప్పుడు మరమ్మతులు పూర్తి చేశామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, దీనిప్రకారం.. ఇంత కాలం కాంగ్రెస్ చేసింది.. విష ప్రచారమేనని తేలిపోయిందని కేటీఆర్ ట్వీట్ చేశారు. .

నిరసన తెలిపే హక్కు లేదా?: కేటీఆర్

ప్రజాపాలనలో నిరసన తెలిపే హక్కు కూడా లేదా? డిమాండ్ల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న నిరుద్యోగులపై లాఠీచార్జి చేసిన పోలీసుల తీరు బాగోలేదని కేటీఆర్ పేర్కొన్నారు. నిరుద్యోగుల పక్షాన దీక్ష చేస్తున్న మోతీలాల్ పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గెల్లుశ్రీనివాస్ యాదవ్, రాకేశ్ రెడ్డి సహా పలువురిని అరెస్టు చేయడం తగదని అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని నేడొక ప్రకటనలో కేటీఆర్ హెచ్చరించారు.

ఫాక్స్‌కాన్ తెచ్చింది కేటీఆర్ : బీఆర్ఎస్

రాష్ట్రానికి ఫాక్స్‌కాన్ సంస్థను తెచ్చింది మాజీ మంత్రి కేటీఆర్ అయితే.. దాన్ని మరచిపోయే.. సీఎం రేవంత్‌రెడ్డి వల్లే ఆ సంస్థ వచ్చిందని.. రాష్ట్రంలో ఏం జరిగినా.. అన్నీ ఆయనే చేశారంటూ కాంగ్రెస్ గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు. ఎంపీగా ఉన్న సమయంలో కంటోన్మెంట్ బోర్డు సమావేశానికి హాజరుకాని రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు తన వల్లే జీహెచ్ఎంసీలో విలీనమైందని చెప్పుకోవడం విచిత్రంగా ఉందన్నారు.

ప్రభుత్వ సలహాదారుగా కేఎస్ శ్రీనివాసరాజు

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాసరాజును ప్రభుత్వ సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఆయనను మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టుల సలహాదారుగా నియమిస్తూ ఇందుకు సంబంధించిన ఇతర ఉత్తర్వులను తర్వాత విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. శ్రీనివాసరాజు ఇంతకు ముందు వరకు రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శిగా పని చేశారు.

త్వరలో 'ప్రజావాణి'కి సీఎం రేవంత్: చిన్నారెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తోన్న 'ప్రజావాణి' కార్యక్రమాన్ని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించనున్నారు. జ్యోతిబా పూలె ప్రజా భవన్‌ను సందర్శించి ప్రజలతో కాసేపు ముచ్చటిస్తారని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ జి.చిన్నారెడ్డి తెలిపారు.

గవర్నర్ ఓఎస్డీగా సిరిసెట్టి సంకీర్త్

» 8 మంది ఐపీఎస్‌ల బదిలీ.. త్వరలో సీనియర్లు కూడా

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఐపీఎస్‌ల బదిలీల పరంపర కొనసాగుతోంది. జూన్ 17న 28 మంది ఐపీఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం తాజాగా మరో 8 మందిని బదిలీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు 8 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సీనియర్ ఐపీఎస్‌ల బదిలీలకూ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. త్వరలోనే సీనియర్ ఐపీఎస్‌ల బదిలీ ఉత్తర్వులు వెలువడనున్నాయి.

పవర్‌గ్రిడ్ (దక్షిణ) సీజీఎంగా అఖిలేష్ పాఠక్



పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ దక్షిణ ప్రాంత(సదరన్ రీజియన్) ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-1(తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక) చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం)గా అఖిలేష్ పాఠక్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని పవర్‌గ్రిడ్ కార్యాలయంలో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అఖిలేష్ పాఠక్‌కు పవర్ ట్రాన్స్‌మిషన్, పవర్ ప్రాజెక్టుల రంగంలో 31 ఏళ్ల అనుభవం ఉంది.

టిమ్స్ 14 అంతస్తులకే పరిమితం:దామోదర

హైదరాబాద్‌లో నిర్మితమవుతున్న నాలుగు టిమ్స్(తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రుల ఎత్తును 14 అంతస్తులకే పరిమితం చేశామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. నాలుగు ఆస్పత్రులని... ఒక్కో దాంట్లో ఒక్కో ప్రత్యేకత(స్పెషలైజేషన్) ఉండేలా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రభుత్వ వైద్యులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... బీఆర్ఎస్ హయంలో నిబంధనలకు విరుద్ధంగా టిమ్స్ ఆస్పత్రులను 24 అంతస్తుల్లో నిర్మించాలనుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం నిర్మాణ నిబంధనల మేరకే వాటి ఎత్తును తగ్గించినట్లు స్పష్టం చేశారు. ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల్లో హాస్టల్ భవనాలను రెండేళ్లలోపే నిర్మిస్తామని చెప్పారు. ఆ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్న.. శాఖలోని కీలక విభాగాలకు హెచ్‌వోడీలను నియమించలేదని, ప్రస్తుత ఇన్‌చార్జిల స్థానంలో రెగ్యులర్ హెచ్‌వోడీలను సీనియారిటీ, సమర్థత ఆధారంగా నియమిస్తామని వెల్లడించారు.

త్వరలోనే మంత్రివర్గ విస్తరణ!

త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, ఐదారుగురికి క్యాబినెట్‌లో చోటు దక్కే అవకాశముందని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ కీలక అంశాలను వెల్లడించారు. నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, హైదరాబాద్ నుంచి దానం నాగేందర్‌కు, నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. సీతక్కకు హోంశాఖ కేటాయించే అవకాశాలు లేకపోలేదని చెప్పారు.

టీజీ న్యాబ్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోల బలోపేతం

» కొత్త వాహనాలు సమకూర్చిన ప్రభుత్వం

» నేడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్), తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే టీజీ న్యాబ్‌కు పూర్తిస్థాయి డైరెక్టర్‌ను నియమించిన ప్రభుత్వం అవసరమైన అధికారులు, సిబ్బందిని కేటాయించింది. తెలంగాణలో డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తుపదార్థాల జాడ లేకుండా చేయాలన్న లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం అందుకోసం టీజీ న్యాబ్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించింది. అందులో భాగంగానే టీజీ న్యాబ్‌కు అవసరమైన వాహనాలను సమకూర్చింది. టీజీ న్యాబ్‌కు కొత్తగా 27 కార్లు, 40 ద్విచక్ర వాహనాలు సమకూర్చారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు 14 కార్లు, 30 ద్విచక్ర వాహనాలు సమకూర్చారు. మంగళవారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి నూతన వాహనాల్ని ప్రారంభిస్తారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం

» త్వరలో సర్కారుకు నివేదిక ఇవ్వండి: భట్టి విక్రమార్క

» బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్లకు పెద్దపీట: పొంగులేటి

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఇతర రాష్ట్రాలకు అధికారులను పంపి అధ్యయనం చేయించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. పూర్తి వివరాలతో ఒక నివేదికను తయారు చేసి, త్వరగా ప్రభుత్వానికి అందజేయాలన్నారు. ఈ ఏడాది ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని చెప్పారు. సోమవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార-పౌర సంబంధాల శాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో పేదలకు అక్కడి ప్రభుత్వాలు నిర్మిస్తున్న ఇళ్ల నమూనాలు, లబ్ధిదారుల ఎంపిక విధానంపై ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు సోలార్ విద్యుత్తు ఏర్పాటు తప్పనిసరని.. నిర్మాణ సమయంలోనే సోలార్ విద్యుత్తు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధ్యయనానికి హౌసింగ్ శాఖ అధికారులు మూడు బృందాలుగా ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నట్లు అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. చెన్నై, బెంగళూర్, ముంబైలలో ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపిక తదితర విషయాలపై అధ్యయనం చేస్తారని, ఆ తర్వాత నివేదిక ఇస్తామని తెలిపారు. పేదవాడి ఆకలి తీర్చడం ఎంత ముఖ్యమో తలదాచుకోవడానికి నీడ కల్పించడం అంతకన్నా ముఖ్యమని మంత్రి పొంగులేటి అన్నారు. ఈ ఏడాది పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నామన్నారు. వచ్చే బడ్జెట్లోనూ నిధుల కేటాయింపునకు పెద్ద పీట వేస్తామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 22.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, వెల్లడించారు.

యాసంగిలో 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు!

» సేకరణ పూర్తిచేసిన రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ

హైదరాబాద్, జులై 1(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ పూర్తిచేసింది. మొత్తం 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసింది. వాస్తవానికి మే నెలాఖరునే ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండగా... యాసంగిలో పంటలు ఆలస్యంగా సాగుచేసిన రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు గడువు పొడిగించి... జూన్ 30వ తేదీ నాటికి కొనుగోళ్లు పూర్తిచేసింది. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 4,28,215 మెట్రిక్ టన్నులు, అత్యల్పంగా ఆదిలాబాద్‌లో 412 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. సేకరణ పూర్తవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన 7 వేల పైచిలుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది.

ఖైదీల 'క్షమాభిక్ష'కు మార్గం సుగమం!

విడుదలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదముద్ర

» విడుదలయ్యే వారికి ఉపాధి చూపాలని సీఎం రేవంత్‌కు సూచించిన గవర్నర్

» రేపు చర్లపల్లిలో జాబ్ మేళా

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో మగ్గుతూ.. సత్ప్రవర్తన కలిగిన, అనారోగ్యం, వయోభారంతో బాధపడుతున్న ఖైదీలను క్షమాభిక్షపై విడుదల చేసేందుకు మార్గం సుగమమైంది. క్షమాభిక్షపై ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలకు గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. గత జనవరి 26న జైళ్ల శాఖ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్లల్లో ఉన్న వారిలో 231 మంది క్షమాభిక్షకు అర్హులైన ఖైదీలు ఉన్నారు. అందులో గత ఐదు నెలల్లో 20 మంది విడుదలయ్యారు. మిగిలిన 210 మంది ఈ వారంలో విడుదల కానున్నారు. వాస్తవానికి గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ అనంతరం ఖైదీల విడుదలపై సోమవారమే ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. కానీ, క్షమాభిక్షపై జైలు నుంచి విడుదలయ్యే ఖైదీలకు ఉపాధి కల్పించాలని గవర్నర్ రాధాకృష్ణన్ సీఎంకు సూచించారు. దీంతో క్షమాభిక్షపై విడుదలయ్యే ఖైదీలకు ఉపాధి అంశంపై స్పష్టత ఇవ్వాలంటూ సాయంత్రం 4 గంటలకు జైళ్ల శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ క్రమంలో క్షమాభిక్షకు ఎంపికైన ఖైదీలందరినీ బుధవారం చర్లపల్లి జైలుకు తరలించనున్నారు. వారికి జాబ్ మేళా నిర్వహించి ఆసక్తి, అర్హత మేరకు వారు ఎక్కడ పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారనేది అధికారులు తెలుసుకోనున్నారు. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పెట్రోల్ బంకులతో పాటు డ్రైవర్లు, డేటా ఆపరేటర్లు, ఇతర విభాగాల్లో వారి ఆసక్తి మేరకు ఉపాధి అవకాశం కల్పిస్తారు. అవసరమైన వారికి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి చూపించనున్నారు. జాబ్‌మేళా పూర్తయిన తర్వాత ఒకట్రెండు రోజుల్లో ఖైదీల విడుదలపై ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

విపత్తు నిర్వహణ విభాగం ఇక హైడ్రా

ఇప్పటిదాకా జీహెచ్‌ఎంసీలో భాగం.. ప్రత్యేక వ్యవస్థగా విస్తరించాలని సీఎం నిర్ణయం

» హైడ్రాకు అధిపతిగా డీఐజీ స్థాయి పోలీస్ అధికారి

» జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాల నుంచి హైడ్రాలో ప్రత్యేక బృందాలు

హైదరాబాద్ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీలో భాగంగా ఉన్న విపత్తుల నిర్వహణ విభాగాన్ని ఒక ప్రత్యేక వ్యవస్థగా విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. దానికి హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్(హైడ్రా)గా నామకరణం చేశారు. హైడ్రా పరిధిని కూడా అవుటర్ రింగ్ రోడ్డు లోపలి భాగం మొత్తానికి విస్తరించారు. అంటే, జీహెచ్‌ఎంసీతో పాటు ఓఆర్ఆర్ లోపల ఉన్న 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాలు హైడ్రా పరిధిలోకి వస్తాయి. అంతేకాకుండా డీఐజీ స్థాయి అధికారి హైడ్రాకు డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. ఎస్పీ స్థాయి అధికారులు అడిషనల్ డైరెక్టర్లుగా ఉంటారు. హైడ్రా కేవలం వరదల్లో, ఇతర విపత్తుల్లో వచ్చినపుడే రంగంలోకి దిగడం కాకుండా వాటికి కారణం అవుతున్న మూల సమస్యల మీద కూడా దృష్టి సారిస్తుంది. అంటే, చెరువులు, నాలాల ఆక్రమణలపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచుతుంది. బ్రాండ్ హైదరాబాద్ విషయంలో పట్టుదలగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరదలు, ఇతర విపత్తులపై సోమవారం సాయంత్రం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. పురపాలక శాఖ, హెచ్‌ఎండీఏ, మూసీ అభివృద్ధి సంస్థ అధికారులు ఇందులో పాల్గొన్నారు. హైదరాబాద్ భౌగోళిక పరిధి వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో విపత్తుల నిర్వహణ విభాగం పరిధిని కనీసం అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలని సీఎం స్పష్టం చేశారు. హైడ్రాలో కేవలం ప్రొటెక్షన్ ఫోర్స్ మాత్రమే కాకుండా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీ ఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, తదితర విభాగాల నుంచి ప్రత్యేక బృందాలను నియమించాలని చెప్పారు. హైడ్రాలో సిబ్బంది సంఖ్య, విధులు, నిధుల కేటాయింపు, ఇతర బాధ్యతలపై ముసాయిదా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. కేవలం వరదలు, ప్రమాదాలప్పుడే కాకుండా 365 రోజులూ ఈ విభాగం పనిచేస్తూ ఉండాలని చెప్పారు. మహానగరంలో ప్రజలు ఎదుర్కొనే అన్ని సమస్యల పరిష్కారంలో 'హైడ్రా' క్రియాశీలంగా వ్యవహరించాలని సీఎం స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా వ్యవస్థాగత మార్పులతో పాటు, బాధ్యతల పంపిణీ జరగాలని చెప్పారు.



ఆక్రమణలకు అడ్డుకట్ట

జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను పరిరక్షించడంతో పాటు నగరంలోని నాలాలు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడే కీలక బాధ్యతలను హైడ్రా చేపట్టాలని నిర్ణయించారు. హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ సరఫరా లైన్లు, డ్రైనేజీలు, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వ్యవహారాల న్నింటిలోనూ ఈ విభాగం సేవలను అందించాలని ముఖ్యమంత్రి చెప్పారు. మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ హైదరాబాద్ సిటీకి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చేలా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలన్నారు.

చారిత్రక కట్టడాల పునరుద్ధరణకు చర్యలు

నగరంలోని చారిత్రక ప్రాధాన్య కట్టడాలు, శిథిలమైన నిర్మాణాలను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. సిటీ లైబ్రరీ, చార్మినార్ సమీపంలోని యునానీ ఆస్పత్రి, నిజామియా అబ్జర్వేటరీ, గుడిమల్కాపూర్ కోనేరులపై జీహెచ్‌ఎంసీ పవర్ పాయింట్ ప్రజంటేషన్లు ప్రదర్శించింది. వాటిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మార్గాలను అన్వేషించాలని సీఎం సూచించారు. వీటిలో మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో కలిపే అవకాశం ఉన్నవి గుర్తించి, జోడించాలని చెప్పారు.

నేడు శాఖల ముఖ్య కార్యదర్శులతో సీఎం సమావేశం!

అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యల మీద ఏపీ సీఎం చంద్రబాబుతో 6న భేటీ ఉన్న నేపథ్యంలో మంగళవారం అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులతో సీఎం రేవంత్ సమావేశం కానున్నట్లు తెలిసింది. ఇరు రాష్ట్రాల మధ్య ప్రధానంగా ఉన్న విభజన సమస్యలు.. వాటి పరిష్కారానికి ఉన్న అవకాశాలు.. ఆ మేరకు చేయాల్సిన ప్రతిపాదనలపై ముఖ్య కార్యదర్శులతో రేవంత్ చర్చించనున్నట్లు తెలిసింది. విభజన సమయంలో ఇరు రాష్ట్రాలకు చెందిన పలు శాఖల భూములు, ఆస్తులను కేంద్రం విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10లోకి చేర్చింది. ఆ భూములు, ఆస్తులపై ఇప్పటికీ ఇరు ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోతున్నాయి. వీటిలో హౌసింగ్ బోర్డు, డెక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్(దిల్) భూములున్నాయి. దిల్‌కు ఏపీలోని విశాఖపట్నంలోనూ కొంత భూమి ఉంది. దీనిపై మొదటినుంచీ వివాదం నడుస్తోంది. ఇక కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో ఇరు రాష్ట్రాల మధ్య పలు వివాదాలున్నాయి. రెండు రాష్ట్రాల విద్యుత్తు బకాయిలు, ఉద్యోగుల బదిలీల సమస్యలూ ఉన్నాయి. పోలవరం బ్యాక్ వాటర్ విషయంలోనూ పలు సమస్యలున్నాయి. వీటన్నింటినీ ఏపీతో ఎలా పరిష్కరించుకోవాలి? అనే విషయాన్ని రేవంత్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే భద్రాచలం దగ్గర ఏపీలోకి వెళ్లిన 5గ్రామాలను వెనక్కి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనిపైనా ఎలా ముందుకెళ్లాలి అనే అంశంపైనా రేవంత్ చర్చించనున్నట్లు సమాచారం.

తనఖా కాదు.. హామీ!

» ప్రభుత్వ భూముల్ని అడ్డం పెట్టి రుణాలు

» బాండ్ల ద్వారా 10 వేల కోట్లు సేకరణ!

» రుణ మాఫీ, రైతు భరోసా కోసం యోచన

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రైతు రుణ మాఫీ, రైతు భరోసా పథకాల కోసం ప్రభుత్వం రకరకాలుగా నిధుల వేటను సాగిస్తోంది. ప్రభుత్వ భూములను హామీగా పెట్టి ప్రైవేటు ఆర్థిక సంస్థల నుంచి బాండ్ల ద్వారా నిధులను సేకరించడం, ఏడాది పొడవునా తీసుకొనే బడ్జెట్ అప్పులను ఒకేసారి ఎక్కువ మొత్తంలో తీసుకోవడం వంటి ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ భూములను హామీగా పెట్టి దాదాపు రూ.10 వేల కోట్లను సమీకరించే ఆలోచనలో ఉన్నారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిత్వం నెరపడానికి ఒక సలహాదారు సంస్థ లేదా మర్చంట్ బ్యాంకర్‌ను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఎంపిక ప్రక్రియను ప్రారంభించింది. సాధ్యమైనంత త్వరగా సంస్థను నియమించి, అదిచ్చే సూచనలు, సలహాల మేరకు నిధులను సేకరిస్తారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా పథకాలు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైనవిగా ఉన్నాయి. వీటిని ఎలాగైనా అమలు చేసి తీరాలన్న పట్టుదలతో ఉంది. రైతు రుణ మాఫీ పథకానికి రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. రైతు భరోసా పథకానికి కూడా అత్యవసరంగా నిధులను సర్దాల్సి ఉంది. ఇందుకోసమే భూములను హామీగా పెట్టి తక్కువ వడ్డీతో, దీర్ఘకాలిక రుణాలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. భూములను తనఖా(మార్ట్‌గేజ్) పెట్టి రుణాలు తీసుకుంటే నిర్దేశిత కాలంలోగా తిరిగి చెల్లిస్తామంటూ ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వాల్సి ఉంటుంది. హామీగా పెట్టి తీసుకునే రుణాలను తిరిగి చెల్లించే విషయంలో ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వవచ్చు, ఇవ్వకపోయినా ఇబ్బంది ఉండదని అధికారులు అంటున్నారు. ఈ వెసులుబాటును వాడుకోవడం వల్ల ప్రభుత్వంపై దీర్ఘకాలికంగా కూడా పెద్దగా భారం పడదని అంచనా వేస్తున్నారు. సలహా సంస్థ ఎంపికకు వారం రోజుల క్రితమే ప్రభుత్వం టెండర్ జారీ చేసింది. ఏదైనా రాష్ట్ర ప్రభుత్వానికి లేదా ప్రభుత్వ ఆర్థిక సంస్థకు ఒకేసారి కనీసం రూ.5000 కోట్ల మేర మార్కెట్ రుణాలు సేకరించి పెట్టిన అనుభవం ఉండాలని టెండర్‌లో పేర్కొంది. తర్వాత ఆసక్తి చూపించిన కొన్ని సంస్థల విజ్ఞప్తి మేరకు రూ.5000 కోట్లను రూ.1500 కోట్లకు తగ్గించారు. ఎంపికైన సంస్థ ఇతర ఆర్థిక సంస్థలు, బ్యాంకులను సంప్రదించి, రుణాలు లభించేలా చేస్తుంది. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే సంస్థలను పరిశీలిస్తుంది.

ప్రజారోగ్య విభాగం రద్దు?

» సెకండరీ హెల్త్‌కేర్ డెరెక్టరేట్ పరిధిలోకి తెచ్చే ఆలోచన

» సబ్‌సెంటర్స్ అన్నీ కుటుంబ సంక్షేమ కమిషనర్ పరిధిలోకి

» సర్వీస్ నిబంధనలూ వేర్వేరుగానే.. పదోన్నతుల పరంగా సమస్యలు రావా?

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజారోగ్య విభాగాన్ని (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్-డీహెచ్) రద్దు చేసే యోచనలో సర్కారు ఉంది. ఇప్పటికే తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) విభాగాన్ని రద్దు చేసి ఆ స్థానంలో సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్‌ను తెచ్చేందుకు సర్కారు ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ప్రజారోగ్య విభాగాన్ని సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ పరిధిలోకి తేవాలని భావిస్తోంది. తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో వైద్యవిధాన పరిషత్ వ్యవస్థను సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్ పరిధిలోకి తీసుకువచ్చారు. కొన్ని రాష్ట్రాల్లో మూడు హెచ్‌వోడీలకు బదులు డీఎంఈ, సెకండరీ హెల్త్‌కేర్ విభాగాలే ఉన్నాయి. అటువంటి రాష్ట్రాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల బృందాన్ని పంపించి అధ్యయనం చేయించే ఆలోచన చేస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తాజాగా వెల్లడించారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖలో నాలుగు కీలక విభాగాలున్నాయి. వైద్యవిద్య సంచాలకులు (డీఎంఈ) పరిధిలో మెడికల్ కాలేజీలున్నాయి. టీవీవీపీ కింద సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులున్నాయి. ఇక మూడోది ప్రజారోగ్య సంచాలకులు. డీహెచ్ పరిధిలో సబ్‌సెంటర్స్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యాన్ని మొత్తం చూసేది డీహెచ్ విభాగమే. ఇక నాల్గోది వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమం. ఈ నాలుగింటిలో ఒకదాన్ని(డీహెచ్)ను పూర్తిగా రద్దు చేసి, కేవలం మూడింటినే ఉంచాలనుకుంటోంది. ఇక క్షేత్రస్థాయిలో ఉండే సబ్ సెంటర్స్ అన్నింటిని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ పరిధిలోకి తీసుకురానుంది. ఇప్పటికే సబ్ సెంటర్స్ అన్నింటిని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్స్‌గా మార్చారు. అక్కడ పనిజేసే వైద్య సిబ్బంది అందరికీ ఇచ్చే వేతనాలన్ని కూడా ఎన్‌హెచ్ఎమ్ నిధులే. దాంతో క్షేత్రస్థాయి సబ్‌సెంటర్స్ అన్నీ కమిషనర్ పరిధిలోకి వెళ్తాయి. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రులన్నీ సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్ పరిధిలోకి వస్తాయన్న మాట. అయితే ప్రజారోగ్య విభాగాన్ని పూర్తిగా రద్దు చేసి...దాన్ని సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్ పరిధిలోకి తీసుకురావడం అంత తేలిక కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలో పనిజేస్తున్న వైద్య సిబ్బందికి ట్రెజరీ ద్వారా కాకుండా గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వేతనాలు వస్తున్నాయి. డీహెచ్ పరిధిలోని వైద్య సిబ్బంది అందరికీ ట్రెజరీ ద్వారా వేతనాలు అందుతున్నాయి. వీటికి తోడు ఇరు విభాగాలకు చెందిన సర్వీస్ రూల్స్ వేర్వేరుగా ఉన్నాయని చెబుతున్నారు. సర్వీస్ రూల్స్ విరుద్ధంగా ఉండటం వల్ల వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లు, ఇతర పారామెడికల్ సిబ్బంది పదోన్నతులు, వేతన సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అంటున్నారు.

కలిసి మాట్లాడుకుందాం!

(మొదటిపేజీ తరువాయి)





అంగీకరించారు. దీనిపై మంగళవారం లిఖితపూర్వకంగా తన స్పందన తెలియచేయనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం అధికారికంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రులతోపాటు రెండు రాష్ట్రాల నుంచి ఇద్దరు చొప్పున సీనియర్ మంత్రులు, సంబంధిత అంశాలకు సంబంధించిన సీనియర్ అధికారులు కూడా హాజరవుతారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విభజన చట్టంలో పేర్కొన్న కొన్ని అంశాలు రెండు రాష్ట్రాల మధ్య ఇంకా అపరిష్కృతంగా ఉండిపోయాయి. ఉమ్మడి సంస్థల మధ్య ఆస్తుల విభజన కూడా పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలోనే రేవంత్‌తో భేటీకి చంద్రబాబు సిద్ధమయ్యారు. 'నేనే మీ వద్దకు వస్తాను' అంటూ భేషజాలను పక్కన పెట్టి మరీ లేఖ రాశారు. ఈ భేటీకి ముందు చంద్రబాబు రెండు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఆ సమయంలో ఈ అపరిష్కృత సమస్యల గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకురానున్నారు. దాని కొనసాగింపుగా రేవంత్‌తో ఆయా అంశాలపై చర్చిస్తారు. జగన్, కేసీఆర్ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు ఒకసారి సమావేశమైనా... అది వారిద్దరి వ్యక్తిగత భేటీగానే జరిగింది. ఏ అంశమూ పరిష్కారం కాలేదు. ఈసారి ఇటు చంద్రబాబు, అటు రేవంత్ ఇద్దరూ సానుకూల దృక్పథంతో ఉండటంతో... విభజన అంశాల పరిష్కారంలో ముందడుగు పడే అవకాశముందని అంటున్నారు.

ఇదే తొలిసారి...

చంద్రబాబు, రేవంత్ ముఖ్యమంత్రుల హోదాలో సమావేశం కావడం ఇదే మొదటిసారి. రేవంత్ గతంలో చంద్రబాబు నాయకత్వంలో టీడీపీలో పనిచేశారు. ఆ తర్వాత ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారు. వేర్వేరు రాష్ట్రాలు, వేర్వేరు రాజకీయ శిబిరాల్లో ఉండటంతో వీరిద్దరూ కలుసుకోవడం ఇటీవలి కాలంలో సాధ్యపడలేదు. చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రేవంత్‌కు ఆహ్వానం అందినా... ఆ కార్యక్రమాన్ని ఎన్డీయే కూటమి కార్యక్రమంగా నిర్వహించడంతో ఆయన రాలేదు. అధికారికంగా రెండు రాష్ట్రాల మధ్య ఒక సమావేశాన్ని నిర్వహించాలన్న ఆలోచన ఇటీవల ఇరువైపులా వచ్చింది. దాని ఫలితమే ఈ సమావేశమని చెబుతున్నారు. దీనికి ప్రాతిపదికగా చంద్ర బాబు అధికారికంగా తెలంగాణ ముఖ్యమంత్రికి ఒక లేఖ రాసి దానిని సోమవారం రాత్రి తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

ఇదీ రేవంత్‌కు చంద్రబాబు లేఖ

"తెలంగాణ ముఖ్యమంత్రిగా మీరు చేపట్టిన ప్రగతిశీల కార్యక్రమాలకు నా హృదయపూర్వక అభినందనలు. మీ అంకిత భావం, నాయకత్వ పటిమ తెలంగాణ రాష్ట్ర పురోభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా ఉన్న మనం ఒక చక్కటి అనుబంధంతో పనిచేయగలిగితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండింటి అభివృద్ధికి, పురోగతికి ఉపయోగపడుతుంది. మన ఉమ్మడి ఆలోచనలు, సహకార కృషి మన ఉమ్మడి లక్ష్యాల సాధనకు దోహదం చేసి ప్రజల జీవితాలు మెరుగు పడటానికి ఒక మార్గం ఏర్పరుస్తుంది. ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగి ఇప్పటికి పదేళ్లయింది. విభజన చట్టానికి సంబంధించిన అనేక అంశాలపై ఇంకా పలు రకాలైన చర్చలు జరుగుతున్నాయి. అత్యంత జాగురూకతతో ఉభయులకూ ఆమోదయోగ్యంగా వీటిని పరిష్కరించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. దీని కోసం ఈ నెల ఆరో తేదీ శనివారం మధ్యాహ్నం, మీ ప్రదేశంలో మనం కలుద్దాం. మనం ముఖాముఖీ కూర్చుని మాట్లాడుకోవడం వల్ల సున్నితమైన అంశాలకు పరిష్కారం కనుగొనడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ సమావేశంలో జరిగే చర్చల వల్ల ఉపయుక్తమైన పరిష్కారాలు వస్తాయని నేను విశ్వసిస్తున్నాను."

విస్తరణకు వేళాయె!

» గవర్నర్‌తో సీఎం రేవంత్ సమావేశం

» మంత్రివర్గ విస్తరణ ఒకటి రెండు రోజుల్లో ఉంటుందని సమాచారం!

» నేడో రేపో ఢిల్లీకి రేవంత్

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ వ్యవహారం కొలిక్కి వచ్చినట్లే కనిపిస్తోంది. ఈ నెల 5 నుంచి ఆషాఢ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. కేబినెట్‌లో కొత్తగా ఎవరెవరికి చోటు కల్పించాలనే విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఈ లోపే నిర్ణయం తీసుకుంటుందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం కూడా 5వ తేదీలోపే జరుగుతుందని అంటున్నారు. సీఎం రేవంత్ గవర్నర్ రాధాకృష్ణన్‌తో సమావేశం కావడం కూడా ఈ ప్రచారానికి బలం చేకూరుస్తోంది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి మంగళ, లేదా బుధవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీకి కొత్త చీఫ్ నియామకంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీతో చర్చించేందుకే సీఎం ఢిల్లీకి వెళుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క కూడా వెళుతున్నట్లు, ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కూడా పాల్గొంటారని చెబుతున్నారు. ఈ భేటీలోనే తుది నిర్ణయం తీసుకునే అవకాశముందని అంటున్నారు. మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ చీఫ్ అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్, భట్టివిక్రమార్క, ఉత్తమ్, దీపాదాస్ మున్షీ ఇప్పటికే రెండు దఫాలు సమావేశమై చర్చించిన విషయం తెలిసిందే.

ప్రతిపాదిత పేర్లపై అభిప్రాయ సేకరణ..

పీసీసీ కొత్త చీఫ్ కోసం ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ బలరాం నాయక్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరుల పేర్లపై చర్చించి షార్ట్ లిస్ట్ చేశారు. ఇక మంత్రివర్గ విస్తరణకు సంబంధించి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ముదిరాజ్ సామాజికవర్గం నుంచి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, ఎడ్మ బొజ్జు, నల్లగొండ జిల్లా నుంచి ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలు నాయక్ తదితరుల పేర్లపై కేసీ వేణుగోపాల్‌తో జరిగిన భేటీల్లో చర్చించారు. ఆ సమావేశాల తర్వాత హైదరాబాద్‌కు వచ్చిన దీపాదాస్ మున్షీ.. రాష్ట్రంలోని పలువురు ముఖ్యనేతలను కలిసి టీపీసీసీ కొత్త చీఫ్‌గా ప్రతిపాదిత పేర్లపై అభిప్రాయాలు సేకరించారు. కేసీ వేణుగోపాల్‌తో జరిపిన చర్చలు, రాష్ట్ర ముఖ్యనేతల అభిప్రాయాల ఆధారంగా ఖర్గే, రాహుల్.. టీపీసీసీకి కొత్త చీఫ్, మంత్రివర్గ విస్తరణపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ టూర్‌లో ఈ నియామకాలపై చర్చలు జరిపిన నేపథ్యంలో ఆశావహులంతా ఆ నాలుగు రోజులూ ఢిల్లీలోనే మకాం వేశారు. అధిష్ఠానంతో మరోసారి భేటీ జరగనుండడంతో వారంతా మళ్లీ ఢిల్లీకి చేరుకుంటున్నారు.

గవర్నర్‌తో సీఎం రేవంత్ భేటీ..

సీఎం రేవంత్ సోమవారం గవర్నర్ రాధాకృష్ణన్‌తో భేటీ అయ్యారు. మంత్రివర్గ విస్తరణపై ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం జరగనుందని, ఆషాఢం లోపే వారితో ప్రమాణ స్వీకారం చేయించాలనీ గవర్నర్‌ను సీఎం కోరినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లకు టీజేఎస్ అధినేత కోదండరాం, మీడియా రంగం నుంచి అమీరుల్లాఖాన్ పేర్లను సిఫారసు చేస్తూ మంత్రిమండలి గతంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సిఫారసుకు ఆమోదం తెలిపే అంశంపైనా గవర్నర్‌తో సీఎం చర్చించినట్లు తెలుస్తోంది.

మట్టి మిద్దె మింగేసింది

» వానకు తడిసి తెల్లవారుజామున కుప్పకూలిన పైకప్పు
» తల్లి, ముగ్గురు చిన్నారుల దుర్మరణం

నాగర్‌కర్నూల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నిలువ నీడగా ఉన్న ఇల్లే నిండు కుటుంబాన్ని బలిగొంది. మట్టిమిద్దె ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ శిథిలాలు నిద్రిస్తున్న ఐదు గురిపై పడ్డాయి. ఈ ఘటనలో నలుగురు నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారు. ఒకరు స్వల్పగాయాలతో బయట పడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో సోమవారం ఈ ఘోరం జరిగింది. రూరల్ మండలం వనపట్ల గ్రామానికి చెందిన గొడుగు భాస్కర్ ఆటో డ్రైవర్. అతడికి భార్య పద్మ (26), కవల కూతుళ్లు పప్పి (6), వసంత (6), కుమారుడు విక్కీ (1) ఉన్నారు. ఈ కుటుంబం తమ పూర్వీకులకు సంబంధించిన మట్టిమిద్దె ఇంట్లో నివసిస్తోంది. ఆ ఇంటికి ఉన్న దూలాల్లో ఒకటి కొన్నాళ్ల క్రితమే విరిగిపోయింది. పైగా ఆదివారం కురిసిన వర్షానికి మిద్దె పూర్తిగా తడిసి పోయింది. ఆదివారం రాత్రి ఇంట్లో పద్మ, ముగ్గురు పిల్లలు నిద్రించారు. భాస్కర్ బీరువా పక్కన పడుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున మట్టిమిద్దె కూలిపోయింది. భాస్కర్ స్వల్ప గాయాలతో శిధిలాల నుంచి బయటకొచ్చి చుట్టుపక్కల ఉన్న బంధువులకు విషయం చెప్పాడు. వారంతా వచ్చి రాళ్లు, మట్టిని తొలగించి పద్మ, పప్పి, వసంత, విక్కీని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నలుగురూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనాస్థలిని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్ రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. అంత్యక్రియల నిమిత్తం 25 వేల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందించారు. మృతులకు రూ. 4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.


భాస్కర్, ఆయన భార్య, పిల్లలు (ఫైల్)

మా భూమిలోకి అడుగుపెట్టనిస్తలేరు.. న్యాయం చేయండి!



పిల్లాజెల్లాతో అంతా కలిసి మొత్తం 70 మంది పార్కుకొచ్చారు. సరదాగా వన భోజనం కోసం కాదు. తమ పేరుమీదున్న పట్టా భూమిలోకే తమను పోలీసులు రానివ్వడం లేదంటూ ఆవేదనను వెళ్లగక్కడానికి!! మీరు చూస్తున్న ఈ ఫొటో వికారాబాద్ కలెక్టరేట్ ఎదురుగా ఉన్న పార్క్‌లోనిది. ఇక్కడ కూర్చుని భోజనాలు చేస్తున్న వీరంతా.. జిల్లాలోని తాండూరు మండలం అంతారం తండాకు చెందిన తౌర్యానాయక్, హెర్యానాయక్ కుటుంబాలకు చెందినవారు! రెండు కుటుంబాలకు 70 మంది సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. తమ పేరుతో ధరణిలో 9.14 గుంటల భూమి ఉందని, పోలీసులు తమను ఆ భూమిలోకి రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం గతంలో ఎన్నోసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందన్నారు. తమ సమస్య తీరే దాకా కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా ఉన్న పార్కులోనే ఉండాలని సద్దులు కట్టుకొని మరీ వచ్చామని చెప్పారు. కార్యాలయంలోని ఉన్నతాధికారులు వారికి నచ్చజెప్పడంతో సాయంత్రం అక్కడి నుంచి వెళ్లిపోయారు. - వికారాబాద్

తెరచుకున్న బాబ్లీ గేట్లు

నిజామాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను అధికారులు సోమవారం తెరిచి దిగువన గోదావరికి నీటిని విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణకు చెందిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఇంజనీర్లు, కేంద్ర జలసంఘం ఇంజనీర్లు, అలాగే మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన ఇంజనీర్ల ఆధ్వర్యంలో ప్రాజెక్టు గేట్లను ఎత్తారు. గోదావరి నుంచి వచ్చే వరదను జూలై 1 నుంచి అక్టోబర్ 28వ తేదీ వరకు ఎస్సారెస్పీకి విడుదల చేసే విధంగా సుప్రీంకోర్టు గతంలో తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ తీర్పునకు అనుగుణంగానే ప్రతీ సంవత్సరం జూలై 1న అధికారులు బాబ్లీ గేట్లను తెరుస్తారు.

సీఎం రేవంత్ పెద్ద మనసు

» క్యాన్సర్ బాధితుడు అదిల్‌ను ఆదుకుంటామని భరోసా

హనుమకొండ కలెక్టరేట్, హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితుడు మహమ్మద్ ఆదిల్‌ను ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ కుటుంబానికి భరోసానిచ్చారు. శనివారం రేవంత్ వరంగల్ జిల్లా పర్యటనకు వెళ్లిన సమయంలో.. తనను కలిసేందుకు మహమ్మద్ అదిల్ వచ్చాడు. కానీ ముఖ్యమంత్రిని కలవలేకపోయాడు. అయితే ఈ విషయం సీఎంకు సోమవారం తెలిసింది. వెంటనే స్పందించిన ఆయన తక్షణమే వైద్య సహాయం అందించాలని సీఎంవో అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు బాలుడి కుటుంబసభ్యులతో మాట్లాడి, ఆదిల్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అదిల్‌కు మరింత సాయం అందిస్తామని వారికి ధైర్యం ఇచ్చారు. అయితే మహమ్మద్ అదిల్ క్యాన్సర్‌తో బాధపడుతున్న క్రమంలో ఇప్పటికే ఒకసారి జనవరి నెలలో ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ని సంబంధిత ఆసుపత్రికి ప్రభుత్వం అందించిందని సీఎం కార్యాలయం తెలిపింది.


జూన్ 29వ తేదీన హనుమకొండలోని కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ప్లకార్డుతో సీఎం కోసం వేచి చూస్తున్న ఆదిల్ అహ్మద్


విద్యార్థి సంఘాల నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

నీట్‌పై చలో రాజ్‌భవన్ ఉద్రిక్తం

» పోలీసులు, విద్యార్థుల మధ్య తోపులాటలు, వాగ్వాదాలు
» అరెస్ట్ అయిన వారిలో ఎమ్మెల్సీ బల్మూరి , విద్యార్థి నేతలు

ఖైరతాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని, దీనిపై కేంద్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పి తిరిగి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఛలో రాజ్‌భవన్ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. సోమవారం మధ్యాహ్నం పీపుల్స్ ప్లాజా నుంచి ర్యాలీగా రాజ్‌భవన్ వైపునకు వెళ్లేందుకు విద్యార్థులు, యువకులు పరుగులు తీయడంతో పోలీసులు వారిలో చాలా మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, విద్యార్థులు, యువత మధ్య తోపులాటలు, వాగ్వాదాలు జరిగాయి. పలు దఫాలుగా అరెస్టు చేసిన వారిని వాహనాల్లో పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. ముట్టడి సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సహా ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, వీజేఎస్, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, పీవైసీ, వైజేఎస్, వైటీఎస్, ఏఐపీఎస్‌వో తదితర యూనియన్ల విద్యార్థులు, యువతను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో పోలీసులతో పాటు పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. చలో రాజ్ భవన్ సందర్భంగా యువత.. పోలీసుల వలయాలను ఛేధించుకొని ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపునకు దూసుకువెళ్లగా పోలీసులు అరెస్టు చేశారు. పీడీఎస్‌యూకు చెందిన గడ్డం శ్యాం అనే యువకుడిని అరెస్టు చేసి వ్యాన్‌లోకి ఎక్కించగా అతను వ్యాన్‌లో అలజడి చేశాడని పోలీసులు వ్యాన్‌లోనే అతన్ని కొట్టడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్‌కు చెందిన సత్యప్రకాష్ అనే యువకుడు పోలీసు పెట్రోలింగ్ వాహనం పైకెక్కగా కారు అద్దం పగిలిపోయింది. అతడిపై కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. నీట్ పేపర్‌ను కొన్నట్టు విద్యార్థులు చెప్పినా ప్రధాని మోదీతో పాటు కేంద్ర ప్రభుత్వం, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించకపోవడం హేయమైన చర్య అని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. నీట్ పేపర్ లీక్‌తో 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం, ప్రధాని వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి తిరిగి నీట్ పరీక్షను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మృతదేహం తరలింపునకు ఎన్నారైల సాయం

» 20లక్షల వితరణ, దాతలను కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనం

కల్లూరు, జూలై 1: అమెరికాలో ఇటీవల స్విమ్మింగ్ పూల్‌లో మునిగి మృతి చెందిన ఖమ్మం జిల్లా విద్యార్థి శ్రీనాథరాజు కిరణ్‌కుమార్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఎన్నారైలు తమ వంతుగా ఆర్థిక సాయం అందించారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన శ్రీనాథరాజు కిరణ్‌కుమార్ ఎంఎస్ చదివేందుకు అమెరికా వెళ్లాడు. గత శనివారం ప్రమాదవశాత్తు స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి కిరణ్‌కుమార్ మృతి చెందాడు. ఈ సంఘటనపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం అమెరికాలో ఉన్న ఎన్నారైల హృదయాలను కదిలించింది. అమెరికాలోనే ఉన్న చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన ఎన్నారైలు తిరుమలశెట్టి గోపి, కమ్మంపాటి అంజేనేయులు, మాదిరాజు శ్రీనివాసరావు ఆన్‌లైన్‌లో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని చదివి దాన్ని అమెరికాలో ఉన్న తెలుగు వారందరి సోషల్ మీడియా గ్రూప్‌లలో పోస్ట్ చేశారు. దీంతో ఎంతో మంది తెలుగు ఎన్నారైలు ముందుకు వచ్చి తమ వంతుగా రూ. 20 లక్షలు సాయం చేశారు. గురువారం నాటికి కిరణ్ మృతదేహం స్వగ్రామానికి చేరుకునే అవకాశం ఉందని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో కిరణ్ అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థానికంగా ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు, మిత్రబృందం కూడా ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చారు.


కిరణ్‌కుమార్ (ఫైల్)

మహిళ అని సానుభూతి చూపలేం!

కవితకు వ్యతిరేకంగా ఈడీ వద్ద బలమైన సాక్ష్యాలు.. మరికొందరు నిందితులూ ఆమె తరఫునే పనిచేశారు

» పలుకుబడి గల మహిళ.. నిస్సహాయురాలిగా భావించలేం
» మద్యం కుంభకోణంలో కవిత బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి చుక్కెదురైంది. ఈడీ, సీబీఐ కేసులకు సంబంధించి ఆమె పెట్టుకున్న బెయిల్ పిటిషన్లను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. మహిళ అనే కారణంతో కవితపై సానుభూతి చూపలేమని కోర్టు స్పష్టం చేసింది. ఒక విద్యావంతురాలిగా పలుకుబడి కలిగిన మహిళగా ఆమె చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించింది. ఈ రీత్యా కేసులో ఆమె పాత్ర, ఆమెకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాల ఆధారంగానే బెయిల్ ఇవ్వాలో లేదో నిర్ణయించాలే తప్ప మహిళ అన్న విషయానికి అంత ప్రాధాన్యం ఉండకూడదని కోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీలో కొత్త మద్యం విధానం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో కవిత కూడా ఒకరని ఈడీ సేకరించిన సాక్ష్యాలను బట్టి తేలిందని, ఈ కేసులో మరికొందరు నిందితులు కూడా ఆమె తరఫునే పనిచేశారని, ఫలితంగా ఆమెను ఓ నిస్సహాయ మహిళగా భావించలేమని కోర్టు స్పష్టం చేసింది. కేసుకు సంబంధించి సమన్లు ఇచ్చిన తర్వాతే ఫోన్లు ఫార్మాట్ చేశారని, ఫలితంగా కవిత సాక్ష్యాలను చెరిపేసినట్లు అనుమానాలున్నాయని వ్యాఖ్యానించింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో మనీలాండరింగ్‌కు సంబంధించి ఎమ్మెల్సీ కవితకు వ్యతిరేకంగా బలమైన ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని, ఈ దశలో ఆమెకు బెయిల్ మంజూరు చేయలేమని తీర్పులో స్పష్టం చేసింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కవితను మార్చి 15న హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఈడీ అరెస్టు చేసింది. 16న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచింది. కవిత తిహాడ్ జైల్లో ఉండగానే ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసినట్లు ప్రకటించింది. తొలుత.. తన కుమారుడికి పరీక్షలున్నాయని మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరగా ట్రయల్ కోర్టు తిరష్కరించింది. తర్వాత ఈడీ, సీబీఐ కేసుల్లో తనకు సాధారణ బెయిల్ మంజూరు చేయాలని కవిత పిటిషన్లు దాఖలు చేయగా ట్రయల్ కోర్టు మరోసారి తిరష్కరించింది. ఈ నేపథ్యంలో ఆమె ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ మంజూరు చేయాలని ఈడీ, సీబీఐ కేసుల్లో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేయగా 2 పిటిషన్లు కలిపి ఢిల్లీ ఉన్నత న్యాయస్థానంలో ఒకేసారి విచారించింది. మే 27, 28 తేదీల్లో హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఢిల్లీ మద్యం కేసుతో కవితకు సంబంధమే లేదని, అక్రమంగా అరెస్టు చేశారని ఆమె తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపించారు. అయితే, ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవితది కీలకపాత్రని, ఆమె సూత్రధారి, పాత్రధారి అని దర్యాప్తు సంస్థలు బలంగా వాదించాయి. వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వ్ చేశారు. జూన్‌లో హైకోర్టులో సెలవులు ఉండడంతో ఈలోపే తీర్పు వెల్లడించాలని కవిత తరఫు న్యాయవాది కోరారు. సెలవులకు ముందే తీర్పు ఇస్తానని న్యాయమూర్తి చెప్పినప్పటికీ సెలవులు ముగిసిన తర్వాత సోమవారం తీర్పు ఇచ్చారు. ఈడీ, సీబీఐ రెండు కేసుల్లోనూ బెయిల్ పిటిషన్లు తిరష్కరిస్తున్నట్లు తన తీర్పులో న్యాయమూర్తి వెల్లడించారు.



నేరానికి పాల్పడలేదని నిర్ధారణకు రాలేకపోతున్నాం

ఢిల్లీ మద్యం విధానం కేసులో ఈడీ సమర్పించిన సాక్ష్యాధారాలు, సెక్షన్ 250 కింద సాక్ష్యుల వాంగ్మూలాలు, సీఆర్పీసీ 144 కింద అప్రూవర్ల వాంగ్మూలాలు, వాట్సాప్ చాటింగ్‌లతోపాటు అనేక డాక్యుమెంటరీ సాక్ష్యాలు ఉన్నరీత్యా ఆమె నేరానికి పాల్పడలేదని కోర్టు నిర్ధారణకు రాలేకపోతోందని హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ స్వర్ణకాంత శర్మ తన తీర్పులో పేర్కొన్నారు. మనీలాండరింగ్ లోని సెక్షన్ 45 కింద ఆమెకు బెయిల్ ఇవ్వడానికి కారణాలేమీ లేవని చెప్పారు. తాను సమర్పించిన 9 మొబైల్ ఫోన్లను ఎవరు ఫార్మాట్ చేశారన్న విషయంపై కవిత స్పష్టమైన వివరణ ఇవ్వలేదని, గత 2023 మార్చి 11న సమన్లు పంపిన తర్వాతే ఈ ఫోన్లను ఫార్మాట్ చేయడాన్ని బట్టి చూస్తే ఆమె సాక్ష్యాధారాలను చెరిపివేసినట్లు అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా ఇప్పుడు బెయిల్‌పై విడుదల చేస్తే ఆమె మరిన్ని సాక్ష్యాలను చెరిపివేసే అవకాశం ఉన్నదని, అంతేకాక ఈ కేసులో పలువురు కీలక సాక్షులు ఆమె సన్నిహిత సహచరులు లేదా ఉద్యోగులు కావడాన్ని విస్మరించలేమని కోర్టు పేర్కొంది. ఆమె సమాజంలో పలుకుబడి కలిగిన మహిళ అని, రాజకీయాల్లో కూడా ఆమె అనుభవజ్ఞురాలని, ఈ రీత్యా ఆమె సాక్షులను ప్రభావితం చేయలేరని చెప్పలేమన్నారు. మద్యం కుంభకోణంలో దర్యాప్తు అత్యంత కీలకదశలో ఉన్నదని, తుది చార్జిషీట్లను దాఖలు చేయవలసి ఉన్నదని కోర్టు పేర్కొంది.

కరెంటు బిల్లులు.. గూగుల్‌పే/ఫోన్‌పేలో చెల్లింపులకు చెల్లు

డిస్కమ్‌ల యాప్/వెబ్‌సైట్‌లోనే చెల్లించాలి
ఆర్‌బీఐ మార్గదర్శకాలతో డిస్కంల నిర్ణయం

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కరెంటు బిల్లులను ఇకపై గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీయం, బిల్‌డెస్క్‌లో చెల్లించడానికి వీల్లేదని డిస్కమ్‌లు తేల్చిచెప్పాయి. టీజీఎస్పీడీసీఎల్, టీజీఎస్పీడీసీఎల్ యాప్‌ల ద్వారా.. లేదంటే.. https://tgsouthpower.org, https://tgnpdcl.comలో లాగిన్ అయ్యి మాత్రమే బిల్లులు చెల్లించాలని స్పష్టం చేశాయి. ఆర్బీఐ మార్గదర్శకాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి. ఈ మేరకు తాజాగా మార్గదర్శకాలను జారీ చేశాయి. ఈ రెండు డిస్కమ్‌ల పరిధుల్లో 1.84 కోట్ల మంది వినియోగదారులున్నారు. వీరిలో 50శాతానికి పైగా వినియోగదారులు నెలవారీ కరెంటు బిల్లులను గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీయం, బిల్‌డెస్క్, అమెజాన్‌పే ద్వారా చెల్లిస్తున్నట్లు అధికారులు వివరించారు. నిజానికి ఈ యాప్‌ల ద్వారా ఎవరైనా వినియోగదారుడు ఒక్కసారి కరెంట్ బిల్ కడితే.. ఆ తర్వాత ప్రతినెల ఆటోమ్యాటిక్‌గా అలెర్ట్ రూపంలో నోటిఫికేషన్లు వస్తాయి. దాంతో.. వినియోగదారులు బిల్లులను చెల్లించేవారు. ఈ యాప్‌లు అందుబాటులోకి వచ్చాక.. ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాల(ఈఆర్వో) వద్ద క్యూలో నిలబడి బిల్లులు చెల్లించే పరిస్థితి దూరమైంది. ఇకపైన వినియోగదారులు ఇబ్బంది పడకుండా.. తమ యాప్‌లు, వెబ్‌సైట్లలో ఆ సేవలను అందజేస్తామని డిస్కమ్‌లు చెబుతున్నాయి. యాప్‌లో వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ ఉంటుందని, వెబ్‌సైట్‌లో 'పే బిల్' ఆప్షన్‌ను ఎంచుకుని, యూనిక్ సర్వీస్ నంబర్‌ను ఎంటర్ చేసి, బిల్లులను చెల్లించవచ్చని వివరించాయి. ఎస్‌పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్ యాప్‌లు ప్రస్తుతానికి ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో అందుబాటులో ఉన్నాయి. గూగుల్ ప్లేస్టోర్ ద్వారా ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.


పోస్టర్ విడుదల చేస్తున్న డీజీపీ రవిగుప్తా, పోలీస్ ఉన్నతాధికారులు

కొత్త చట్టాల కింద చార్మినార్ ఠాణాలో తొలి కేసు

నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనదారుపై నమోదు
దర్యాప్తుపై దిశా నిర్దేశానికి సీఐడీలో ప్రత్యేక కేంద్రం
పోస్టర్, ఎస్‌వోపీ విడుదల చేసిన డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, కొత్తపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త నేర న్యాయ చట్టం కింద రాష్ట్రంలో తొలి కేసు హైదరాబాద్ చార్మినార్ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. నంబరు ప్లేట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారుపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 281, మోటారు వెహికల్ చట్టం కింద కేసు పెట్టారు. వాహనదారుపై 281 బీఎన్ఎస్, 80(ఏ), 177 ఎండీ యాక్ట్ కింద ఇది నమోదైంది. చార్మినార్ స్టేషన్‌లో బీఎన్ఎస్ చట్టం కింద డిజిటల్ సంతకంతో తొలి కేసు నమోదు పట్ల డీజీపీ రవిగుప్తా సిబ్బందిని అభినందించారు. వరుస శిక్షణ తరగతులతో పోలీస్ సిబ్బందికి నూతన చట్టాలపై అవగాహన పెరిగిందని తెలిపారు. బీఎన్ఎస్ కింద ఎల్బీనగర్ ఠాణాలో మొదటి కేసు నమోదైంది. బాలాపూర్ నందిహిల్స్‌లో ఉండే చింతంరెడ్డి నారాయణరెడ్డి హోటళ్లకు బియ్యం, సరుకులు సరఫరా చేస్తుంటారు. అలేఖ్య టవర్స్ వద్ద బహార్ కేఫ్ నిర్వహిస్తున్న గుంటూరుకు చెందిన కిరణ్ ఐదేళ్లుగా డబ్బు చెల్లించడం లేదు. సోమవారం ఈ విషయమై అడగ్గా.. నారాయణరెడ్డిపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు బీఎన్ఎస్ కింద నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. కాగా, నిర్మల్ జిల్లా పోలీసులు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) కింద మొదటి కేసు నమోదు చేశారు. లక్ష్మణచాంద మండలం నర్సాపూర్‌లో సాగునీటి ట్యాంక్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన దేశబోయిన పోశెట్టి(52) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ఎస్ లోని సెక్షన్ 194(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరింత అవగాహనకై..

కొత్త చట్టాలపై దర్యాప్తు అధికారులకు దిశానిర్దేశం చేసేందుకు సీఐడీ విభాగంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్లు డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఇది రోజూ ఉదయం 8 గంటల నుంచి అందుబాటులో ఉంటుందన్నారు. కొత్త చట్టాలపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్లు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను డీజీపీ విడుదల చేశారు. చట్టాలపై రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ అధికారులు శిక్షణ పొందారని చెప్పారు. ప్రజలకు తెలిసేలా తెలుగు, ఆంగ్లంలో ముద్రించిన పోస్టర్లను అన్ని పోలీస్ స్టేషన్ల వద్ద ప్రదర్శిస్తారన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సహకారంతో సీఐడీతో కలిసి ఎస్‌వోపీని రూపొందించినట్లు వివరించారు.

రుణమాఫీకి వడివడిగా అడుగులు

» నేడో, రేపో ఉత్తర్వుల జారీకి చాన్స్
» ఉద్యాన పంటలకూ మాఫీ వర్తింపు!!
» లబ్ధిదారుల గుర్తింపు బాధ్యత గ్రామ స్థాయి అధికారులకే
» 18 నెలల స్వల్పకాలికానికే రుణ మాఫీ
» దీర్ఘకాలిక రుణాలకు అవకాశం లేనట్లే!

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): "ఆరునూరైనా.. పంద్రాగస్టులోగా రూ.2 లక్షల్లోపు రుణమాఫీ చేసి తీరుతా..!" అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శపథం చేసిన మేరకు.. అధికారులు ఆ దిశలో విధివిధానాలపై కసరత్తు ముమ్మరం చేశారు. నేడోరేపో మార్గదర్శకాలను వివరించే ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలున్నాయి. ప్రాథమిక అంచనా మేరకు రూ.2లక్షల్లోపు రుణమాఫీ చేయడానికి రూ.31 వేల కోట్ల మేర నిధులు అవసరం. ప్రభుత్వం ఓవైపు నిధుల వేటను కొనసాగిస్తూనే.. రైతుభరోసాకు కేటాయించిన బడ్జెట్‌ను రూ.7,500 కోట్లను రుణమాఫీకి మళ్లించే దిశలో చర్యలు తీసుకుంటోంది. రైతుభరోసా విధివిధానాలు ఇంకా ఖరారు కాలేదు. అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై ఓ స్పష్టత రానుంది. ఆలోగా.. ఈ నిధులతో రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించాలని సర్కారు కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

పాత మార్గదర్శకాలతోనే..

రుణమాఫీలో లబ్ధిదారుల ఎంపికకు దాదాపుగా పాత మార్గదర్శకాలనే అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. గత ప్రభుత్వం రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేసినప్పుడు అవలంబించిన నిబంధనలనే.. అధికారులు లబ్ధిదారుల ఎంపికకు ప్రామాణికంగా తీసుకుంటారని తెలుస్తోంది. ఇప్పటికే రూ.2 లక్షల్లోపు రుణమాఫీకి కటాఫ్ తేదీని ప్రభుత్వం ప్రకటించింది. అంటే.. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వరకు రుణాలు తీసుకున్నవారే మాఫీకి అర్హులు. అదీ 18 నెలల కాలవ్యవధితో స్వల్పకాలిక పంటరుణాలై ఉండాలి. దీర్ఘకాలిక పంటరుణాలకు ఈ పథకం వర్తించదు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని, రుణమాఫీ చేస్తారు. కుటుంబాన్ని గుర్తించడానికి రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటారు. పంచాయతీ అసిస్టెంట్ ఎక్స్‌టెన్షన్ అధికారులు(ఏఈవో), పంచాయతీ కార్యదర్శులు అర్హుల కుటుంబాలను గుర్తిస్తారు. ఈ ప్రక్రియను తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులు పర్యవేక్షిస్తారు. రైతులకు ఎన్ని బ్యాంకుల్లో అప్పులున్నా.. గరిష్ఠంగా ఒక కుటుంబానికి 2లక్షల వరకే మాఫీ వర్తిస్తుంది. అసలు, వడ్డీ, రెన్యువల్ రుణాలు కలిపి కుటుంబానికి 2లక్షల్లోపే మాఫీ ఉంటుంది. ఉద్యాన పంటలపై తీసుకున్న రుణాలకూ ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

మూడు ఫార్మాట్లలో వివరాలు

మూడు ఫార్మాట్లలో లబ్ధిదారుల వివరాలను సేకరిస్తారు. అనెక్సర్-ఏ, బీల్లో రైతుల వివరాలు ఉంటాయి. ఈ వివరాలను క్రోడీకరించి.. అనెక్సర్-సీలో పొందుపరుస్తారు. ఈ ఫార్మట్లతో బ్యాంకు మేనేజర్లు తమ వద్ద ఉన్న వివరాలను పోల్చిచూసుకుంటారు. ఈ మూడు ఫార్మాట్లలోని వివరాలు లీడ్ బ్యాంకు మేనేజర్ల ద్వారా సంబంధిత జిల్లా కలెక్టర్లకు చేరుతాయి. డూప్లికేషన్, డబుల్ పేమెంట్ వంటి సమస్యలను అధిగమించేందుకు మండల స్థాయిలో సంయుక్త బ్యాంకర్ల కమిటీలు పనిచేస్తాయి. ఈ కమిటీలు అన్ని బ్యాంకుల్లో రుణాల వివరాలను క్రోడీకరిస్తాయి. నకిలీ పట్టాదార్ పాస్ పుస్తకాలతో తీసుకున్న రుణాలను గుర్తిస్తాయి. చివరి దశలో.. జిల్లా సహకార ఆడిటర్లు, డీసీసీబీలు, బ్యాంకులు పంపే వివరాలను వ్యవసాయ శాఖ ఐటీ విభాగం స్క్రూటినీ చేసి, పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తుంది. లబ్ధిదారుల జాబితాను గ్రామ పంచాయతీలు, బ్యాంకుల వద్ద ప్రదర్శిస్తారు. ఆ జాబితాలపై ఎవరైనా అభ్యంతరాలను వ్యక్తం చేస్తే.. పరిగణనలోకి తీసుకుని, పరిశీలిస్తారు.

195 టీఎంసీల ఎత్తిపోత సాధ్యమయ్యేనా?

» బ్యారేజీల ఎంపికకు ప్రామాణికమేంటి?
» తుమ్మిడిహెట్టి వద్ద వేర్వేరు ఎత్తుతో బ్యారేజీలు కడితే ముంపు ఎంత?
» 'ప్రాణహిత-చేవెళ్ల' వివరాలివ్వండి
» నీటిపారుదల శాఖను కోరిన జస్టిస్ ఘోష్ కమిషన్

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద వేర్వేరు ఎత్తులతో బ్యారేజీ నిర్మిస్తే కలిగే ముంపును తెలిపే సూచీ పటాలు, టోపోషీట్లు అందించాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నీటిపారుదల శాఖ అధికారులను కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 195 టీఎంసీల జలాల ఎత్తిపోత, బ్యారేజీలు, ఆఫ్‌లైన్ రిజర్వాయర్ల నిర్వహణ సాధ్యమయ్యే పనేనా? దీనిపై ఏమైనా అధ్యయనాలు చేశారా? అని కమిషన్ ప్రశ్నించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్‌కు ఇప్పటిదాకా (జూన్ 28 వరకు) అఫిడవిట్ల రూపంలో అరకొర సమాచారాన్ని మాత్రమే ఇంజనీర్లు అందించగా.. సమగ్రంగా, మరింత అదనపు సమాచారం కోరుతూ నీటిపారుదల శాఖకు కమిషన్ లేఖ రాసింది.

అలా ఎందుకు వాడారు?

బ్యారేజీల స్థలాల ఎంపికకు నిర్వహించిన సర్వేలు, విచారణ విషయంలో నీటిపారుదల శాఖలో అంతర్గతంగా సాగిన ఫైళ్ల వివరాలను అందించాలని కమిషన్ కోరింది. బ్యారేజీల నిర్మాణం చేపట్టడానికి ముందు డ్రాయింగ్‌ల తయారీ కోసం సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్(సీడీవో) చీఫ్ ఇంజనీర్‌కు క్షేత్ర స్థాయి అధికారులు పంపించిన సైట్ సర్వే నివేదికలను సైతం సమర్పించాలంది. మేడిగడ్డ బ్యారేజీ పునాది-సీకెంట్ పైల్స్ మధ్య గ్యాప్ ఉండాలని, రెండింటికీ జాయింట్ ఇవ్వాలని చేసిన ప్రతిపాదనలకు గల కారణాలను తెలపాలని సూచించింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునాది దిగువనే సీకెంట్ పైల్స్ వినియోగించగా.. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో తద్విరుద్ధంగా ఉండడానికి కారణం ఏంటని ప్రశ్నించింది. దేశంలో జలాశయాల నిర్మాణంలో సీకెంట్ పైల్స్‌ను వాడే ఆనవాయితీ లేదని, ఈ నేపథ్యంలో వీటి వినియోగంపై సాంకేతిక చర్చలు జరిగాయా? అని కమిషన్ ప్రశ్నించింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను సమర్పించాలని హైడ్రాలజీ విభాగం సీఈని కమిషన్ ఆదేశించింది. కేంద్రం నుంచి ప్రాజెక్టుకు వచ్చిన అనుమతులు, ఈ విషయంలో జరిగిన ఫైళ్లు/ఉత్తర ప్రత్యుత్తరాల సమాచారం వివరాలను సమర్పించాలని నిర్దేశించింది. ప్రాజెక్టుకు నీటి లభ్యతపై అధ్యయనాలతో పాటు ఈ విషయంలో సీడబ్ల్యూసీతో జరిగిన సంప్రదింపుల సమాచారాన్ని అందించాలని సూచించింది. ఇక బ్యారేజీల నిర్మాణానికి పరిపాలన అనుమతుల కోసం పంపిన ప్రతిపాదనల విషయంలో జరిగిన సంప్రదింపుల వివరాలనూ కమిషన్ కోరింది. వ్యాప్కోస్ 2016 జనవరి 17న సమర్పించిన మూడు బ్యారేజీల డీపీఆర్‌లను అందించాలంది. బ్యారేజీల నిర్మాణానికి ఇచ్చిన సాంకేతిక అనుమతుల పత్రాలు కూడా సమర్పించాలని నిర్దేశించింది.

బ్యారేజీల వైఫల్యాలపై నివేదిక ఇవ్వండి

మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీలకు గల కారణాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని క్వాలిటీ కంట్రోల్ విభాగం సీఈని కమిషన్ కోరింది. క్షేత్ర స్థాయి ఇంజనీర్లు అందించిన నివేదిక తర్వాత నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ బ్యారేజీల మరమ్మతులకు చేసిన సిఫారసుల వివరాలు కూడా అందించాలని తెలిపింది. ఇక బ్యారేజీల గేట్ల నిర్వహణపై నమూనా అధ్యయనాలు ఏమైనా జరిగాయా? బ్యారేజీల నిర్వహణపై ప్రొటోకాల్, మ్యానువల్, మార్గదర్శకాలపై రామగుండం సీఈతో వాలంతరీ డీజీ, తెలంగాణ ఇంజనీరింగ్ రిసెర్చ్ ల్యాబ్ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల వివరాలు అందించాలని కమిషన్ స్పష్టం చేసింది. ఆనకట్టల భద్రత చట్టం-2021ని అనుసరించి, వర్షాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీల స్థితిగతులపై నివేదికలు ఏమైనా తెప్పించుకున్నారా? అని ఆరా తీసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 2 జూలై 2024
diksuchi@andhrajyothy.com

ఎన్‌ఎఫ్‌ఎస్‌సీలో బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్)



నాగ్‌పూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీస్ కాలేజ్(ఎన్ఎఫ్ఎస్‌సీ)- బీటెక్(ఫైర్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత వివరాలు

గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ/టెక్నికల్ ఒకేషనల్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024లో అర్హత స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 2
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 4న
- **అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపిణీ:** జూలై 5న
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్:** జూలై 18, 19
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** జూలై 23న
- **అడ్మిషన్స్ తేదీ:** జూలై 29
- **వెబ్‌సైట్:** https://nfscbtechadmis-sions. com/

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ కోర్సు

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)-'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి నాలుగు నెలలు. ఈ ప్రోగ్రామ్‌ను ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ఆన్‌లైన్ అసెస్‌మెంట్, అసైన్‌మెంట్, ప్రజంటేషన్, ప్రాజెక్ట్ వర్క్‌లు, కేస్ స్టడీస్, క్విజ్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్నల్&ఫైనల్ ఎగ్జామినేషన్స్ ఉంటాయి. లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైమ్ యాక్సెస్, కోర్సు మెటీరియల్ ఇస్తారు. ఇండస్ట్రీ లీడర్స్, మిడిల్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, ఫ్రెషర్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

కోర్సు వివరాలు

- వారాంతాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం అయిదు వరకు క్యాంపస్‌లో తరగతులు నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ డాక్యుమెంటేషన్ 30 గంటలు, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ పాలసీ 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్స్ 30 గంటలు, కస్టమ్ రెగ్యులేషన్స్ అండ్ ఇంపోర్ట్ ప్రొసీజర్స్ ఆఫ్ ఇండియా 20 గంటలు, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ 30 గంటలు తరగతులు నిర్వహిస్తారు. ఇంటర్నల్, ఫైనల్ ఎగ్జామ్స్‌ను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్ ఇస్తారు.

అర్హత

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** iift.ac.in

జేఎన్‌టీయూఏలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్



అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్ (బీటెక్&బీఎస్+ఎంఎస్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి మూడేళ్లు జేఎన్‌టీయూఏ-కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో, చివరి మూడేళ్లు బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది అంటే బీటీహెచ్‌లో ఒక సంవత్సరం చదివిన తరవాత ప్రోగ్రామ్‌నుంచి వైదొలగే వీలుంది. వీరికి జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్ డిగ్రీ, బీటీహెచ్ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తాయి. మిగిలిన రెండేళ్ల ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది. సీఎస్ఈ విభాగంలో 20 సీట్లు, ఈసీఈ విభాగంలో 10 సీట్లు ఉన్నాయి. జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ద్వారా 50 శాతం సీట్లను; ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ద్వారా మిగిలిన 50 శాతం సీట్లను భర్తీ చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన అవేర్‌నెస్ సెషన్‌ను జూలై 20న సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహిస్తారు. స్వీడన్‌లో ఎంఎస్ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు అక్కడే మరో ఏడాది రెసిడెన్స్ పర్మిట్ పొందవచ్చు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

ప్రోగ్రామ్ స్పెషలైజేషన్‌లు

- జేఎన్‌టీయూఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మొదటి మూడేళ్లు బీటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్), బీటీహెచ్‌లో నాలుగో ఏడాది బీఎస్(కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) చదవాల్సి ఉంటుంది.
- బీటీహెచ్‌లో చివరి రెండేళ్ల ఎంఎస్ ప్రోగ్రామ్‌లో సీఎస్ఈ అభ్యర్థులకు కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్‌లు; ఈసీఈ అభ్యర్థులకు మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్ అండ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్ ఉంటాయి.

అర్హత

- బీఐఈ(ఏపీ)/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ఉండాలి. ఆంగ్ల మాధ్యమంలో చదవని అభ్యర్థులకు ఐఈఎల్‌టీఎస్/టోఫెల్ స్కోర్ ఉండాలి. ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5, మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్; టోఫెల్‌లో అయితే 575/90 స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- పూర్తిచేసిన దరఖాస్తును కింది ఈ-మెయిల్‌కు అప్‌లోడ్ చేయాలి.
- **అడ్మిషన్ కౌన్సెలింగ్:** జూలై 29న
- **కౌన్సెలింగ్ వేదిక:** డైరెక్టర్ ఆఫ్ ఫారిన్ అఫైర్స్ అండ్ అలూమ్నీ మ్యాటర్స్ కార్యాలయం, జేఎన్‌టీయూఏ, అనంతపురం.
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, జేఎన్‌టీయూఏ, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515002
- **ఈ-మెయిల్:** indiarelations@bth.se, dfaam@jntua.ac.in
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

ఐఐటీ మద్రాస్‌లో ఎంబీఏ- డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్

మద్రాస్‌లోని ద ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ప్రపంచంలోనే తొలిసారిగా వినూత్నమైన కోర్సు 'డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్'ని అందుబాటులోకి తెచ్చింది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సముద్ర వాణిజ్యం, సరఫరా వ్యవస్థ యాజమాన్య పద్ధతుల్లో ఎదురయ్యే సంక్లిష్టతలను అధిగమించేందుకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలను ఈ కోర్సు ద్వారా పెంపొందించుకోవచ్చు. రెండేళ్ల వ్యవధి గల ఈ కోర్సును ఐఐటీ మద్రాస్‌కి చెందిన డిపార్ట్‌మెంట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఓషన్ ఇంజనీరింగ్ రూపొందించాయి. తొలి బ్యాచ్ 2024 సెప్టెంబరులో ప్రారంభం కాబోతుంది.

- **ఎంబీఏ ఇన్ డిజిటల్ మారిటైమ్ అండ్ సప్లయ్ చైన్**

వ్యవధి: రెండేళ్లు.

ప్రోగ్రామ్ వివరాలు: ఐఓటీ, ఏఐ, ఎంఎల్, బ్లాక్ చెయిన్ వంటి డిజిటల్ టెక్నాలజీపై నైపుణ్యాలు సాధిస్తారు. 900 గంటలు క్లాస్ రూమ్ సెషన్స్, ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. కోర్సుకి మొత్తం 192 క్రెడిట్స్ నిర్దేశించారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కి ఆన్‌లైన్, ఆన్ క్యాంపస్ మాడ్యూల్స్ అందుబాటులో ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన తరవాత ఐఐటీ మద్రాస్ ఆలూమ్నీ స్టేటస్ కూడా లభిస్తుంది. అదేవిధంగా ఐఐటీ మద్రాస్ ఇన్‌క్యుబేషన్ అండ్ స్టార్టప్ ప్లాట్‌ఫాం ద్వారా ఉద్యోగావకాశాలు పొందే సౌలభ్యం కూడా ఉంది.

అర్హత: అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల పూర్తి స్థాయి(ఫుల్ టైం) పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: వచ్చిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్‌లిస్ట్ చేస్తారు. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.


కోర్సు ఫీజు: రూ.9,00,000. వాయిదాల పద్ధతిలో చెల్లించవచ్చు. అర్హులైన వారికి బ్యాంక్ రుణ సదుపాయం కూడా ఉంటుంది.

వెబ్‌సైట్: https://www.iitm.ac.in/



జాబ్ కార్నర్

ఎన్‌హెచ్‌బీలో వివిధ ఖాళీలు



న్యూఢిల్లీలోని నేషనల్ హౌసింగ్ బ్యాంక్(ఎన్‌హెచ్‌బీ)...కాంట్రాక్ట్/రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 48

రెగ్యులర్ పోస్టులు

1. జనరల్ మేనేజర్(స్కేల్-7): 1 పోస్టు
2. అసిస్టెంట్ జనరల్ మేనేజర్(స్కేల్-5): 1 పోస్టు
3. డిప్యూటీ మేనేజర్(స్కేల్-2): 3 పోస్టులు
4. అసిస్టెంట్ మేనేజర్(స్కేల్-1): 18 పోస్టులు

కాంట్రాక్ట్ పోస్టులు

1. చీఫ్ ఎకనామిస్ట్: 1 పోస్టు
2. సీనియర్ ప్రాజెక్ట్ ఫైనాన్స్ ఆఫీసర్: 10 పోస్టులు
3. ప్రాజెక్ట్ ఫైనాన్స్ ఆఫీసర్: 12 పోస్టులు
4. ప్రోటోకాల్ ఆఫీసర్: 1 పోస్టు
5. అప్లికేషన్ డెవలపర్: 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/ఐసీఏఐ/సీఎఫ్ఏ/ఎంబీఏ(ఫైనాన్స్), బీఈ, బీటెక్(సీఎస్/ఐటీ)/ఎంసీఏ/ఎంటెక్(సీఎస్/ఐటీ)/బీఎస్సీ(సీఎస్/ఐటీ)/ఎమ్మెస్సీ(సీఎస్/ఐటీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.850. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.175

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూలై 19

వెబ్‌సైట్: https://www.nhb.org.in/

హిందుస్థాన్ కాపర్‌లో జూనియర్ మేనేజర్లు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్...వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: జూనియర్ మేనేజర్

ఖాళీలు: 56

విభాగాలు: మైనింగ్, ఎలక్ట్రికల్, కంపెనీ సెక్రటరీ, ఫైనాన్స్, హెచ్‌ఆర్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 2024 జూన్ 1 నాటికి 40 సంవత్సరాలు మించకూడదు

పే స్కేల్: నెలకు రూ.30,000- రూ.1,20,000

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 21

వెబ్‌సైట్: https://www.hindustancopper.com/

ఐఐఎస్ఎస్‌లో రీసెర్చ్ పోస్టులు

భోపాల్(మధ్యప్రదేశ్)లోని ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సాయిల్ సైన్స్...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. **సీనియర్ రీసెర్చ్ ఫెలో: 1 పోస్టు**
2. **యంగ్ ప్రొఫెషనల్-1: 1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్ స్కోరు, పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు రూ.31,000. యంగ్ ప్రొఫెషనల్-1కు రూ.30,000 చెల్లిస్తారు.

వయోపరిమితి: సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు మహిళలకు గరిష్ఠంగా 40 ఏళ్లు, పురుషులకు 35 ఏళ్లు, యంగ్ ప్రొఫెషనల్-1 పోస్టుకు 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీలు: జూలై 5, 8

వేదిక: ఐసీఏఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సాయిల్ సైన్స్, నబీబాగ్, బెరాసియా రోడ్, భోపాల్, మధ్యప్రదేశ్

వెబ్‌సైట్: https://iiss.icar.gov.in/

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో అప్రెంటిస్‌లు



న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం, మానవ వనరుల విభాగం....కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అప్రెంటిస్

ఖాళీలు: 2,700(ఏపీలో 27, తెలంగాణలో 34 ఖాళీలున్నాయి)

వయసు: 2024 జూన్ 30 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టయిపెండ్: నెలకు రూరల్/సెమీ అర్బన్‌లో రూ.10,000. పట్టణ ప్రాంతాల్లో రూ.12,000, మెట్రో ప్రాంతంలో రూ.15,000 చెల్లిస్తారు.

శిక్షణ వ్యవధి: ఏడాది

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది.

ఆన్‌లైన్ రాత పరీక్ష: జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు- 25 మార్కులు), జనరల్ ఇంగ్లిష్(25 ప్రశ్నలు- 25 మార్కులు), క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు- 25 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్(25 ప్రశ్నలు-25 మార్కులు).

పరీక్ష వ్యవధి: 60 నిమిషాలు

పరీక్ష మాధ్యమం: ఇంగ్లిష్/హిందీ

దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీలకు రూ.994. మహిళలు/ఎస్సీ/ఎస్టీలకు రూ.708. దివ్యాంగులకు రూ.472.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 14

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: జూలై 28


వెబ్‌సైట్: https://www.pnbindia.in/

లిటిల్స్



పరోపకారం


ఒక ఆశ్రమంలో గురువు గారి వద్ద అజేయుడు, విజయుడు అనే ఇద్దరు రాకుమారులు విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నారు. గురువుగారు వారిద్దరికీ ఒక పరీక్ష పెట్టదలచి, వారిని దగ్గరకు పిలిచి ఇలా చెప్పారు. 'నాయనలారా మన ఆశ్రమానికి చాలా దూరంలో ఉన్న ఆటవికుల గుహల్లో ఒక అరుదైన మణి ఉంది దాన్ని ఎవరు ముందుగా తెచ్చిస్తే వారే మీ ఇద్దరిలో విజేత. ఈ మాటలు విన్న రాకుమారులు ఇద్దరూ వెంటనే బయల్దేరి ఆటవికుల గుహల వైపు ప్రయాణం సాగించారు. దారిలో వారికి బాగా దెబ్బలు తగిలి కింద పడిపోయిన ఒక వ్యక్తి కనిపించాడు. ఇతనితో మనకెందుకు విజయా పోదాం పద అని అజేయుడు ముందుకు వెళ్లిపోయాడు విజయుడు మాత్రం ఆగి, అతనికి సపర్యలు చేసి, మంచి నీళ్లు తాగించి, అతని నివాసం వద్ద వదిలేశాడు. కొంచెం సేపటి తర్వాత అజేయుడు, విజయుడు ఆటవికుల గుహల వద్ద కలిశారు. విజయుడు ఆ ఆటవికులతో చక్కగా మాట్లాడి గురువుగారు చెప్పిన మణిని వారి దగ్గరనుండి తీసుకున్నాడు. అంత సులువుగా మణిని ఎలా ఇచ్చారు? వీరు చాలా క్రూరులు అని గురువుగారు చెప్పారే అని విజయుడిని అడిగాడు అజేయుడు. దారిలో మనకు దెబ్బలు తగిలి కనిపించిన బాటసారి వీరి చేతిలో దెబ్బలు తిన్న వాడే. అతన్ని నేను కాపాడినందుకు కృతజ్ఞతగా ఆటవికులతో ఎలా మాట్లాడితే మణి దొరుకుతుందో చెప్పాడు. ఆపదలో ఉన్న వారికి మనం సాయం చేస్తే, మనకు కూడా మంచిదే, దేవుడు మనకు మరొక వైపునుండి సాయం పంపుతాడు అన్నాడు విజయుడు. గురువుగారు విజయుడిని విజేతగా ప్రకటించి, ఆ ఇద్దరి పరోపకార బుద్ధిని అభినందించాడు.



దారి కనుక్కోండి




10 తేడాలు గుర్తించండి!



ఏవి ఎన్ని



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 347

	9		1	6				
			7		9	6		5
					3			8
5				9				
9	8	4		2		7	3	6
				3				4
2			9					
4		7	8		6			
				7	2		4	

సుడోకు - 346 సమాధానం

3	2	8	6	9	4	7	1	5
5	6	9	7	2	1	4	3	8
7	1	4	8	5	3	9	6	2
2	7	6	9	4	8	1	5	3
1	9	5	2	3	6	8	7	4
4	8	3	5	1	7	6	2	9
9	3	1	4	7	2	5	8	6
6	5	7	3	8	9	2	4	1
8	4	2	1	6	5	3	9	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.